www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 244 | శుక్రవారం | 23 ఫిబ్రవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

బోణీ రూ.200 కోట్లు

స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టయిన తొలి రోజునే బాండ్ల ద్వారా బల్దియా సేకరణ



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీ బ్యూరో : బాండ్లతో మొదటి దశలో రూ.200 కోట్ల నిధులు సమీకరించిన మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) అధికారికంగా ముంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ లిస్టింగ్‌లో గురువారం నమోదైంది. జిహెచ్ఎంసి కేంద్ర కార్యాలయంలో అట్టహాసంగా నిర్వహించిన ఈ లిస్టింగ్ కార్యక్రమంలో తరువాయి 6లో

భవిష్యత్తు బయోదే

- బయోసైన్స్ రంగంలోని ఉపాధి,పరిశోధన విభాగాల్లో విస్తృత అవకాశాలు
- రాష్ట్రంలో నెలకొంటున్న జీనోం వ్యాలీ ఆసియాలోనే అతిపెద్ద ఫార్మాసిటీ : బయో ఏషియా–2018 సదస్సులో కెటిఆర్



మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రపంచంలోనే అతి పెద్ద ఫార్మా సిటీని తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి కెటిఆర్ తెలిపారు. హైదరాబాద్ సమీపంలో 19 వేల ఎకరాల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తున్నామని, ప్రపం చ స్థాయి ప్రమాణాలతో ఇది అతి పెద్ద ఫార్మాసిటీ గా గుర్తింపు పొందుతుందని వ్యాఖ్యానించారు. 'బయో ఏషియా – 2018' సదస్సును గురువారం నగరంలోని హెచ్ఐసిసిలో ప్రారంభించిన సందర్భంగా మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ, బయో సైన్స్‌లో ఉపాధి, పరిశోధనా రంగాల్లో విస్తృత్తమైన అవకాశాలున్నాయని, తెలిపారు. తాను కూడా బయో సైన్స్ స్టూడెంట్‌నేనని, అమెరికాలోని డల్లాస్‌లో తరువాయి 6లో





రైతు కార్పొరేషన్

- రూ.200కోట్ల మూలధనంతో తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి కార్పొరేషన్ అవతరణ
- ఉత్తర్వులు విడుదల
- డైరెక్టర్లుగా అధికారులు, రైతు ప్రతినిధులు
- లాభాపేక్ష లేకుండా నిధులు వినియోగం, రైతు సంక్షేమమే లక్ష్యం : సిఎం కెసిఆర్

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి పేరిట కొత్త కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీని విధివిధానాలు, లక్ష్యాలను కూడా ప్రకటించింది. వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్, ఉద్యాన శాఖ కమిషనర్, ఆర్థిక శాఖ నుంచి నామినేట్ అయిన ఒకరు, రైతు ప్రతినిధులు, సమితి ఎమ్‌డి ఈ కార్పొరేషన్‌కు డైరెక్టర్లుగా ఉంటారు. ఈ మేరకు 2013 కంపెనీల చట్టం ప్రకారం కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సి. పార్థసారధి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రూ. 200 కోట్లు మూలధనంతో ఏర్పాటైన ఈ కార్పొరేషన్‌లో కేవలం రూ. 700 మినహా మిగిలిన మొత్తమంతా గవర్నర్ పేరుమీద షేర్ల రూపంలో ఉంటున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. 70 షేర్లు మినహా మిగిలిన షేర్లన్నీ గవర్నర్ పేరు మీదే ఉంటాయి. వ్యవసాయ శాఖ కార్యదర్శి, కమిషనర్, ఆయిల్‌ఫెడ్ ఎండి, ఉద్యానవనశాఖ కమిషనర్, ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్, 'అపెడా' డిజిఎంలు తలా పదిషేర్ల చొప్పున తలా రూ. 100 పెట్టుబడి ఉంటుంది. పూర్తిస్థాయి ఎమ్‌డిని నియమించే వరకు వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ ఎం. జగన్‌మోహన్ కొనసాగనున్నారు. క్రాప్ కాలనీలు, పంటల ఉత్పాదకతను పెంచేందుకు రైతు సమన్వయ సమితి ప్రణాళికలు తయారు చేసి అమలు చేయనుందని పేర్కొన్నారు. డిమాండ్, సప్లై ఆధారంగా పంటల సాగును ప్రోత్సాహించనుంది. సమితి రైతులకు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇవ్వనుంది. చిన్న, మధ్య తరహా రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ సదుపాయం తరువాయి 6లో

విక్రమ్ కొఠారీ, రాహుల్ అరెస్టు

సిబిఐ నిర్బంధంలో రోటోమాక్ అధినేత, ఆయన కుమారుడు



న్యూఢిల్లీ : బ్యాంకుల సముదాయాలకు భారీ మోసం కేసులో రోటొమాక్ అధినేత విక్రమ్ కొఠారీ, ఆయన కుమారుడు రాహుల్‌లను గురువారం సిబిఐ అరెస్టు చేసింది. రూ 3695 కోట్ల మేరకు రోటొమాక్ సంస్థ రుణాల ఎగవేతకు, అక్రమాలకు పాల్పడిందని కేసులు నమోదయ్యాయి. పలు దఫాలుగా ఇప్పటికే రోటొమాక్ అధినేతను సిబిఐ ఇంటరాగేట్ చేసింది. నమోదు చేసన కేసు మేరకు వివిధ బ్యాంకులకు కంపెనీ ఎగవేతల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బ్యాంక్ ఆఫ్ ఇండియా : రూ 754.77 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా : రూ 456.63 కోట్లు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ : రూ 771.07 కోట్లు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా : రై 458.95 కోట్లు, అలహాబాద్ బ్యాంక్ : రూ 330. 68 కోట్లు, బ్యాంక్ ఆఫ్ తరువాయి 6లో

నీరవ్ మోడీ సెజ్‌పై నజర్



- రంగారెడ్డి జిల్లా రావిరాలలోని వజ్రాల పార్కును ఏమి చేయాలి
- ఉద్యోగుల భవిష్యత్ ఏమిటి అని యోచిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం కేసులో సోదాలు జరిపిన ఇడి

మన తెలంగాణ / హైదరాబాద్ : పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంతో సంబంధం ఉన్న గీతాంజలి గ్రూపుకు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం సమీపంలోని రావిరాల గ్రామంలో ఉన్న గీతాంజలి జెమ్స్ పార్క్ (స్పెషల్ ఎకమామిక్ జోన్)పై తెలంగాణ రాష్ట్ర అధికారులు దృష్టి సారించారు. పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి, తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థకు చెందిన అధికారులు సచివాలయంలో గురువారం సాయంత్రం సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ సెజ్‌ను ఏం చేద్దామనేదానిపై లోతుగా చర్చించారు. లీగల్ అభిప్రాయం తీసుకోవాలని, ఆ తర్వాత ఢిల్లీ వెళ్ళి వాణిజ్యమంత్రిత్వశాఖలో సెజ్ వ్యవహారాలను చూసే అధికారులతో భేటీ కావాలని నిర్ణయం జరిగింది. ప్రస్తుతానికి సెజ్‌లో ఎన్ని యూనిట్లు పని చేస్తున్నాయి, ఎంత మందికి ఉపాధి అవకాశాలు లభించాయి, మొత్తం కేటాయించిన భూమిలో ఎంత మేరకు వినియోగంలో ఉంది, ఎంత ఖాళీగా ఉంది, ఈ భూమిపైన గీతాంజలి గ్రూపు పొందిన రుణాలెంత తదితర వివరాలను టిఎస్ఐఐసి అధికారులు సేకరించనున్నారు. 'సెజ్' పేరుతో అనుమతి మంజూరైనందువల్ల ఇప్పటికిప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదని, కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ నిర్ణయం మేరకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించాల్సి ఉంటుందని టిఎస్ఐఐసి ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు. పూర్తిస్థాయిలో వివరాలను సేకరించిన తర్వాత లీగల్ అభిప్రాయాన్ని తీసుకుని త్వరలోనే ఢిల్లీ వెళ్ళి సంప్రదింపులు జరిపిన తర్వాతనే స్పష్టమైన నిర్ణయం తీసుకోడానికి వీలవుతుందని వ్యాఖ్యానించారు. యుపిఏ హయాంలో పన్నెండేళ్ళ క్రితం గీతాంజలి గ్రూపుకు 'జెమ్స్‌సెజ్' ('రాజీవ్‌జెమ్స్ పార్క్'గా పేరు మారింది) పేరుతో రావిరాల గ్రామంలో మంజూరైన 171 ఎకరాల స్థలంలో ప్రస్తుతం ఐదు యూనిట్లు పనిచేస్తున్నాయని, ఇందులో సుమారు 600 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం తర్వాత తరువాయి 6లో

ముదురుతున్న పేచీ!

టిఎస్‌పిఎస్‌సి, సెంటర్ ఫర్ గుడ్‌గవర్నెన్స్ మధ్య లేఖల యుద్ధం

- తీవ్రంగా తీసుకున్న ప్రభుత్వం
- సమస్యలు, సమన్వయ లోపంపై త్వరలో రెండు విభాగాల భేటీ

మన తెలంగాణ/ హైదరాబాద్ : పోటీ పరీక్షలను నిర్వహిస్తున్న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, సాంకేతిక సహకారం ఇస్తున్న సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌ల మధ్య జరుగుతున్న లేఖల యుద్ధాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. గత నాలుగైదు రోజులుగా ఈ రెండు సంస్థలూ లేఖల్లో ఒకరిని మరొకరు నిందించుకునే తీరులో విమర్శలు చేసుకోవడం ప్రభుత్వానికి అప్రతిష్ఠ తీసుకొస్తోందని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోటీ పరీక్షలకు విద్యార్థులు హెచ్చు సంఖ్యలో హాజరవుతున్నప్పుడు హాల్‌టికెట్ల జారీ మొదలు అనేక రకాలుగా ఆటంకాలు ఏర్పడుతుండడం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని అధికారులు అభిప్రాయపడ్డారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరచూ నిబంధనలు మారుస్తోందని, దానికి అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాల్సి రావడం, తగిన సమయం లేకపోవడంతో ఇబ్బందుల వస్తున్నాయని సిజిజి పరస్పరం ఆరోపించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రెండు సంస్థల ప్రతినిధులను సంయుక్తంగా సమావేశపర్చి లేఖల యుద్ధానికి తెర దించడంతో పాటు మెరుగైన సమన్వయం ద్వారా లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తిచేయడంపై దృష్టి సారించనున్నట్లు ఓ సీనియర్ అధికారి వ్యాఖ్యానించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో సిబ్బంది కొరత, తరచూ మార్పులు చేయడానికి ఉన్న నేపథ్యం తదితరాలతోపాటు తరువాయి 6లో

కుంచెపోటు



అప్పుడు స్కూలు ఉత్తర కొరియా– అమెరికా లాగా తయారవుతుంది!



గాంధీభవన్‌లో గురువారం జరిగిన సేవాదళ్ సదస్సులో మాట్లాడుతున్న ఉత్తమ్

యువతకు ప్రాధాన్యం

- కాంగ్రెస్‌లో యువతరానికి అగ్రస్థానం కల్పిస్తామని రాహుల్‌గాంధీ మాట ఇచ్చారు : కుంటియా
- 26 నుంచి జనంలోకి వెళ్తున్నాం : సేవాదళ్ సదస్సులో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్: ఈ నెల 26 నుండి ప్రారంభమయ్యే కాంగ్రెస్ ప్రజా చైతన్య యాత్రలో భాగంగా టిఆర్ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిలదీస్తామని, కాంగ్రెస్ ఇచ్చే హామీలను వివరిస్తామని టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.అంతేకాకుండా నియంతృత్వ పద్ధతులను, అవినీతి, అక్రమాలను, మానవ హక్కుల ఉల్లంఘనలను,అన్నివర్గాలను మోసం చేసిన తీరులను వివరించి ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. గాంధీభవన్ ఆవరణలోని ఇందిరాభవన్‌లో గురువారం నాడు జరిగిన సేవాదళ్ సదస్సు జరిగింది. సేవాదళ్ చైర్మన్ కనుకుల జనార్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉత్తమ్, ఎఐసిసి ఇంచార్జ్ రాంచంద్ర కుంటియా, కాంగ్రెస్ నేతలు షబ్బీర్ అలీ, భట్టి విక్రమార్క, ఎం.ఎ ఖాన్, పొంగులేటి సుధాకర్ రెడ్డి, తరువాయి 6లో

మిర్చి ఘాటు

గిట్టుబాటు ధర కోసం ఖమ్మం మార్కెట్‌యార్డులో మళ్ళీ ఆందోళనబాట పట్టిన మిర్చి రైతులు

మన తెలంగాణ/ఖమ్మం వ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మళ్లి మిర్చి సెగ తగిలింది. గతేడాది మార్కెట్‌లో జరిగిన ఘటనలను మరువక ముందే మళ్లీ రైతులు గిట్టుబాటు ధర లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన బాట పట్టారు. వ్యాపారులు, అధికారులు కుమ్మక్కై ధరలను తగ్గిస్తున్నారని ఆరోపించారు. గురువారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు 60వేల బస్తాలకు పైగా మిర్చి విక్రయానికి వచ్చింది. జెండాపాట రూ.9,702లు నిర్ణయించినప్పటికీ ఎక్కువ తరువాయి 6లో



సిఎం, ప్రగతిభవన్‌కు పోస్ట్‌కార్డులతో నిరుద్యోగుల నిరసన

మన తెలంగాణ/హైదరాబాద్: నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే కార్యాచరణ ప్రకటించాలని కోరుతూ సిఎం కెసిఆర్‌కు టిజెఎసి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున పోస్ట్‌కార్డులను రాశారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని నిరసిస్తూ గురువారం 'పోస్ట్‌కార్డుల ఉద్యమం' చేపట్టింది. నిరుద్యోగ సమస్యపై ఇప్పటికే టిజెఎసి చైర్మన్ ప్రొ.కోదండరామ్ నిరసన కార్యక్రమాలను నిర్వహించిన విషయం తెలిసిందే. గతేడాది ఇదే రోజున నిరుద్యోగ నిరసన ర్యాలీకి ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోగా, కోదండరామ్ ఇంటి తలుపులు బద్దలు కొట్టి ఆయనను అరెస్టు చేశారు. ఆ తర్వాత జెఎసి హైదరాబాద్‌లో కొలువుల కోట్లాట, క్షేత్రస్థాయిలో జిల్లాల వారిగా సదస్సులు, సమావేశాలను నిర్వహించిన జెఎసి తాజాగా నిరుద్యోగ సమ్యలను ప్రగతిభవన్‌కు చేరవేసేలా 'పోస్ట్‌కార్డుల'ను పోస్ట్ చేసేందుకు పూనుకున్నది. ప్రభుత్వ ఖాళీలను కుదించే ప్రయత్నాలను మానుకోవాలని, స్థానిక పరిశ్రమలలో ఉద్యోగావకాశాలను స్థానికులకే రిజర్వు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని, నిరుద్యోగ భృతిని కల్పించాలని ఆ పోస్ట్‌కార్డులో పేర్కొన్నారు. ఒయులో బ్లాక్ బెలూన్లు ఎగరేసిన జెఎసి విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు.



పెండింగ్ పనుల పూర్తికి మంత్రి హరీశ్ ఆదేశం

మన తెలంగాణ/హైదరాబాద్: ఆన్ గోయింగ్ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తిచేసి నాలుగు ప్రాజెక్టుల కింద నిర్ణీత ఆయకట్టుకు నీరివ్వాలని ఆయన కోరారు. పాత పాలమూరు జిల్లాలోని కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలపై మంత్రి సమీక్షించారు. శుక్ర, శని వారాల్లో రెండు రోజుల పాటు పాలమూరు జిల్లాలో తాను పర్యటిస్తానని స్పష్టం చేశారు. పెండింగ్ భూసేకరణ, ఇసుక రీచ్‌లు తదితర సమస్యలపై చర్చిస్తానన్నారు. భూసేకరణ సమస్యలు ఇంకా ఉండడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా ప్రాజెక్టులపై సమీక్షిస్తానని చెప్పారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలో భూసేరణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. నత్తనడకన పనులు జరుగుతున్న ఏజెన్సీలను గుర్తించి, 60 సి నిబంధన కింద టర్మినేట్ చేసి వేరే ఏజెన్సీలకు పనులు అప్పగించాలన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతలకు శ్రీశైలం నుంచి నీటి విడుదల కొనసాగుతున్నందున మూడు నెలలుగా నిర్మాణ పనులకు అంతరాయం ఏర్పడిందని ఇంజినీర్లు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ నెలాఖరులో నీటి విడుదల ఆపేసి, మరమ్మతులు, కాల్వల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మంత్రి స్పష్టం చేశారు. కల్వకుర్తి లిఫ్టు 3లో నాలుగు పంపులు పనిచేస్తున్నాయని, 5వ పంపు బిగింపు పనులను మార్చి నాటికి పూర్తికి చేయాలని మంత్రి ఆదేశించారు. లిఫ్టు 2 నుంచి 3 వరకు తవ్విన టన్నెల్‌లో 1.2 కిలోమీటర్ల లైనింగ్ పనులను జులై వరకు పూర్తిచేయాలన్నారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల కింద ఇప్పటికే 5 లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తున్నామన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో 15వేల ఎకరాలకు సాగునీరు అందించే ఉద్దేశంతో తలపెట్టనున్న చంద్రసాగర్ ఎక్స్‌టెన్షన్ కెనాల్ నిర్మాణ పనుల ప్రతిపాదనలు పంపించాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ ఇఎన్‌సి మురళీధరరావు, మహబూబ్‌నగర్ ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్ ఖగేందర్‌రావు, ఎస్ఇలు బద్రయ్య, రఘునాధరావు తదితరులు పాల్గొన్నారు.

కళ్లు చెదిరే ఆస్తులు!

- ఆదిలాబాద్ మున్సిపల్ డిఇ ఇంట్లో అవినీతి నిరోధక శాఖ సోదాలు
- రూ. 8కోట్ల అక్రమ ఆస్తుల గుర్తింపు
- రూ 2.60 లక్షల నగదు, 13తులాల బంగారం స్వాధీనం



డిఇ నివాసంలో అధికారుల సోదా



నిందితుడు కొండల్‌రావు

మన తెలంగాణ/ఆదిలాబాద్: ఎనిమిది కోట్ల అక్రమ ఆస్తులు.. ఉన్నచోటే 2.60 లక్షల నగదు, 13 తులాల బంగారం! ఆదిలాబాద్ మున్సిపల్ డిఇ కొండరాల్‌రావు కళ్లు చెదిరేలా ఆస్తులను కూడబెట్టారు. గురువారం అవినీతి నిరోధక శాఖ ఏకకాలంలో జరిపిన దాడుల్లో ఈ అక్రమ ఆస్తుల చిట్టా బయటపడింది. ఎసిబి ఒకేసారి కొత్తగూడెం, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో సోదాలు చేసింది. జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో అద్దెకుంటున్న ఇంట్లో ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు సోదాలు చేశారు. రూ. 2.60 లక్షల నగదుతో పాటు 13తులాల బంగారు ఆభరణాలు, పలు కీలక డాక్యుమెంట్లు, బ్యాంక్ ఖాతాల పాస్ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. మూడు చోట్ల సోదాలు జరుపగా రూ.8 కోట్ల అక్రమ ఆస్తులున్నట్లు అధికారులు పేర్కొన్నారు. డిఇ కొండల్‌రావ్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఉన్న లాకర్‌ను తెరిస్తే మరిన్ని అక్రమ ఆస్తులు బయటపడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. విచారణ పూర్తయిన తర్వాత డిఇ కొండల్ రావుపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నా రు. ఈ దాడుల్లో ఎసిబి డిఎస్‌పి కిరణ్, సిఐలు సతీష్, వేణుగోపాల్, సంజీవ్, సిబ్బంది ఉన్నారు. మరోవైపు తనది సంపన్న కుటుంబమని, ఇదంతా తన తాతలు సంపాదించిన ఆస్తేనని డిఇ కొండల్‌రావు తెలిపారు. కావాలనే తనపై ఈ దాడులు జరిగాయని పేర్కొన్నారు.

క్రెడిట్ కార్డులతో బ్యాంక్‌లకు కుచ్చుటోపీ

- 10 మంది అరెస్టు, రూ. 6.90 లక్షలు స్వాధీనం



మన తెలంగాణ/సిటీబ్యూరో: నకిలీ ఉద్యోగాలు, ధ్రువీకరణ పత్రాలు, సిమ్‌కార్డులతో క్రెడిట్ కార్డులను పొంది బ్యాంకుల నుంచి ఓ ముఠా రూ. కోటీ 52 లక్షలను కాజేసింది. ఈ ముఠాను నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి, వీరి వద్దనుంచి రూ. 6.90 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. 2013–15 మధ్యకాలంలో ఈ మోసం జరిగింది. రెండేళ్లుగా విచారణ చేస్తూ 10 మంది నిందితులను అరెస్టు చేశారు. గురువారం నగర పోలీసు కమిషనర్ వివి శ్రీనివాస్‌రావు తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. తుర్కయాంజాల్‌కు చెందిన ప్రధాన నిందితుడు కుంభం రంగారెడ్డి(32) తేలికగా నగదును సంపాదించడంలో భాగంగా నకిలీ పరిణిక నామో సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ఏర్పాటు చేశాడు. దీంతో ఆ సంస్థలో 48మంది ఉద్యోగులు పనిచేస్తున్నట్టు సృష్టించాడు. వారి జీతభత్యాలను చెల్లించేందుకు గానూ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో 48 మందిపేరు మీద ఖాతాలను తెరిచాడు. ఖాతాలను తెరిచేందుకు నకిలీ చిరునామాలతో ఓటర్ ఐడిలు, నకిలీ పాన్ కార్డులను తయారు చేయించాడు. వీటి ఆధారంతో హెచ్‌డిఎఫ్‌సిలో ఖాతాలను తెరిచి 48 మందికి మూడు నెలలు జీతాలను జమ చేశాడు. ఈ తతంగం జరగడంలో రంగారెడ్డి బావమరిది తిప్పర్తి వినయ్‌కుమార్ రెడ్డి సహకారం అందించాడు. బ్యాంకు ఏజెంట్లకు కొంత నగదును చెల్లించి కార్డులను పొంది, ఎటిఎం కేంద్రాల నుంచి రూ. 45.72 లక్షలను తీసుకున్నాడు. అనంతరం ఫోన్‌లకు స్పందించకపోవడం, నకిలీ చిరునామాలు ఉండడంతో బ్యాంక్ అధికారులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. అలాగే ఎస్‌బిఐ నుంచి తీసుకున్న 33 క్రెడిట్ కార్డుల ద్వారా రూ. 25.28 లక్షలు, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ నుంచి తీసుకున్న 41 కార్డుల ద్వారా రూ. 77.84 లక్షలను ఎటిఎంల నుండి సేకరించుకున్నాడు. ఆర్‌బిఎల్ నుంచి రూ. 3.26 లక్షలను సేకరించాడు. మొత్తం నాలుగు బ్యాంకుల నుంచి 125 క్రెడిట్ కార్డులను సేకరించి రూ. 1.52 కోట్లు మోసంగా పొందాడు.

నిందితులు వీరే: హయత్‌నగర్‌కు చెందిన మేకా సంతోష్‌రెడ్డి, మక్కల నరేశ్, వరికుప్పల శ్రీకాంత్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఉద్యోగి గోపతోటి కిషోర్‌బాబు, పార్క్ కన్సల్టెన్సీ– హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఫీల్డ్ వెరిఫికేషన్ ఏజెంట్ గోరంట్ల శైలేష్ కుమార్, ఎస్‌బిఐ ఉద్యోగి రెడ్డిపల్లి సందీప్‌కుమార్, ఉప్పు ఆనంద్‌తో పాటు సహకరించిన ముద్దునూరు పరమేశ్ కుమార్, రంగారెడ్డి చేసిన మోసంలో భాగస్వాములుగా ఉన్నారని పోలీసుల విచారణలో తేలడంతో వారిని అరెస్టు చేసినట్టు చెప్పారు.

పార్టీ ఏర్పాటుకు ఎన్నికల సంఘానికి జెఎసి దరఖాస్తు

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ జెఎసి ఏర్పాటు చేయనున్న 'తెలంగాణ జన సమితి' పేరుతో రాజకీయ పార్టీ ఏర్పాటు కోసం ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకుంది. దీంతో పార్టీ ఆవిర్భావ సభ ఏర్పాట్లపై జెఎసి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ఇప్పటికే సభ ఆవిర్భావ సన్నాహక కమిటీని ఏర్పాటు చేయాలని తీర్మానించిన స్టీరింగ్ కమిటీ దీనికి సంబంధించిన ప్రక్రియను మరింత వేగం చేసింది. కాగా తొలుత మిలియన్ మార్చ్ జరిగిన మార్చి 10న పార్టీ ఆవిర్భావ సభను నిర్వహించాలని భావించారు. అదే రోజు మిలియన్‌మార్చ్‌కు గుర్తుగా భావ సారూప్యత కలిగిన పార్టీలు ఉమ్మడిగా ఒక కార్యక్రమాన్ని నిర్వహించాలనే నిర్ణయానికి వచ్చిన నేపథ్యంలో ఆవిర్భావ సభను మరో రోజు నిర్వహించాలని భావిస్తున్నారు. కోదండరామ్ తన విదేశీ పర్యాటన ముగించుకుని హైదరాబాద్‌కు రాగానే సన్నాహక కమిటీ ఏర్పాటు, భారీ బహిరంగ సభకు సంబంధించిన అంశాలపై చర్చించే అవకాశాలు ఉన్నాయి. కాగా ఆవిర్భావ సభను భారీగా నిర్వహించేందుకు జెఎసి శ్రేణులు సన్నద్ధమవుతున్నారు.

ఉద్యమకారులను వేధించిన వారికే పెత్తనం

- బిజెఎల్‌పి నేత కిషన్‌రెడ్డి



మన తెలంగాణ/హైదరాబాద్: ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమకారులను వేధించినవారే టిఆర్‌ఎస్ ప్రభుత్వంలో పెత్తనం చెలాయిస్తున్నారని బిజెఎల్‌పి నేత జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. సిఎం కెసిఆర్ వెంట తెలంగాణను వ్యతిరేకించినవారే ఉన్నారన్నారు. రాష్ట్రంలో టిఆర్‌ఎస్ కాంగ్రెస్, బిజెపిల మధ్యనే రాజకీయపోరు సాగనుందని చెప్పారు. హైదరాబాద్‌లో బిజెపి రాష్ట్ర ఒబిసి మోర్చా కమిటీ ఆధ్వర్యంలో గురువారం పదాధికారుల వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీ నుంచి పార్లమెంట్ సభ్యుల వరకు టిఆర్‌ఎస్ ప్రభుత్వం పార్టీ ఫిరాయింపులను ప్రొత్సహిస్తూ ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో రై తుల ఆత్మహత్యలు పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, కేంద్ర పథకాలు రాష్ట్రంలో అమలు కావడం లేదని ఆరోపించారు. ఎంఎల్‌సి రాంచంద్రరావు మాట్లాడుతూ బిసి రిజర్వేషన్‌పై టిఆర్‌ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఎంబిసిల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రూ.1000 కోట్లలో ఇప్పటి వరకు ఎంత ఖర్చు చేసిందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ యాదవ్, జాతీయ కార్యవర్గ సభ్యులు శేఖర్‌రావు తదితరులున్నారు.

పదేళ్లుగా మరో మహిళతో సహజీవనం

- డిసిపి బాబురావు అరాచకాలను బయటపెట్టిన భార్య
- డిజిపికి కలిసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

మన తెలంగాణ/హైదరాబాద్: హైదరాబాద్ సాయుధ రిజర్వ్ పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో విధులు నిర్వహిస్తున్న డిసిపి బాబురావు మోసాలు, అరాచకాలపై చర్యలు తీసుకోవాలంటూ గురువారం అతడి భార్య వేదశ్రీ డిజిపి మహేందర్‌రెడ్డిని ఆశ్రయించారు. ఎస్‌పి హోదాలో పనిచేస్తున్న తన భర్త పాతబస్తీకి చెందిన ఒక మహిళతో సహజీవనం చేస్తున్నట్లు పేర్కొంది. అంతేకాకుండా తనను, తన పిల్లలను నిర్లక్ష్యం చేస్తున్నాడని, విజయవాడలో తన పేరున ఉన్న రూ.కోటి విలువచేసే భూమిని వారిద్దరూ కలిసి అక్రమంగా అమ్మేశారని డిజిపికి ఇచ్చిన ఫిర్యాదులో వేదశ్రీ ఆరోపించారు. బాబురావుపై ఇప్పటికే వివిధ కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయని, అధికారాన్ని అడ్డుపెట్టుకుని కేసులను నీరుగారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. అక్రమంగా తన భూమిని అమ్మినట్లు విజయవాడ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆధారాలు ఉన్నాయని, దస్తావేజుల్లో ఆ మహిళ వేలి ముద్రలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ బాబురావు కోర్టులో విడాకుల పిటిషన్ దాఖలు చేశారని ఆరోపించారు. పోలీసు శాఖలో కానిస్టేబుళ్లు, ఎస్‌ఐలు, సిఐలు వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యవహారాల్లో వారిపై శాఖపరమైన చర్యలు తీసుకున్నారని, అలాగే బాబురావుపై శాఖపరమైన విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

తెలుగు రాష్ట్రాల సిఎస్‌లకు నోటీసులు

మన తెలంగాణ/న్యూఢిల్లీ: రెండు తెలు గు రాష్ట్రాలలోని ప్రైవేట్, కార్పోరేట్ కళా శాలలో మేనేజ్‌మెంట్‌ల ఒత్తిళ్ల వల్ల ఆత్మ హత్యలు జరుగుతున్నాయంటూ వచ్చిన ఫిర్యాదుపై నేషన్ హ్యూమన్ రైట్స్ కమీష న్ రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. ప్రైవేట్, కార్పోరేట్ కాలేజీల్లో వి ద్యార్థులపై ఒత్తిళ్లే ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయంటూ సుప్రీంకోర్టు న్యాయ వాది శ్రవణ్ కుమార్ గురువారం ఎన్ హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పం దించిన ఎన్‌హెచ్‌ఆర్సీ నాలుగు వారాల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని ఇరు రాష్ట్రాల సిఎస్‌లకు ఆదేశించింది.

నాగంను ఎలా తీసుకుంటారు?

మన తెలంగాణ/హైదరాబాద్: స్థానిక నేతలను సంప్రదించకుండా ఇతర పార్టీ నేతలను తీసుకోవడం మంచి సంప్రదాయం కాదని కాంగ్రెస్ ఎంఎల్‌సి కె.దామోదర్‌రెడ్డి అన్నారు. తన పుట్టుకే కాంగ్రెస్‌కి వ్యతిరేకమని ప్రకటించిన మాజీ మంత్రి నాగం జనార్థన్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి ఎలా తీసుకుంటారో పార్టీ చెప్పాలన్నారు. సిఎల్‌పి కార్యాల యంలో గురువారం ఆయన మీ డియా ప్రతినిధులతో ఇష్టాగోష్టి గా మాట్లాడారు. 20 ఏళ్లుగా నాగర్‌కర్నూల్‌లో నాగంతో పోరాడుతున్నామన్నారు. తాను ఎంఎల్‌సిగా గెలిచినా రోజే నాగం పార్టీలోకి వస్తే బాగుండేదన్నారు. ఇప్పుడు నాగం పార్టీలోకి వచ్చినా కాంగ్రెస్‌కు ఓట్లు వచ్చే ఛాన్స్ లేదన్నారు. తమను కాదని నాగంను పార్టీలో చేర్చుకుంటే తాము సైలెంట్‌గా ఉంటాం తప్ప సహకరించబోమని స్పష్టం చేశారు. హైకమాండ్‌కు, టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఈ పరిస్థితి వివరించామని, రాహుల్‌కి కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.



ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కించపర్చొద్దు : చంద్రబాబు

అనంతపురం: ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కించపర్చితే సహించేది లేదని ఎపి సిఎం , టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు హెచ్చరించారు. పెనుగొండలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. విభజన చట్టంలో పేర్కొన్న హామీల అమలు కోసమే తాము పోరాడుతున్నామని ఆయన చెప్పారు. ఎపికి న్యాయం చేయాల్సిందేనని ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను కేంద్రం పట్టించుకోకపోవడం వల్ల రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని, దీని వల్ల రాష్ట్రానికే నష్టం జరుగుతుందని ఆయన చెప్పారు. హేతుబద్ధత లేకుండా కాంగ్రెస్ రాష్ట్ర విభజన చేయడంతో ఎపి తీవ్రంగా నష్టపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదని, ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని చెప్పిన కేంద్రం ఇప్పుడు ఎపికి అన్యాయం చేస్తుందని ఆయన వాపోయారు. రాష్ట్ర విభజన సమయంలో నాటి ప్రభుత్వం రాజ్యసభలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ తాను 29 సార్లు ఢిల్లీకి వెళ్లినట్లు ఆయన చెప్పారు. మూడున్నరేళ్లలో కేంద్రం ఎపికి అరకొరగా మాత్రమే నిధులు ఇచ్చిందే తప్ప, పూర్తిస్థాయిలో హామీలు నెరవేర్చలేదని ఆయన పేర్కొన్నారు. కేంద్రం చేయాల్సిన సహాయంపై రాజీపడబోమని ఆయన తేల్చి చెప్పారు. గురువారం ఆయన పెనుకొండలో కియా మోటార్స్ సంస్థ ప్రేమ్ ఇన్‌స్టలేషన్ విభాగం ప్రారంభోత్సవంలో కూడా పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికులను ఆదుకోవడంలో టిఆర్ఎస్ విఫలం : కుంటియా



మన తెలంగాణ/హైదరాబాద్: గల్ఫ్‌లో ఉన్న తెలంగాణ కార్మికులను ఆదుకోవడంలో టిఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఎఐసిసి ఇన్‌చార్జి ఆర్.సి కుంటియా విమర్శించారు. గాంధీభవన్‌లో మాజీ ఎం.పి హనుమంతరావు, ఎన్ఆర్ఐ సెల్ చైర్మన్ వినోద్ కుమార్‌తో కలిసి గురువారం నాడు ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కువైట్ ప్రభుత్వం ప్రకటించి అమ్నెస్టీ పథకంలో తిరిగి దేశానికి రావాలనుకుంటున్న వారు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇటీవల తాము వినోద్ కుమార్, దేవేందర్ రెడ్డి తదితరులు కువైట్ వెళ్లి అక్కడ భారతీయులతో సమావేశమయ్యాయని, సుమారు 20మందికి విమాన ప్రయాణ ఖర్చులకు ఆర్థిక సహాయం అందించామన్నారు. క్షమాభిక్ష పథకాన్ని ఏప్రిల్ 22 వరకు పొడిగించినా ప్రభుత్వం నుంచి స్పందన లేదని విమర్శించారు. సుమారు 14వేల మందికి వెనక్కి వచ్చేందుకు టిక్కెట్ల డబ్బులు లేవని, అందులో వెయ్యి మందికి మాత్రమే కేంద్రం నిధులు ఏర్పాటు చేసిందన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత కువైట్‌లో బతుకు దెరువు కోసం వెళ్లి అక్కడ అనేక కారణాలతో చేత దాదాపు 600 మంది తెలంగాణ వారు మరణించినా పట్టించుకోలేదన్నారు. తక్షణమే తెలంగాణ ప్రభుత్వం ఒక మంత్రిని అక్కడికి పంపి తెలంగాణ వాసులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

త్వరలో కాంగ్రెస్ బిసి నేతల యాత్ర

మన తెలంగాణ/హైదరాబాద్: త్వరలో కాంగ్రెస్ బిసి నేతలు రాష్ట్ర వ్యాప్తంగా యాత్ర చేపట్టనున్నారు. అన్ని జిల్లాల్లో బిసిల సంఖ్య అధికంగా ఉన్న నియోజకవర్గాలను , కాంగ్రెస్ అభ్యర్థులుగా సమర్థ బిసి నేతలను గుర్తించేందుకు ఈ యాత్ర చేపట్టనున్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా బలంగా ఉన్న బిసి నేతలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవాలని, అలాగే బలమైన బిసినేతలను కూడా గుర్తించనున్నారు.ఇటీవల ఏర్పాటు చేసిన బిసి సాధికార కమిటీ చైర్మన్ టి.నాగయ్య అధ్యక్షతన గాంధీభవన్‌లో గురువారం కమిటీ సమావేశం జరిగింది. బిసిల అంశాలపై తొంభై రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఈ కమిటీని పార్టీ ఆదేశించింది. ఈ నేపథ్యంలో రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలను అధ్యయనం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించాలని కమిటీ సమావేశం నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. త్వరలో జరిగే కాంగ్రెస్ బస్సుయాత్రతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా సాధికారిత కమిటీ వేర్వేరుగా వంద నుంచి 200 కార్ల కాన్వాయ్‌తో వివిధ మార్గాలలో జిల్లాల పర్యటన చేయాలని ఒక నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. వచ్చే ఎన్నికల్లో లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో రెండు స్థానాలకు తక్కువ కాకుండా బిసిలకు కేటాయించాలనే సిఫార్సు చేయడంతో పాటు, అందుకు అనువైన నియోజకవర్గాలను యాత్రలో భాగంగా గుర్తించనున్నారు. వివిధ అంశాలకు సంబంధించి క్షేత్ర స్థాయి సమాచారాన్ని సేకరించేందుకు ప్రత్యేకంగా ఎనిమిది సబ్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా బిసి జనాభా ఏ ప్రాంతంలో అధికంగా ఉన్నదో గుర్తించేందుకు, కుల సంఘాలు, బిసి సమస్యలు, డిమాండ్లు సబ్ కమిటీ వేశారు. కాగా టిఆర్ఎస్ ఇచ్చిన హామీల వల్ల ఏ మేరకు న్యాయం జరుగుతుంది..? ఎంత ప్రయోజనం కలుగుతుంది? బిసిలు ఏం కావాలని అనుకుంటున్నారో ఇలా పలు అంశాలపై మరో కమిటీ, బిసి మేథావులను ఒక్క తాటి మీదకు తీసుకొచ్చేందుకు మరో కమిటీని వేశారు. ఈ కమిటీలన్నీ ఏకకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో పర్యటించి, ఎవరికి కేటాయించిన బాధ్యతలను వారు పూర్తి చేసి, ఎవరికివారే తమ నివేదికలను రూపొందించనున్నారు. ఈ నివేదికలన్నీ పిసిసి క్రోడీకరించి వాటిని ఎఐసిసికి సమర్పిస్తారు.

సిబిఐ అదుపులో బ్యాంకు ఉద్యోగులు

మన తెలంగాణ/హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అజీజ్‌నగర్ శాఖలో వెలుగు చూసిన రూ.9 కోట్ల కుంభకోణం కేసులో సిబిఐ అధికారులు దర్యాప్తును ముమ్మరం చేసి గురువారం ఐదుగురు బ్యాంకు ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నారు. మేనేజర్ శ్రీనివాస్, క్యాషియర్ జైపాల్‌రెడ్డి, సీపర్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు ఉద్యోగులను ప్రశ్నిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటివరకు 11మంది నిందితులను గుర్తించారు. ఖాతాదారుల డిపాజిట్లను అక్రమంగా డ్రా చేసుకున్న బ్యాంక్ ఉద్యోగులు ఆ డబ్బును వారి సొంతానికి వాడుకున్నట్లు ఓ ఖాతాదారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొలుత మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేయగా, ఆ తర్వాత దర్యాప్తు సిబిఐకి బదిలీ అయింది. దర్యాప్తులో భాగంగా సిబిఐ అధికారులు బ్యాంక్ రికార్డులను సీజ్ చేశారు, డిపాజిటర్ల నుంచి కూడా వాంగ్మూలాలు సేకరించారు. డిపాజిటర్ల డబ్బుతో ఎక్కడెక్కడ ఆస్తులు ఖరీదు చేశారనే అంశంపై నిందితులను సిబిఐ అధికారులు ప్రశ్నిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలోని పలుచోట్ల, హైదరాబాద్ నగరంలో ప్లాట్లను, ఖాళీ స్థలాలను, వ్యవసాయ భూములను ఖరీదు చేసినట్లు సిబిఐ దర్యాప్తులో తేలింది. వాటికి సంబంధించిన డాక్యుమెంట్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. నిందితుల ఇళ్లలో కూడా సోదాలు నిర్వహించి కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సిబిఐ డిఐజి చంద్రశేఖర్ నేతృత్వంలో జరుగుతున్న ఈ కేసు దర్యాప్తులో భాగంగా మిగతా నిందితులను కూడా అదుపులోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

పురుషోత్తమరెడ్డికి 6 రోజుల కస్టడీ

మన తెలంగాణ/హైదరాబాద్ : ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో హెచ్ఎండిఎ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తమరెడ్డిని ఆరు రోజుల ఎసిబి కస్టడీకి నాంపల్లి ఎసిబి ప్రత్యేక న్యాయస్థానం ఆదేశించింది. ఈ నెల 2వ తేదీన ఎసిబి అధికారులు పురుషోత్తమరెడ్డి ఇంటిపై దాడి చేసి రూ.5 కోట్ల ఆస్తులను సీజ్ చేసుకోవడం, నాలుగు రోజుల క్రితం ఎసిబి కోర్టులో లొంగిపోవడం, ఆస్తులు బినామీల పేర్లపై కూడబెట్టినట్లు దర్యాప్తులో తేలడం తదితరాల నేపథ్యంలో అతన్ని విచారించేందుకు అనుమతి ఇవ్వాలంటూ ఎసిబి అధికారులు వేసిన పిటిషన్‌ను విచారించిన కోర్టు ఈ నెల 23నుంచి 28 వరకు పోలీసు కస్టడీకి అనుమతించింది. చంచల్‌గూడ జైలులో ఉన్న ఆయన్ను శుక్రవారం 9 గంటలకు ఎసిబి అధికారులు కస్టడీలోకి తీసుకోనున్నారు. అతన్ని విచారించేందుకు ఎసిబి అధికారులు ప్రశ్నలను సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే బినామీలైన బిల్డర్లు నిశాంత్‌రెడ్డి, యాదవరెడ్డిలను అరెస్టు చేశారు.

బావ మరిదికి 14 రోజుల రిమాండ్: ఇదిలావుండగా పురుషోత్తంరెడ్డి బావమరిది శ్రీనివాస్‌రెడ్డిని ఎసిబి అధికారులు గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్ విధించడంతో అతన్ని చంచల్‌గూడ జైలుకు తరలించారు. పురుషోత్తంరెడ్డి కేసులో అరెస్టుల సంఖ్య నాలుగుకు చేరినట్లయింది.



పాదయాత్రకు 15 రోజులేనా?

గడువు విధింపుపై కాంగ్రెస్ నేతల్లో అసంతృప్తి







మన తెలంగాణ/హైదరాబాద్: పాదయాత్రలకు అనుమతి లభించినా కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో మీమాంస నెలకొంది. ఒకవైపు తమ యాత్రలకు అనుమతి లభించిందన్న ఆనందం ఉన్నప్పటికీ, ఒకే సమయంలో మూడు పాదయాత్రలకు అనుమతించడంపై వారిలో అసంతృప్తి కలిగిస్తోంది. దాంతో పాటుగా కేవలం 15రోజులు మాత్రమే పాదయాత్రకు సమయమివ్వడంపై వారు నిరాశకు గురవుతున్నారు. కాంగ్రెస్ చేపట్టిన రాష్ట్ర వ్యాప్త బస్సు యాత్ర ముగింపు దశలో మే 15న టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, ఉపాధ్యక్షులు, మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్, ఎంఎల్ఎలు ఎ.రేవంత్‌రెడ్డిల పాదయాత్రలు చేసేందుకు అధిష్టానం అనుమతి లభించింది. అదే రోజు నుంచి ఎఐసిసి కార్యదర్శి, మాజీ ఎంపి వి.హనుమంతరావు రాష్ట్రవ్యాప్త రథయాత్ర నిర్వహణకు కూడా గ్రీన్ సిగ్నల్ వచ్చింది. వీరంతా తమ యాత్రలకు అనుమతి కోసం ఎన్నో రోజుల నుంచి ఎదురు చూస్తున్నారు. అటు పార్టీలో, ఇటు ప్రజల్లో తమ కంటూ ప్రత్యేక గుర్తింపుతో పాటు తిరుగులేని నాయకునిగా ఎదిగేందుకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో పాదయాత్రల వైపు మొగ్గు చూపారు. అయితే మూడు పాదయాత్రలకు ఒకేసారి నిర్వహించాలని అధిష్టానం చెప్పడంతో వారికి అనుమతి లభించిన ఆనందం ఎంతోసేపు నిలవలేదు. గతంలో ప్రతిపక్ష నాయకుడిగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి ఎపి అంతటా 'ప్రజా ప్రస్థానం' పేరుతో చేసిన పాదయాత్ర నాటి రాజకీయాలనే మలుపు తిప్పింది. అనేక గ్రూపులు, నాయకుల సమ్మేళనమైన కాంగ్రెస్ పార్టీలో ఆ పాదయాత్ర తరువాత రాజశేఖరరెడ్డి పై చేయి సాధించడమే కాకుండా తదుపరి ఎన్నికల్లో ముఖ్యమంత్రి పదవిని అధిష్టించారు. ఇదే తరహాలో అందరూ పాదయాత్రలకు సిద్ధమయ్యారు. కాని కేవలం 15 రోజుల సమయమే ఇవ్వడంతో అది ఏ మాత్రం సరిపోదని, రాష్ట్ర వ్యాప్తంగా అటుంచి కనీసం సొంత జిల్లాలో కూడా పూర్తి స్థాయిలతో పాదయాత్ర చేయలేరని ఆ నాయకుల సన్నిహితులు వాపోతున్నారు. బస్సుయాత్ర, పాదయాత్రల ముగింపు సందర్భంగా జూన్ 1వ తేదీన నిర్వహించే రాహుల్ గాంధీ బహిరంగ సభ తరువాత కూడా తమ నేతలు పాదయాత్రలు కొనసాగిస్తారని వారు ఘంటాపథంగా చెబుతున్నారు.

ఎక్కడి నుండి మొదలెడదాం?: ఎక్కడి నుండి పాదయాత్ర మొదలెట్టాలనే అంశంపై కూడా ఇంకా స్పష్టత రాలేదు. పదిహేను రోజుల సమయమే ఉన్నందున ముగ్గురికి మూడు పాత జిల్లాల్లో తిరిగేలా రూట్ మ్యాప్ ఇస్తే బాగుంటుందని పిసిసి సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. ఆత్మగౌరవం, రైతుల సమస్యలు అనే అంశాలపై పాదయాత్ర చేపట్టాలని వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క భావిస్తున్నారు. మిర్చి రైతులు అరెస్ట్ అయిన ఖమ్మం మార్కెట్ యార్డు, ఇసుక మాఫియా వ్యవహారంలో దళితులపై పోలీసుల దాష్టీకం జరిగిన సిరిసిల్ల నియోజకవర్గ ప్రధాన కేంద్రాలలో ఒకచోట పాదయాత్రను ప్రారంభించి మరోచోట ముగించాలని గతంలో చర్చలు జరిగాయి. ఇంకా దీనిపై తుది రూపం రాలేదు. మరో నేత, శాసనసభ్యులు ఎ.రేవంత్‌రెడ్డి అవినీతి, నిరుద్యోగం, ప్రభుత్వ అక్రమాలపై అలంపూర్ నుండి ఇంద్రవెల్లి వరకు పాదయాత్ర చేస్తారనే ప్రచారం సాగుతోంది. మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ మాత్రం బాసర నుంచి పాదయాత్ర మొదలు పెట్టేందుకు మొగ్గు చూపుతున్నారు. మరోవైపు గతంలో రాష్ట్రవ్యాప్త యాత్ర చేస్తామన్న కోమటిరెడ్డి బ్రదర్స్ ఈ వ్యవహారంపై గుంభనంగా ఉన్నారు.

రథయాత్ర వాయిదా? : ఇన్ని యాత్రల నడుమ తన రథయాత్ర నిర్వహిస్తే బాగుండదేమోననే ఉద్దేశ్యంలో విహెచ్ తన రథయాత్రను వాయిదా వేసుకోవాలని భావిస్తున్నారు. ఈ నెల 26 నుంచి బస్సుయాత్ర ప్రారంభమవుతండడంతో, ఆ యాత్రలోనే మొత్తం పాల్గొనాలని అనుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని ఇప్పటికే ప్రకటించిన విహెచ్, ఎన్నికలు దగ్గర పడినప్పుడు అందరూ నేతలు తమ నియోజకవర్గాల్లో బిజీగా ఉన్న సమయంలో రాష్ట్ర వ్యాప్త రథయాత్ర నిర్వహించే యోచనలో ఉన్నారు.

నాకూ అనుమతివ్వండి : డి.కె.అరుణ



పాదయాత్ర చేసేందుకు తనకు అనుమతి ఇవ్వాలని మాజీ మంత్రి డి.కె.అరుణ కోరారు. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి కుంటియాకు విజ్ఞప్తి చేశారు. జోగులాంబ ఆలయం నుంచి అదిలాబాద్ వరకు పాదయాత్ర చేయాలని అరుణ భావిస్తున్నారు. గతంలో మహబూబ్‌నగర్ ప్రాజెక్టుల కోసం 2003లో గద్వాల నుండి అసెంబ్లీ వరకు, ఇటీవల గద్వాల జిల్లాలోని గద్వాల నుండి జోగులాంబ ఆలయం వరకు ఆమె పాదయాత్రలు చేశారు.

మహిళా యూనివర్శిటీగా కోఠి ఉమెన్స్ కాలేజీ



- సిఎం ఆమోదంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం
- ఉప ముఖ్యమంత్రి కడియం
- కళాశాలలో ఆకస్మిక తనిఖీ

మన తెలంగాణ/హైదరాబాద్ : కోఠి మహిళా కళాశాలను తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంగా మార్చేందుకు అన్ని అర్హతలు, వసతులున్నాయని ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ కడియం శ్రీహరి తెలిపారు. సిఎం కెసిఆర్ ఆమోదంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ కళాశాలను తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంగా మారుస్తామని చెప్పారు. గురువారం కళాశాలలో మంత్రి ఆకస్మిక తనిఖీలు చేశారు. దాదాపు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కళాశాల పరిసరాలను, భవనాలను పరిశీలించారు. ఈ కళాశాలలో బోధనా వసతులు బాగున్నాయని, కళాశాల వాతావరణం విద్యార్థినులకు అనుకూలంగా ఉందని వ్యాఖ్యానించారు. ఉమ్మడి రాష్ట్రంలో తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉండగా, విభజన తర్వాత తెలంగాణకు మహిళా విశ్వవిద్యాలయమే లేకుండా పోయిందన్నారు. ఈ విషయాన్ని ఇటీవల కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ దృష్టికి తీసుకువెళ్లానని, పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి మహిళా వర్శిటీ ఏర్పాటు చేయాలని, ఇందుకు కేంద్రం తగిన సాయం చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. కోఠి ఉమెన్స్ కళాశాలను మహిళా యూనివర్శిటీగా ప్రారంభించడానికి కావాల్సిన మౌలిక వసతులు, సదుపాయాలపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని 31 జిల్లాల విద్యార్థినులతో పాటు విదేశాలకు చెందిన చాలామంది ఈ కళాశాలలో చదువుతున్నారని, ప్రస్తుతం 42 యుజి కోర్సులు, పిజి కోర్సులు ఉన్నాయని, కానీ పరిశోధన మాత్రం లేదని తెలిపారు. ఈ తనిఖీలో మంత్రి కడియంతో పాటు కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిట్టల్, ఒయు విసి రామచంద్రం, రిజిస్ట్రార్ గోపాల్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్ ఆత్మ తదతరులున్నారు.

మరో ఐదు ఎర్రజొన్న కొనుగోలు కేంద్రాలు

మన తెలంగాణ/హైదరాబాద్: రైతుల సౌకర్యార్థం నూతనంగా మరో ఐదు ఎర్రజొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. ఆర్మూర్ ఎంఎల్ఏ జీవన్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు మంత్రి స్పందించారు. ఆర్మూర్‌లోని డొంకేశ్వర్, ఆలూర్, ఖుద్వాన్‌పూర్, పిప్రి, గోవింద పేటలలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం ఐదు కొనుగోలు కేంద్రాల ద్వారా ఎర్రజొన్నలను కొనుగోలు చేస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న 5 కేంద్రాల్లో రేపటి నుంచే కొనుగోళ్లు ప్రారంభం కానున్నట్లు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



కాళేశ్వరం తుది అనుమతిపై ఆశలు

మన తెలంగాణ/హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుకు తుది అనుమతి మరో రెండు వారాల్లో లభించే అవకాశాలున్నాయని సాగు నీటి పారుదల శాఖ అధికారులు ధీమాతో ఉన్నారు. 10 రోజుల తర్వాత ఢిల్లీలో టిఎసి (టెక్నికల్ అప్రైజల్ కమిటీ) సమావేశం జరగనుందని, ఈ అంశాన్ని కూడా ఎజెండాలో పెట్టినట్లు తెలిసింది. మూడు రోజుల క్రితం నగరంలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల మంత్రుల సమావేశం సందర్భంగా తుది అనుమతి అంశంపై కేంద్ర అధికారులతో రాష్ట్ర అధికారులు చర్చించినట్లు తెలిసింది. టిఎసి అనుమతి వస్తే కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేదా గోదావరి బోర్డు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయడానికి అవకాశం ఉండదు. కాళేశ్వరం ప్రాజెక్టు అధికారులు, ఇరిగేషన్ అధికారులు ఇప్పటికే కేంద్ర జల సంఘం అధికారులతో తుది అనుమతికి అవసరమైన అంశాలపై క్రమం సంప్రదింపులు జరుపుతున్నారు. టిఎసి అనుమతులు లభించిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హో దా అంశంపై సిఎం కెసిఆర్ ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాసే అవకాశం ఉంది. ఇప్పటికే కేంద్రానికి జాతీయ హోదా కోరుతూ లేఖ రాసినా, అనుమతులన్నీ వచ్చిన తర్వాత ఆలోచిద్దామని సూచించినట్లు తెలిసింది.

23 నెలల్లో రూ.578 కోట్లు ఆదా



- 16,812 రేషన్ షాపుల్లో ఇ-పాస్ విధానం
- పౌరసరఫరాల శాఖ కమిషనర్ సి.వి.ఆనంద్

మన తెలంగాణ/హైదరాబాద్: 'ప్రజా పంపిణీ వ్యవస్థలో లబ్ధిదారులకు చేరాల్సిన రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా, డీలర్లు అక్రమాలకు పాల్పడకుండా చెక్ పెట్టడంలో ఇపాస్ విధానం విజయవంతమైంది. రాష్ట్రంలో 212 రేషను దుకాణాలు మినహా మిగిలిన దుకాణాల్లో ఇ-పాస్ (ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్) యంత్రాలు వినియోగిస్తున్నాం' అని ఆ శాఖ కమిషనర్ సివి ఆనంద్ తెలిపారు. గురువారం సివిల్ సప్లై భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇ-పాస్ విధానం అమలు తీరుతెన్నులపై కమిషనర్ వివరించారు. 2016లో నగరంలో 1,545 షాపుల్లో ప్రయోగాత్మకంగా ఇ-పాస్ విధానాన్ని ప్రారంభించామని, ఆ తర్వాత నగదు రహిత లావాదేవీలను జోడించామన్నారు. ఆశించిన ఫలితాలు రావడంతో ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి తెచ్చామని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 17,024 రేషన్ షాపుల్లో 16,812 షాపుల్లో విజయవంతంగా ఇ-పాస్ విధానం అమలవుతోందని, సరైన సిగ్నల్ నెట్‌వర్క్ లేనందున 212 దుకాణాల్లో అమలు చేయడం లేదని పేర్కొన్నారు. అందువల్ల ఈ దుకాణాల్లో 'ఆఫ్‌లైన్' విధానంలో వినియోగదారుల బయోమెట్రిక్ వివరాలను తీసుకుని సరుకుల పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఇ-పాస్ విధానం అమలులోకి వచ్చిన తర్వాత నెలకు సగటున 20వేల మెట్రిక్ టన్నుల బియ్యం మిగులుతున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 23నెలల్లో 4.20 కోట్ల లావాదేవీలు జరిగాయని, ప్రభుత్వానికి 2,15,759 మెట్రిక్ టన్నుల బియ్యం మిగలగా, రూ. 578.90 కోట్లు ఆదా జరిగిందని వెల్లడించారు. రేషన్ దుకాణాల్లో తీసుకువచ్చిన సంస్కరణలు సత్ఫలిస్తున్నాయని తెలిపారు. రేషన్ పోర్టబులిటీకి మంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు. ఇక నుంచి ప్రతి నెల 1వ తేదీ నుంచి 15 వరకు సెలవులు లేకుండా కచ్చితంగా రేషన్ సరుకులు పంపిణీ చేయాలని ఈ సందర్భంగా కమిషనర్ సివి ఆనంద్ స్పష్టం చేశారు.

కృష్ణా జలాల పంపిణీపై నేడు విచారణ

మన తెలంగాణ/న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఎదుట గురువారం నుండి వాదనలు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే విచారణ కోసం ఇరురాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులు బుధవారమే ఢిల్లీ చేరుకున్నారు. ఎపి సాక్షి కేవీ సుబ్బారావు అనారోగ్యం కారణంగా గత నెల 31 న జరగాల్సిన విచారణ గురువారానికి వాయిదా పడింది. గురువారం జరిగిన విచారణకు కూడా హాజరుకాలేనని సుబ్బారావు స్పష్టం చేయడంతో , ఆయనకు బదులుగా ఏపీ తరపున వ్యవసాయ రంగం నిపుణుడు సత్యనారాయణను, తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది రవీందర్ రావు క్రాస్ ఎగ్జామిన్ చేశారు. ఎపి ప్రభుత్వం తరపున సత్యనారాయణ దాఖలు చేసిన అఫిడవిట్‌పై రవీందర్ రావు పలు ప్రశ్నలు సంధించారు. ఎపి అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది ఏకే గంగూలి, గుంటూరు ప్రభాకర్ లు ఎపి తరపున గురువారం జరిగిన విచారణకు హాజరు కాగా, తెలంగాణ నుండి అడ్వకేట్ ఆన్ రికార్డ్స్ కృష్ణస్వామి లు హాజరయ్యారు. శుక్రవారం కూడా విచారణ కొనసాగనున్నది.




24ఏళ్ల పోరాటంలో తొలిసారి

- వర్గీకరణ చట్టబద్ధత కోసం మార్చి 13న రాష్ట్ర బంద్
- ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



మన తెలంగాణ/హైదరాబాద్: ఎస్‌సి వర్గీకరణ చట్టబద్ధతకు మార్చి 13న రాష్ట్ర బంద్‌కు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. 24 ఏళ్ల పోరాటంలో మొదటిసారి 24 గంటల బంద్‌కు పిలుపునిస్తున్నామని, ఈ బంద్‌కు అన్ని వర్గాలు సహకరించాలని కోరారు. ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణ డిమాండ్‌తో నిర్వహిస్తున్న బంద్‌కు అన్ని పార్టీల మద్దతు కోరుతున్నామని తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మందకృష్ణ మాదిగ మాట్లాడారు. అధికారంలోకి వస్తే 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పి బిజెపి మోసం చేసిందని, మాదిగ ఉపకులాలకు బిజెపి చేసిన నమ్మక ద్రోహానికి నిరసనగానే తమ పోరాటాన్ని ఉధృతం చేస్తున్నామని చెప్పారు. యుపిఎ ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ బిల్లు పెడితే మద్దతిస్తామని, బిల్లు పెట్టకపోతే బిజెపి కేంద్రంలో అధికారంలోకి రాగానే పెట్టి ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని బిజెపి ప్రకటించిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడుస్తున్నా ఎస్‌సి వర్గీకరణ చేయకపోవడం వంచించడమే అని పేర్కొన్నారు. గతంలో బిజెపి కేంద్ర ప్రభుత్వానికి రాసిన లేఖలు, వందల సభల్లో ఇచ్చిన హామీలను బిజెపి నాయకులు గాలికొదిలేశారని విమర్శించారు. బిజెపికి అంబేద్కర్ సామాజిక దృక్పదం లేదని, ఆ పార్టీ సిద్ధాంతకర్త దీన్ దయాల్ ఉపాధ్యాయ స్ఫూర్తికి అనుగుణంగా కూడా బిజెపి పాలన లేదన్నారు. ఇప్పటికైనా పార్లమెంట్‌లో బిల్లు పెట్టి ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.



"పనిచేసే ప్రతిసారీ ఫలితాలు రావు. కానీ చేయకపోతే ఏ ఫలితమూ ఉండదు.
– బెంజమిన్ డిజ్రేలీ"

సంపాదకీయం

కమల్ రాజకీయ అరంగేట్రం

జయలలిత మరణానంతరం అస్థిరత చోటుచేసుకున్న తమిళనాడు రాజకీయ రంగంలో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించింది. అది ప్రసిద్ధ సినీనటుడు కమల్ హాసన్ ''మక్కల్ నీథి మయ్యమ్'' (ప్రజల న్యాయ కేంద్రం). ద్రవిడియన్ పార్టీల పేర్లలో సహజంగా ఉండే 'కచ్చి', 'కళగం' ఈ పేరులో లేకపోవటం గమనార్హం. 'నేను మీ నాయకుణ్ణి కాదు – మీకు సలహాలివ్వటానికి. నేను మీ సలహా వినే కార్యకర్తను' అంటూ ఆయన ప్రజల పట్ల విధేయతను ప్రకటించారు. తమిళ సంస్కృతికి, రాజకీయాలకు కేంద్రమైన మధురైలో వేలాదిమంది అభిమానులతో కలిసి ప్రదర్శన అనంతరం జరిగిన సభలో ఆయన రాజకీయ పార్టీని ప్రకటించారు. రామేశ్వరంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఇంటినుంచి కమల్ బుధవారం ఉదయం తన రాష్ట్ర వ్యాప్త రాజకీయ యాత్ర 'నాలై నామధే' తొలిదశను ప్రారంభించారు. మధురై సభలో తన భావజాలం గూర్చి చెబుతూ, 'మీరు వామపక్షవాదులా, మితవాదులా అని ప్రజలు అడుగుతున్నారు. మా పార్టీ పేరులోనే మధ్యేమార్గం(మయ్యమ్) ఉంది. మంచి విషయాలు ఎటునుంచి వచ్చినా స్వీకరిస్తాం' అని ప్రకటించారు.

కమల్ పార్టీ పతాకానికీ ఒక విశిష్టత ఉంది. అది పుదుచ్చేరి సహా ఆరుదక్షిణాది రాష్ట్రాల ఐక్యతను, ఫెడరల్ స్ఫూర్తిని వ్యక్తీకరించింది. తెలుపు నేపథ్యంగా మూడు నలుపు, మూడు ఎరుపు రంగుచేతులు వృత్తాకారంలో పెనవేసుకుని ఉన్నాయి. దాని మధ్యలో నల్ల రంగులో పెద్ద నక్షత్రం, దాని మధ్యలో తెలుపులో చిన్ననక్షత్రం ఉన్నాయి. 'ఆరుచేతులు నవదక్షిణ భారత్‌కు సూచిక. నక్షత్రం ప్రజలకు చిహ్నం' అనికమల్ హాసన్ వివరించారు. అవినీతిపై, కుల, మత రాజకీయాలపై పోరాటం, ప్రజల సౌభాగ్యం తన ధ్యేయంగా ప్రకటించారు.

తమిళ సినీ సూపర్ స్టార్ రజనీకాంత్ కూడా రాజకీయ రంగ ప్రవేశాన్ని ప్రకటించటం తెలిసిందే. 'ఆధ్మాత్మిక రాజకీయాలు' తన ధ్యేయం అన్నారు. అయితే ఆ మాటకు అర్థమేమిటో, ఆ పేరుతో ఆయన ప్రజలముందుంచే కార్యక్రమమేమిటో ఇంకనూ వివరించాల్సి ఉంది. రజనీకాంత్, కమల్‌హాసన్ సహనటులే గాక మంచి మిత్రులు కూడా. వారిద్దరు కలిసి పనిచేయాలన్న ఆకాంక్ష శ్రేయోభిలాషుల్లో ఉంది. అయితే రజనీరంగు 'కాషాయం' అయితే కలిసి పనిచేసే అవకాశం లేదని కమల్ హాసన్ స్పష్టం చేశారు.

తమిళనాడులో ద్రవిడ రాజకీయాలు కాంగ్రెస్‌ను పక్కకునెట్టేసిన 1967 నుంచీ ఆ రాష్ట్రాన్ని పాలిస్తున్నది ద్రవిడ పార్టీలే. కమల్, రజనీ పార్టీలు రెండూ ఆ స్రవంతితో సంబంధం లేనివి. కనుక ఈ కొత్త పార్టీలు సాంప్రదాయక పార్టీలకు ప్రత్యామ్నాయ మవుతాయా లేక అనేక ఇతర పార్టీలవలె నామమాత్రమవుతాయా కాలమే నిర్ణయిస్తుంది.

జయలలిత మరణానంతరం దిక్కుతోచని స్థితిలో ఉన్న పాలక ఎఐఎడిఎంకెపై పట్టు సాధించేందుకు, తద్వారా పునాది దొరకని రాష్ట్రంలో ప్రభావశాలి అయ్యేందుకు బిజెపి అధినాయకత్వం చేసిన ప్రయత్నాలు గుర్తు చేసుకోదగినవి. తొలుత జయలలిత పరమ విధేయుడు, ముఖ్యమంత్రి ఒ.పన్నీరు సెల్వంను చేరదీశారు. శశికళ వర్గం పై చేయి సాధించి పళనిస్వామిని ముఖ్యమంత్రి చేయటంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. శశికళ అవినీతికేసులో జైలు పాలు కావటంతో రెండు గ్రూపుల్ని కలిపారు. పార్టీలో విలీనానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఒత్తిడిచేసినట్లు పన్నీరుసెల్వం కొద్దిరోజుల క్రితం స్వయంగా వెల్లడించారు. ఎఐఎడిఎంకె ప్రాభవం అడుగంటినట్లు ఆర్.కె.నగర్ ఉప ఎన్నిక రుజువుచేసింది. రజనీకాంత్ వెనుక బిజెపి వ్యూహాలున్నట్లు చెప్పబడుతున్నది. కమల్ తన పార్టీ ప్రకటించే ముందు రాష్ట్రంలోని రాజకీయపార్టీల నాయకులందర్నీ, రజనీకాంత్ సహా మర్యాదపూర్వకంగా కలిశారు. అయితే పార్టీ ఆలోచన వచ్చినపుడే ఆయన కేరళ సిపిఐ(ఎం) ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కలవటంపై దుమారం రేగింది. ఆ తర్వాత ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆయన్ను కలవటమే గాక మధురై సభలో పాల్గొన్నారు. కమల్ తన పార్టీ పతాకాన్ని దక్షిణాది రాష్ట్రాలకు చిహ్నంగా వివరించటంపై బిజెపి బురద జల్లే అవకాశముంది. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల వ్యవధి ఉన్నందున తమిళ రాజకీయాలు ఎన్ని మలుపులు తిరుగుతాయో వేచిచూడాల్సిందే.


పొంచి ఉన్న సైబర్ యుద్ధ ముప్పు

చూపు

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అమెరికా, రష్యా మధ్య ప్రచ్ఛన్న యుద్ధకాలంలో అప్పటి ఆధునిక సాంకేతిక విజ్ఞానం ఆధారంగా ఆయుధాల తయారీ ముమ్మరంగా సాగింది. అప్పుడు అణుక్షిపణుల తయారీపై దేశాలకు మోజు ఉండేది. కానీ ఇప్పుడు సాఫ్ట్‌వేర్ ఆధారిత ఆయుధ తయారీపై అమెరికా, రష్యాలు దృష్టిపెట్టాయి. ఇందులో కృత్రిమ మేధస్సుతో ఆయుధాల తయారీకి ప్రాముఖ్యం ఇచ్చారు. తమ వ్యవహారాలలో రెండో దేశం జోక్యం చేసుకుంటున్నట్లు అమెరికా, రష్యాలు ఒకదానిపై ఒకటి 1980 దశకంలో ఆరోపణలు చేసుకుంటూ ఆయుధ సంపత్తిని పెంచుకునేవి. ఆ రెండు దేశాల మధ్య యుద్ధం వస్తుందని అప్పట్లో భయాలు వ్యాపించేవి. 1940, 1950 దశకాలలో మొదలైన ఈ ప్రచ్ఛన్న యుద్ధంలో ఎదుటి దేశం సాంకేతికంగా ముందుకు దూసుకుపోతుందన్న భయం అమెరికా, రష్యాలు రెంటికీ ఉండేది.

రష్యా ప్రస్తుతం 'కృత్రిమ మేధస్సు' ప్రాముఖ్యత గురించి తరచూ ప్రకటనలు గుప్పిస్తోంది. కృత్రిమ మేధస్సు సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తే దాని ద్వారా నిర్ణయాలను మరింత త్వరగా తీసుకోవచ్చు. ఈ విషయంలో సాధారణ మానవులకంటె మరమనుషులు (రోబోలు) ఎక్కువ చురుకుగా ఉంటారు. డ్రోన్‌లు, డ్రైవర్ అక్కర్లేకుండా తమంతతామే దూసుకుపోయే వాహనాలను, కృత్రిమ మేధస్సుతో తయారు చేసే రోజులు రానున్నాయి. వీటి తయారీతో మరోరకం ప్రచ్ఛన్న యుద్ధం తప్పదు అన్న భయాలు వ్యాపిస్తున్నాయి. దానికి కృత్రిమ మేధస్సు ఆధారం అవుతుంది. ఇటీవల మాస్కో సమీపంలోని 'స్ట్రేటజిక్ మిసైల్ అకాడమీ' వద్ద జరిగిన ఒక సమావేశంలో 'కృత్రిమ మేధస్సు' ప్రాముఖ్యత గురించి రష్యా అధ్యక్షుడు పుతిన్ నొక్కి చెప్పారు.

రక్షణ రంగంలో అమెరికా, రష్యా వ్యయం నిష్పత్తి 10:1గా వుంటోందని, ఈ అంతరం వల్ల రక్షణ పాటవంలో ఏర్పడిన తేడాపాడాలను కృత్రిమ మేధస్సు ద్వారా పూడ్చవచ్చని పుతిన్ అన్నారు.అమెరికాను వ్యూహాత్మకంగా అధిగమించడానికి రష్యాకు 'కృత్రిమ మేధస్సు' ఆధారిత ఆయుధాలు అవసరమని ప్రభుత్వ ఆధ్వర్యంలోని మీడియా కూడా సూచించింది. ప్రచ్ఛన్న యుద్ధం సమసిపోయినా 30ఏళ్ల తరువాత ఇప్పుడు అమెరికా, రష్యాలు వేలాది అణ్వాయుధాలను కార్యరంగంలోంచి తప్పించాయి. ఆయుధాలన్నీ ఇరుదేశాలు ఒకదానినొకటి అధిగమించాలన్న దురాశతో పేర్చుకొన్నవే. ఆ ఆయుధాలతో సాగే యుద్ధం ఇరుదేశాలను సమానంగా నాశనం చేస్తుందని తెలిసికూడా ఉద్రిక్త వాతావరణంలో వాటిని ఆ రెండు దేశాలూ ఒకదానిని మించి ఒకటి పేర్చుకొన్నాయి. ఇప్పుడు కూడా ఉద్రిక్తతలు ఆ రెండు దేశాల మధ్య పెరుగుతున్నాయి. ఆధునిక ప్రపంచపు ప్రచ్ఛన్న యుద్ధం ముదిరితే సైబర్ దాడుల ప్రమాదం లేకపోలేదు. ఇతర అణు సంపన్న దేశాల మధ్య కూడా ఇటువంటి ఘర్షణలు పెరగవచ్చు. అమెరికా, రష్యాలు దౌత్యాధికారులను పరస్పరం బహిష్కరించుకున్నాయి. క్రిమియాలో కొంతభాగాన్ని రష్యా కలిపేసుకుంది. టర్కీ– సిరియా సరిహద్దు ఘర్షణలు అమెరికా, రష్యాల మధ్య పరోక్ష యుద్ధానికి బీజాలు వేశాయి. అలాగే ప్రస్తుతం ఉద్రిక్తతలు వ్యాపించిన అనేక దేశాలు అణ్వాయుధ సంపద పోగేసినవే. అయితే ఒక అగ్రదేశం అణ్వాయుధాలు వాడుతుందన్న ఆలోచన భరించరానిది. అణ్వాయుధాలను వాడడం కంటే, కృత్రిమమేధస్సు ఆధారంగా తయారైన సైబర్ ఆయుధాలను వాడడం సబబు అన్న వైఖరి అగ్రరాజ్యాల రెంటికీ ఉన్నాయి. ఇటీవల రష్యాను సమర్థించే హ్యాకర్లు ఎలక్ట్రానిక్ పరికరాలు ఉపయోగించి గూఢచర్యం సాగించారు. ఉక్రెయిన్‌తో పాటు అమెరికా మిత్రదేశాలైన బ్రిటన్, జర్మనీ దేశాలను గురిపెట్టి విద్యుత్ కర్మాగారాలు, బ్యాంకులు, ఆసుపత్రులు, రవాణా వ్యవస్థలపై సైబర్ దాడులు జరిపారు. అమెరికాకు తగిన విధంగా స్పందించే సామర్థ్యం ఉంది. అందువల్ల అది ఎదురుదాడులు జరిపి ఉండవచ్చునని విశ్లేషకులు భావిస్తున్నారు. భవిష్యత్తు కృత్రిమ మేధస్సులోనే ఉందని పుతిన్ ఇటీవల అభిప్రాయపడ్డారు. రష్యాకే కాక, మొత్తం మానవజాతి భవిష్యత్తు దానితో ముడిపడి ఉందని 2017 సెప్టెంబర్‌లో ఆయన అన్నారు. ఈ రంగంలో ఎవరు ఆధిక్యత సాధిస్తే వారే ప్రపంచానికి నాయకులవుతారని కూడా దేశ విద్యార్థులను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. సైన్స్ ఫిక్షన్ రచయితలు ఊహించినట్లుగా అణు క్షిపణులను కంప్యూటర్ల ద్వారా ప్రయోగించే రకం విజ్ఞానం కాదది. పూర్తిగా కృత్రిమ మేధస్సు ఆధారం గా తయారైన పరికరాలు, ఆయుధాలే భవిష్యత్‌ను శాసిస్తాయని పుతిన్ చేసిన వ్యాఖ్యకు అర్థం. కృత్రిమ మేధస్సుతో జరిగే దాడులు ప్రత్యర్థికి ఎదురుదాడి జరిపే వ్యవధిని ఇవ్వవు. అలాగే మానవ కల్పిత తప్పిదాలవంటివి ఉండనే ఉండవు. అత్యంత వేగంగా స్వయంచోదిత ప్రతిస్పందన వ్యవస్థను కృత్రిమ మేధస్సు పనిలోపెడుతుంది. వినాశంపై భయం తో దేశాలు నిజమైన యుద్ధాలు వాయిదా వేసుకోవచ్చు. డ్రోన్స్, సైబర్ దాడి పరికరాలు వంటి అణుశక్తేతర ఆయుధాలను నియంత్రించడానికి కూడా కృత్రిమ మేధస్సు ఉపయోగపడుతుంది. డ్రోన్స్ వంటివి వాటి కమ్యూనికేషన్ వ్యవస్థలు పనిచేయని సమయంలో కూడా దాడులు జరిపే సామర్థ్యం కలిగి ఉండాలి. ఇందుకు వాటిలో అమర్చే కృత్రిమ మేధస్సు ఉపయోగపడుతుంది. డ్రోన్ల దాడిని ఆపే ప్రయత్నాలను కూడా కృత్రిమ మేధస్సుతో పసిగట్టి స్తంభింపచేయవచ్చు.



ప్రత్యర్థులు గమనించే అవకాశంలేకుండా అత్యంత వేగంగా ఈ విషయంలో కృత్రిమ మేధస్సు ద్వారా నిర్ణయం వెలువడుతుంది. అలాగే లక్ష్యాలను, పద్ధతులను కూడా ఈమేధస్సు ద్వారా చాలా త్వరగా మార్చేయవచ్చు. ఇందుకు సాధారణ మానవ మేధస్సు చాలదు. కృత్రిమ మేధస్సుకు పనిలో వేగం చాలా ఎక్కువ. జెనీవాలో జరుగనున్న డిజిటల్ మహాసభలో పలు దేశాలు కృత్రిమ మేధస్సుతో సాగే ఘర్షణలకు కళ్లెం వేసే అంగీకారాన్ని కుదుర్చుకోవచ్చు. ఆ ఒప్పందం కుదిరినంత మాత్రాన అటువంటి దాడులు ఆగిపోవు. ఎందుకంటే దేశాల మధ్య కుదిరిన ఎటువంటి ఒప్పందాలతో నిమిత్తం లేకుండా– జాతీయవాద బృందాలు, నేరస్థుల బృందాలు, ఉగ్రవాదులు తదితరులు కృత్రిమ మేధస్సును ఉపయోగించి సైబర్ దాడులు సాగించే ప్రమాదం ఉంది. రష్యా కృత్రిమ మేధస్సును కౌగలించుకోవడంతో, ఇందులో వెనుకబడ్డ అనేక ఇతర దేశాలకు సమస్య ఎదురవుతుంది. అవి అనేక విషయాలలో పోటీ పడలేకపోతాయి. కృత్రిమ మేధస్సు ద్వారా వ్యాపార, పారిశ్రామిక, శాస్త్రీయ, భద్రత తదితర రంగాలలో పురోగతి సాధించడం రష్యా, అమెరికా వంటి దేశాలకు సులభం. తక్కిన దేశాలు వాటి వేగాన్ని పలు రంగాలలో నిరోధించలేక, అందుకోలేక సతమతమవుతాయి. అమెరికా, రష్యా మధ్య ప్రచ్ఛన్నయుద్ధం తిరిగి ముదిరితే కృత్రిమ మేధస్సుతో ప్రయోగాలు ముమ్మరమౌతాయని నిపుణులు చెపుతున్నారు.

* జరేమి స్ట్రాబ్

గోవాలో బిజెపి గురివింద

అక్రమంగా గనుల త్రవ్వకం విషయంలో కాంగ్రెస్ బాటలోనే బిజెపి కూడా నడుస్తోంది. గనుల వాణిజ్యంలోని బడా బాబులకు అనుకూలంగా బిజెపి నిబంధనలను ఎలా మార్చుతోందో ఇటీవల సుప్రీంకోర్టు జారీ చేసిన ఒక ఉత్తర్వు వల్ల స్పష్టమవుతోంది. ఇనుప ఖనిజం ఎగుమతి వ్యాపారంలో బడా సంస్థలకు అనుకూలంగా గోవాలో నిబంధనలను భారతీయ జనతా పార్టీ (బిజెపి) ప్రభుత్వం కాంగ్రెస్ వలెనే మార్చివేస్తోంది. ఆ రాష్ట్రంలో 88 గనుల లీజులను ఈ నెల 7న సుప్రీంకోర్టు రద్దు చేసింది.

ఆ లీజులను తొందరపాటుతో, అక్రమంగా రిన్యూ చేశారని అత్యున్నత న్యాయస్థానం ఈ సందర్భం గా వ్యాఖ్యానించింది. మార్చి 16 నాటికి వాటిని మూసివేయాలని ఆదేశించింది. అక్కడి పాలన గురించి అధికారంలోగల బిజెపి చెప్పుకుంటున్నవి గొప్పలని నిరూపించిన ఉదంతం ఇది. ప్రైవేటు కంపెనీలకు లాభం చేకూర్చడానికి బిజెపి ప్రభుత్వం తెగబడి అక్రమాలకు దిగిందని సుప్రీంకోర్టు ఉత్తర్వు నిరూపించింది.

ప్రతి ఒక్క గనుల లీజుదారు వివిధ స్థాయిల్లో అక్రమాలకు పాల్పడిన నిజాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ విషయంలో ప్రజా ప్రయోజనాలకుగాక లీజుదార్లకు గోవా ప్రభుత్వం ప్రాముఖ్యం ఇచ్చిందని కూడా విమర్శించింది.

స్వచ్ఛంద పర్యావరణ సంస్థ 'గోవా ఫౌండేషన్' దాఖలు చేసిన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యంలో సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

2015లో 88 గనుల లీజులను అక్రమంగా రిన్యూ చేసినట్లు ఆ వ్యాజ్యంలో ఆరోపించారు. ఈ కేసులో గోవా ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా అభిశంసించిందని ఆ సంస్థ భావిస్తోంది. తొందరపాటుతో ప్రైవేటు సంస్థల గనుల లీజులను రిన్యూ చేశారని కూడా సుప్రీంకోర్టు తేల్చినట్లు ఫౌండేషన్ తలపోస్తోంది.

వేదాంతకు రిన్యూవల్‌లో పెద్దపీట

సుప్రీంకోర్టు రద్దు చేసిన 88 లీజుల రిన్యూవల్స్‌లో ఆరు ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ ఆమోదించినవే. ఆయన గనుల శాఖను స్వయంగా చూశారు. తక్కిన 82 లీజుల రిన్యూవల్స్‌కు ఆయన ముందునాటి ముఖ్యమంత్రి లక్ష్మీ కాంత్ పర్సేకర్ ఆమోద ముద్ర వేశారు.

ఆయన 2014 నుంచి 2017 దాకా గోవా ముఖ్యమంత్రి పదవిలో ఉన్నారు. ఎంత సులభంగా బిజెపి ప్రభుత్వం గనుల వాణిజ్యంలోని బడా బాబులకు అనుకూలంగా నిబంధనలను మార్చేసిందో ఈ ఉదంతం నిరూపిస్తోంది. 2014–15లో ఈ 88 గనుల లీజును రిన్యూ అయ్యాయి. వేదాంత కంపెనీ 22 లీజులను, సల్గావోకార్స్ 10, ఫోమెంటో గ్రూపు 7, చౌగులే అండ్ కంపెనీ 10 లీజుల ను రిన్యూ చేసుకోగా తక్కిన కంపెనీలు ఒకటి కంటే ఎక్కువ గనుల లీజులను రిన్యూ చేసుకున్నాయి. ఈ అంశాలను తన పిటిషన్‌లో గోవా ఫౌండేషన్ పేర్కొంది. వేదాంత బిజెపికి పెద్దగా విరాళాలిచ్చిన గ్రూపు అని పిటిషన్‌లో ఆరోపించారు. ఫౌండేషన్ డైరెక్టర్ క్లాడ్ అల్వేర్స్ పేర్కొన్నట్టుగా 2012లో విడుదలయిన ఎంబి షా కమిషన్ నివేదికను కాంగ్రెస్ పక్కన పెట్టినట్టు గా బిజెపి కూడా చేసింది. ఆ పార్టీ 2012లో ఎగుమతిదారులతో చట్టపట్టాలు వేసింది. రూ.35,000 కోట్ల మేర అక్రమ గనుల త్రవ్వకం జరిగినట్లు కమిషన్ చెప్పినది కేవలం ఒక అభిప్రాయం అని, ఆ డబ్బును వసూలు చేయడం సాధ్యం కాదని పారికర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చెప్పిన దానిని ఫిబ్రవరి 7 ఉత్తర్వులో సుప్రీంకోర్టు పక్కన పెట్టింది.

'గనుల లీజుదారులకు కొందరికి వందల కోట్ల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సంజాయిషీ నోటీసులను ఇప్పుడు జారీ చేస్తున్నట్లు అదనపు సొలిసిటర్ జనరల్ ద్వారా మాకు తెలిసింది. పర్యావరణ అనుమతులు విధించిన పరిమితికి మించి త్రవ్విన ఇనుప ఖనిజం విలువ కింద ఆ మొత్తాలు చెల్లించాలని ఇచ్చిన నోటీసుల నమూనాలు కొన్నిటిని మాకు సమర్పించారు. 2017 సెప్టెంబరు– అక్టోబర్‌లో అటువంటి 12 నోటీసు ల నమూనాలను అందించారు. చెల్లించాలని ఆ నోటీసుల్లో డిమాండ్ చేసిన మొత్తం రూ.1500 కోట్లు' అని సుప్రీంకోర్టు ఈ నెల 7 ఉత్తర్వులో పేర్కొంది. 'గనుల త్రవ్వకంపై ఆడిట్ రిపోర్టు సారాంశాన్ని అదనపు సొలిసిటర్ జనరల్ మాకు సమర్పించారు. అది 2016 జులై నుండి డిసెంబర్ మధ్య కాలానికి సంబంధించినది. గనుల లీజుదారుల నుంచి సొమ్ము వసూలుకు గోవా ప్రభుత్వం సరియైన ప్రయత్నం ఏదీ చేయకుండా కేవలం సంజాయిషీ నోటీసులు ఇచ్చి ఊరుకుంది' అని కూడా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

ఉత్తుత్తి సంజాయిషీ నోటీసులు

ఆ చెల్లింపు జరగకుండానే గనుల లీజులను ఆ రాష్ట్ర ప్రభుత్వం రిన్యూ చేసినట్లు కూడా కోర్టు తెలిపింది. దీనిని బట్టి జరిగిన అక్రమాలను ఊహించుకోవచ్చు. గత ఏడాది బిజెపి తనకు తానుగా గోవా ఎన్నికల్లో ఓడిపోయింది. అది ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ఘోరంగా విఫలం అయిందని ప్రజలు భావించినందువల్లే అలా జరిగింది.

గోవా ఫార్వర్డ్ పార్టీ, తదితరులతో సంకీర్ణ ప్రభుత్వ సారథిగా బిజెపి మళ్లీ అధికారంలోకి వచ్చింది. గోవాలో అక్రమ ఇనుప ఖనిజం గనుల త్రవ్వకం రూ. 70,000 కోట్లమేర జరిగినట్లు గోవా ఫౌండేషన్ కు చెందిన అల్వేర్స్ తెలిపారు. ఈ భారీ మొత్తం బకాయిలను ఆ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు వసూలు చేయలేకపోతోందని ఆ సంస్థ నిలదీస్తోంది. ఒడిశా, తదితర రాష్ట్రాలు అక్రమ గనుల త్రవ్వకం సాగించిన లీజుదార్ల నుంచి ఈ సరికే రూ.30,000 కోట్లు వసూలు చేసిన విషయాన్ని సంస్థ ఉదహరిస్తోంది. గనుల త్రవ్వకం కార్యకలాపాలపై 10–20ఏళ్ల మారటోరియం విధించాలని వాటివల్ల సమస్యలు ఎదుర్కొంటున్న గ్రామాల వారు డిమాండ్ చేస్తున్నారు. అప్పుడే పర్యావరణ పరంగా తమ పరిస్థితి బాగుపడుతుందని వారంటున్నారు. దక్షిణ గోవాలో కూపెం ప్రాంతంలోని కొలంబా గ్రామం ఈ గనుల వల్ల బాగా దెబ్బతింది. గనుల త్రవ్వకాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో ఈ గ్రామాలు కొన్నింటి ప్రజలు స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. అక్కడ మత్స్య సంపద అందించే జలవనరులు కలుషితం అయిపోయాయి.పంటలు నాశనం అయ్యాయి. ఊపిరి తిత్తుల వ్యాధులు ప్రబలాయి. ఈ నష్టాల నుంచి స్థానిక తెగలవారికి పరిహారం అందించాలని, న్యాయం చేయాలని కోరుతూ ఆ పిటిషన్ దాఖలు చేశారు. సాధ్యమయినంత త్వరలో గనుల మూసివేత కార్యక్రమం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మరో 10ఏళ్ల పాటు వాటిని తిరిగి తెరవకూడదని కోరుతున్నారు.

యుపిఎ ప్రభుత్వ హయాం నాటి గనుల వాణిజ్యంలో అవినీతిని 2014 ఎన్నికల్లో బిజెపి పెద్దగా ప్రచారం చేసింది. అంతకు ముందు 10 ఏళ్లు పాలించిన యుపిఎ హయాం చివరి రెండేళ్లలో బయటపడ్డ అనేక కుంభకోణాల్లో గనుల వ్యవహారం కూడా ఒకటి. అప్పుడు అవినీతికి వ్యతిరేకంగా గొంతు చించుకున్న బిజెపి గోవాలో తమ ప్రభుత్వం అక్రమాలను ఈ విషయంలో అదుపు చేయకపోవడాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

* దేవికా సెక్వెరా



యుపిఎ ప్రభుత్వ హయాం నాటి గనుల వాణిజ్యంలో అవినీతిని 2014 ఎన్నికల్లో బిజెపి పెద్దగా ప్రచారం చేసింది. అంతకు ముందు 10 ఏళ్లు పాలించిన యుపిఎ హయాం చివరి రెండేళ్లలో బయటపడ్డ అనేక కుంభకోణాల్లో గనుల వ్యవహారం కూడా ఒకటి. అప్పుడు అవినీతికి వ్యతిరేకంగా గొంతు చించుకున్న బిజెపి గోవాలో తమ ప్రభుత్వం అక్రమాలను ఈ విషయంలో అదుపు చేయకపోవడాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఎడిటర్‌కు లేఖలు

ఇసుక లారీల ప్రమాదాలకు అంతం లేదా?

'జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇసుక లారీల ప్రమాదాలు నిత్యం పెరిగిపోతుండడంతో వాహనదారులు ప్రధాన రహదారి మీదకు రావాలంటేనే జంకుతున్నారు. జయశంకర్ జిల్లాలోని కాళేశ్వరం క్వారీ నుండి లారీల ద్వారా ఇసుక హైదరాబాద్‌కి తరలివెళుతుంది. నిత్యం సుమారు అయిదువేల లారీలు ఇసుకను రవాణా చేస్తున్నాయి. డ్రైవర్లు మద్యం సేవించడం, ఓవర్ డేరింగ్ చేయడం, మితిమీరిన వేగంతో నడపడం వల్ల రోడ్డు మీద వెళ్లే వారి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

వారం రోజుల క్రితం మోరంచపల్లి గ్రామం ముందు బైక్‌పై వెళుతున్న ప్రైవేటు అధ్యాపకుడి దంపతులమీదికి లారీ దూసుకువెళ్ళడంతో అధ్యాపకుడు రవీందర్ ప్రాణా లు కోల్పోగా, ఆయన భార్య చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ 'కోమా'లోకి వెళ్లింది. లారీలను నిలుపుదల చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, కాలేజీ విద్యార్థులు, వివిధ పార్టీల నాయకులు పది గంటలపాటు ధర్నా చేయడంతో సుమారు 20 కి.మీ. వరకు వాహనాలు నిలిచిపోయాయి. అధికారులు జోక్యం చేసుకుని మృతుని కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామనడంతో ధర్నా విరమింపచేశారు. తాజాగా గణపురం మండలం కుందయ్యపల్లి గ్రామం వద్ద రోడ్డుపై వెళుతున్న బిల్ల మల్లారెడ్డి అనే పేదరైతుపై ఆదివారం రాత్రి ఇసుకలారీ దూసుకెళ్ళడంతో అక్కడికక్కడే మరణించాడు. వేరే వ్యక్తికి కూడా గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. వారంరోజుల లోపే రెండు ప్రమాదాలు జరిగి ఇరువురు మరణించడం మూలాన ఇసుకలారీల ను మొత్తానికే నిలుపుదలచేయాలని మళ్లీ ధర్నాకు ఉపక్రమించి ఆవేశంతో ప్రజలు సుమారు 31 లారీల అద్దాలను ధ్వంసం చేశారు. అన్ని పార్టీలు సుమారు 20 గంటలపాటు ధర్నా నిర్వహించారు. మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని, మృతుని కుమారుడికి ఉద్యోగం కల్పిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది.ఇసుక లారీలకు తోడు అధిక లోడ్‌గల బూడిద లారీలు, బొగ్గు లారీలు కూడా రహదారి మీదనే ప్రయాణిస్తుండడంతో ద్విచక్ర వాహనదారులు కార్లు, ఇతర వాహనాలలో ప్రయాణించేవారు బెంబేలెత్తుతున్నారు.

కాళేశ్వరంనుండి హైదరాబాద్ వరకు ప్రధాన రహదారిపైనగల పల్లెలు, పట్టణాలు ఇసుకలారీల దూకుడుకు భయకంపితులై బయటకు రావాలంటేనే జంకుతున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కూడా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పాఠశాలకి వెళుతున్నారు. రవాణాశాఖ అధికారుల తనిఖీలు లేకపోవడం , పోలీసుల నిర్లక్ష్యం, రోడ్డుపై స్పీడు బ్రేకర్లు లేకపోవడం, లారీ క్లీనర్స్ కూడా వాహనాలు నడపడం ప్రమాదాలకు కారణాలుగా నిలుస్తున్నాయి. ఇసుక లారీలను రాత్రివేళలో మాత్రమే రోడ్లపైకి అనుమతించాలి. బ్రీత్ ఎనలైజర్‌తో డ్రైవర్లను పరీక్షించాలి. లారీ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు తెలియచేయాలి. ప్రధాన రోడ్డుపై ఒక వరుస క్రమంలో లారీలు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలి. ప్రభుత్వం కూడా ఇసుక లారీల ద్వారా ఆదాయం వస్తుందని చూస్తుంది తప్ప అమాయక ప్రజల ప్రాణాలను పట్టించుకోవడం లేదు. కోట్లాది రూపాయలతో వేసిన రోడ్డు ధ్వంసం అవుతుంది. ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించాలి.

– కామిడి సతీష్‌రెడ్డి

దళిత శాఖకు గౌరవం ఇవ్వండి!

ఉమ్మడి నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గంలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల ప్రారంభోత్సవాలలో కొన్ని శాఖల అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధులను అగౌరవ పరిచే విధంగా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం దళితులను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నది. గౌరవ ముఖ్యమంత్రివర్యులు కెసిఆర్ గారు దళిత వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలనే అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చారు. దళితుల అభివృద్ధి కోసం మంత్రివర్యులు గౌ॥గుంతకట్ల జగదీశ్వర్‌రెడ్డిగారి కృషి ఫలితంగానే నేడు రాష్ట్రంలోని దళితులంతా సామాజిక, ఆర్థికంగా, వ్యాపారవేత్తలుగా ఎదగగలుగుతున్నారు. కానీ మా నియోజకవర్గంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలపై కొన్ని శాఖల అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదు. మా జిల్లా మంత్రికి విద్యుత్, ఎస్‌సి కులాల శాఖలు ఉన్నాయి.

వివిధ శిలాఫలకాలపై విద్యుత్‌శాఖను మాత్రమే రాస్తునారను. దళిత శాఖను మర్చిపోతున్నారు. ఇంక కొన్ని అయితే ఈ ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నటువంటి ప్రజాప్రతినిధుల పేర్లే లేవు. ఈ ప్రాంత అధికారులు కొందరు ప్రోటోకాల్ పాటించడం లేదు. కావున అందరినీ గౌరవించి అందరిపేర్లు ముద్రించే విధంగా పై స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలి. అదే విధంగా మా మంత్రి వర్యులకే తప్పకుండా ఎస్‌సి కులాల శాఖను ప్రతిశిలాఫలకంపై వచ్చే విధంగా చూడాలి.

– గుండమల్ల సతీష్‌కుమార్



దేశవ్యాప్తంగా ఎంబిబిఎస్, బిడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-నీట్. ఈ ఏడాది నుంచి ఆయుష్ కోర్సులకు కూడా నీట్ స్కోర్ తప్పనిసరి అయింది. విదేశీ యూనివర్సిటీల్లో ఎంబిబిఎస్ చేయాలన్నా కూడా నీట్‌లో అర్హత సాధించాల్సిందే.. నీట్-2018 నోటిఫికేషన్ వెలువడింది. మే 6న దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష జరుగనుంది. ఈ నేపథ్యంలో నీట్ పరీక్షలో విజయం ఎలా సాధించాలో తెలుసుకుందాం...

తెలుగులోనూ నీట్

నీట్ పరీక్షలో సక్సెస్ కావాలంటే జనరల్ కేటగిరీ అభ్యర్థులు 600 నుంచి 700 మార్కుల లోపు, రిజర్వ్‌డ్ కేటగిరీ వర్గాలు 550కు పైగా మార్కులు సాధించాల్సి ఉంటుంది. రాష్ట్రాల్లో అందుబాటులో ఉన్న సీట్లకు, తాజాగా నేషనల్ పూల్ ఫలితంగా జాతీయ స్థాయిలో లభించే 15 శాతం సీట్లు పొందేందుకు అవకాశం లభిస్తుందని చెబుతున్నారు విద్యానిపుణులు. ప్రణాళికాబద్ధంగా చదివితే నీట్‌లో మంచి మార్కులు సాధించవచ్చని అంటున్నారు.

నీట్ పరీక్షా విధానం :


ఇంటర్మీడియెట్ (బైపీసీ) తత్సమాన కోర్సులో గ్రూప్ సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
డిసెంబర్ 31 నాటికి 17 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసుండాలి.
మొత్తం నాలుగు విభాగాల్లో అంటే..ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ (బోటనీ+జువాలజీ) పరీక్ష ఉంటుంది.
ప్రశ్నల సంఖ్య 180. (ఒక్కో విభాగం నుంచి 45 ప్రశ్నలు). ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు. మొత్తం 720 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
నెగెటివ్ మార్కింగ్ కూడా ఉంది. తప్పు సమాధానానికి ఒక మార్కు కోల్పోవడం ఖాయం.
పరీక్ష తేదీ: మే 6, 2018.
వివరాలకు వెబ్‌సైట్: http://cbseneet.nic.in

పరీక్షకు ఎలా తయారుకావాలంటే..

బయాలజీ విభాగంలో గత సంవత్సరం ప్రశ్నాపత్రాన్ని గమనిస్తే, మార్కుల పరంగా సెల్ బయాలజీ (4 ప్రశ్నలు), బయలాజికల్ క్లాసిఫికేషన్ (3 ప్రశ్నలు), ఎకాలజీ (6 ప్రశ్నలు) విభాగాలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. నీట్‌లో మంచి మార్కుల దిశగా అభ్యర్థులు బయాలజీపై ప్రత్యేక దృష్టి సారించాలి. బయాలజీలోని బోటనీ, జువాలజీ సబ్జెక్టుల నుంచి దాదాపు 45 చొప్పున ప్రశ్నలుంటాయి. బయాలజీపై పట్టు సాధించేందుకు అకాడమీ పుస్తకాల్లోని అంశాలను ఒకటికి రెండుసార్లు సమగ్రంగా అధ్యయనం చేస్తేసరిపోతుంది.

గత రెండేళ్ల నీట్ ప్రశ్నాపత్రాలను విశ్లేషిస్తే.. రెండు సబ్జెక్ట్‌లకు సంబంధించి ఇంటర్మీడియెట్ లోని ప్రథమ, ద్వితీయ సంవత్సరాల అంశాలకు సమ ప్రాధాన్యం కల్పిస్తూ ప్రశ్నలు అడిగారు. అందువల్ల విద్యార్థులు ఇంటర్మీడియెట్ రెండు సంవత్సరాల సిలబస్‌పై పూర్తిగా పట్టుసాధించాలి. హ్యూమన్ ఫిజియాలజీ, మైక్రోబ్స్ ఇన్ హ్యూమన్ ఫిజియాలజీ, హ్యూమన్ ఇన్సులిన్ అండ్ వ్యాక్సిన్ ప్రొడక్షన్, టాక్సానమీ, నెర్వస్ సిస్టమ్, క్లాసిఫికేషన్ ఆఫ్ ప్లాంట్స్, ప్లాంట్ ఫిజియాలజీ, బయోటెక్నాలజీ అప్లికేషన్స్, ఎకలాజికల్ సక్సెషన్, ఎకలాజికల్/ఎన్విరాన్‌మెంటల్ ఇష్యూస్‌పై పట్టు సాధించాలి. డయాగ్రమ్ ఆధారిత ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. చాప్టర్ల వారీగా ముఖ్యమైన అంశాలను చదవాలి. బయాలజీలోని మార్ఫాలజీ, సిస్టమాటిక్ బోటనీలోని పలు సైంటిఫిక్ పదాలపై అవగాహన ఉండాలి. విద్యార్థులు దృష్టిపెట్టాల్సిన మరో ముఖ్యమైన అంశం ప్లాంట్ కింగ్‌డమ్. ఈ చాప్టర్‌లోని అంశాలను గుర్తుంచుకోవడాన్ని విద్యార్థులు క్లిష్టంగా భావిస్తారు. కానీ.. డ్రైల్యాండ్ హేబిటెట్స్‌లో ఇమిడిపోవడానికి గ్రూప్స్‌లో మారుతున్న వేర్వేరు లక్షణాలను గుర్తు చేసుకుంటూ చదివితే సులువుగా ఈ అంశాలపై పట్టు లభిస్తుంది. పూర్తిగా ప్రాక్టికల్ నాలెడ్జ్ అవసరమైన హిస్టాలజీ, ఇంటర్నల్ అనాటమీలోని అంశాలను గుర్తు పెట్టుకోవడానికి వేర్వేరు మొక్కల సమూహాల్లో వేస్క్యులర్ ఎలిమెంట్స్ ప్రమేయాన్ని తెలుసుకోవాలి.

గత పేపర్లను పరిశీలిస్తే.. ఎకాలజీ, జెనెటిక్స్, ఎవాల్యుయేషన్, హ్యూమన్ ఫిజియాలజీ, హ్యూమన్ రీప్రొడక్షన్, రీ ప్రొడక్టివ్ హెల్త్ చాప్టర్లలోని అన్ని అంశాలను చదవాలి. ఎకాలజీకి సంబంధించి సగటున పది ప్రశ్నలు వస్తాయి. బయాటిక్ ఫ్యాక్టర్స్, అడాప్టేషన్స్‌పై పూర్తిస్థాయి అవగాహన ఏర్పరచుకోవాలి. జువాలజీకి సంబంధించిన సామాజిక అవగాహన అవసరం. జాతీయ జంతువులు, పార్కులు, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు, వాతావరణ మార్పు వంటి సమకాలీన, సామాజిక సంబంధిత అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. డయాగ్రమ్ ఆధారిత ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. ఎన్‌సీఈఆర్‌టీ 11, 12 తరగతుల్లోని జువాలజీ పుస్తకాల్లోని డయాగ్రమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.



రివిజన్ చాలా ముఖ్యం.. ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తయిన తర్వాత నీట్‌కు లభించే సమయంలో కొత్త అంశాల ప్రిపరేషన్ కంటే అప్పటికే పట్టు సాధించిన అంశాల రివిజన్‌కు ప్రాధాన్యమివ్వాలి. రివిజన్‌లో అప్పటికే రూపొందించుకున్న షార్ట్‌నోట్స్, డయాగ్రమ్స్‌ను ప్రాక్టీస్ చేయడం ముఖ్యం. డయాగ్రమ్స్‌కు సంబంధించి ఒక భాగాన్ని గుర్తించే నైపుణ్యంతోపాటు.. దాని ప్రాధాన్యాన్ని వివరించే సామర్థ్యం పొందాలి. డయాగ్రమ్‌కు సంబంధించి సబ్జెక్టు పరంగా ఉన్న అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

ఫిజిక్స్, కెమిస్ట్రీ...

గతేడాది ప్రశ్నపత్రాన్ని పరిశీలిస్తే.. ఫిజిక్స్‌లో మెకానిక్స్ (52 మార్కులు); మోడ్రన్ ఫిజిక్స్ (32 మార్కులు); ఎలక్ట్రో డైనమిక్స్ (40 మార్కులు)కు మార్కుల పరంగా అధిక వెయిటేజీ లభించింది.

కెమిస్ట్రీలో ఇనార్గానిక్ కెమిస్ట్రీ1, 2 (64 మార్కులు); ఆర్గానిక్ కెమిస్ట్రీ1 (12 మార్కులు), ఆర్గానిక్ కెమిస్ట్రీ2 (52 మార్కులు); ఫిజికల్ కెమిస్ట్రీ1 (28 మార్కులు), ఫిజికల్ కెమిస్ట్రీ2 (24 మార్కులు).

నీట్ అభ్యర్థులు కొంత ఆందోళనకు గురయ్యే సబ్జెక్ట్‌లు ఫిజిక్స్, కెమిస్ట్రీ. ప్రాక్టీస్ బేస్డ్ లెర్నింగ్‌తో ఈ రెండు సబ్జెక్టులపై పట్టు సాధించడం తేలికే. అప్లికేషన్ ఓరియెంటేషన్, కాన్సెప్ట్ బేస్డ్ అప్రోచ్‌తో ప్రిపరేషన్ సాగించాలి.

ఫిజిక్స్‌లో ఎలక్ట్రో మ్యాగ్నటిజం, ఏసీ సర్క్యూట్స్, రే ఆప్టిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, కరెంట్ ఎలక్ట్రిసిటీ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

కెమిస్ట్రీలో కెమిస్ట్రీ ఇన్ ఎవ్రీ డే లైఫ్, ఈథర్స్ నామెన్‌క్లేచర్, క్లీనింగ్ ఏజెంట్స్, క్లీనింగ్ యాక్షన్స్, బయలాజికల్ ఇంపార్టెన్స్ ఆఫ్ మెగ్నీషియం అండ్ కాల్షియం, ఎస్‌బ్లాక్ ఎలిమెంట్స్‌ను ముఖ్య అంశాలుగా భావించి పట్టు సాధించాలి.

గతేడాది వెయిటేజీలనే నమ్ముకోకుండా.. అన్ని అంశాలను విశ్లేషణాత్మకంగా చదివితే ఈ రెండు విభాగాల్లోనూ ఎలాంటి ప్రశ్నలు ఎదురైనా సమాధానాలివొచ్చు.

తెలుగులోనూ ప్రశ్నాపత్రం అందుబాటులో ఉంటుందని పేర్కొనడం ఈసారి నీట్ తెలుగు అభ్యర్థులకు కలిసొస్తుందని చెప్పొచ్చు. దీనివల్ల ప్రధానంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మంచి ప్రయోజనం కలుగుతుంది. బోటనీ, జువాలజీలకు సంబంధించి కొన్ని పదాల విషయంలో ఇంగ్లీష్ పదజాలంపైనా అవగాహన పెంచుకుంటే.. ప్రశ్నపత్రంలో ఏదైనా అనువాద దోషాలు తలెత్తినా సులువుగా అధిగమించే సామర్థ్యం లభిస్తుంది.

నేషనల్ పూల్ ప్రయోజనమే..

ఈ ఏడాది రెండు తెలుగు రాష్ట్రాలు నేషనల్ పూల్‌లోకి వెళ్లాయి. దీనివల్ల మన రాష్ట్రంలోని సీట్లతోపాటు జాతీయ స్థాయిలో దాదాపు నాలుగున్నర వేల సీట్లు అందుబాటులోకి వస్తాయి. కానీ, వీటికి తెలుగు రాష్ట్రాల విద్యార్థులతోపాటు ఇతర రాష్ట్రాల విద్యార్థులు కూడా పోటీపడతారు. కాబట్టి ర్యాంకులు, మార్కుల పరంగా ఉన్నతంగా నిలవాల్సి ఉంటుంది. గతేడాది జనరల్ కేటగిరీలో 10 వేల వరకు; రిజర్వ్‌డ్ కేటగిరీల్లో 25 వేల వరకు ర్యాంకుతో నేషనల్ పూల్ సీట్లు లభించాయి.

కనీస ఉత్తీర్ణత ఉండాల్సిందే :

నీట్‌లో ఉత్తీర్ణత, ఆ తర్వాత మెరిట్ జాబితా విడుదల కోణంలో సీబీఎస్ఈ ప్రత్యేకంగా నీట్‌లో అర్హత నిబంధనలు రూపొందించింది. జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 50 పర్సంటైల్, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 40 పర్సంటైల్ సాధించాలి. ఆయా వైద్య కళాశాలల్లో ప్రవేశం పొందాలంటే మాత్రం 80 పర్సంటైల్‌కు పైగా జాబితాలో నిలిస్తేనే సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు.

జీకే - కరెంట్ అఫైర్స్

2018 పద్మ పురస్కారాలు

పద్మ విభూషణ్‌లు

ఇళయరాజా (సంగీతం) తమిళనాడు,
పరమేశ్వరన్ (సాహిత్యం, విద్యారంగం) కేరళ,
గులాం ముస్తఫాఖాన్ (సంగీతం) మహారాష్ట్ర

పద్మ భూషణ్ విజేతలు

పంకజ్ అద్వాణీ (క్రీడ – బిలియర్డ్స్) కర్ణాటక,
ఫిలిపోస్ మార్ క్రిసోస్టోమ్ (ఆధ్యాత్మికం) కేరళ
వేదప్రకాశ్ నంద (సాహిత్యం, విద్యారంగం) అమెరికా,
రామచంద్రన్ నాగస్వామి (పురాతత్వ విభాగం) తమిళనాడు,
అలెగ్జాండర్ కడాకిన్ (ప్రజాసంబంధాలు) రష్యా(మరణానంతర/విదేశీ),
మహేంద్రసింగ్ ధోనీ (క్రీడ – క్రికెట్) జార్ఖండ్,
లక్ష్మణ్ పాయ్ (కళారంగం) గోవా,
అరవింద్ పారిఖ్ (సంగీతం) మహారాష్ట్ర,
శారదాసిన్హా (సంగీతం) బీహార్



పద్మశ్రీ విజేతలు

ఎల్ సుబదాని దేవి (కళలు– నేత) మణిపూర్,
శ్యామ్‌లాల్ చతుర్వేది (సాహిత్యం, ప్రాతికేయం) ఛత్తీస్‌గాఢ్,
మిరాబాయి చాను (క్రీడలు) మణీపూర్,
సుధాన్సు బిశ్వాస్ (సామాజిక సేవ) పశ్చిమ బెంగాల్,
మోహన్ స్వరూప్ భాటియా (సంగీతం) ఉత్తర ప్రదేశ్,
ప్రఫుల్ల గోవింద బారాహ్ (సాహిత్యం, ప్రాతికేయం) అస్సోం,
దామోదర్ గణేష్ బాపత్ (సామాజిక సేవ) ఛతీస్‌గఢ్,
రాణి బంగ్ (వైద్యం) మహారాష్ట్ర,
సోమ్‌దేవ్ దేవర్‌మాన్ (క్రీడలు–టెన్నిస్) త్రిపుర,
యషి ధోడెన్ (వైద్యం) హిమాచల్ ప్రదేశ్,
అరుప్ కూమార్ దత్త (సాహిత్యం, విద్య) అస్సోం,
డాదరరంగౌడ (కళలు– గేయ రచన) కర్ణాటక,
అరవింద్ గుప్త (సాహిత్యం విద్య) మహారాష్ట్ర,
అభయ్ భంగ్ (వైద్యం) మహారాష్ట్ర,
దిగంబర్ హందా (సాహిత్యం, విద్య) జార్ఖండ్,
అన్వర్ జాలాల్పురి (మరణానంతరం): (సాహిత్యం, విద్య) ఉత్తర ప్రదేశ్,
పియాంగ్ టెంజిన్ జామిర్ (సాహిత్యం, విద్య) నాగాలాండ్,



సితవ్వ జొద్దాటి (సాహిత్యం, సేవా) కర్ణాటక,
మల్తీ జోషి (సాహిత్యం, విద్య) మధ్యప్రదేశ్,
మనోజ్ జోషి (కళలు–నటన) మహారాష్ట్ర,
రామేశ్వర్లాల్ కబ్రా (వ్యాపారం) మహారాష్ట్ర,
పాన్ కిషోర్ కౌల్ (కళలు) జమ్ము కశ్మీర్,
విజయ్ కచ్లు (కళలు–సంగీతం) పశ్చిమ బెంగాల్,
లక్ష్మి కుట్టి (వైద్యం) కేరళ,
రాథోర్ (సివిల్ సర్వీస్) గుజరాత్,
అమితావ రాయ్ (సైన్స అండ్ ఇంజినీరింగ్) పశ్చిమబెంగాల్,
ఆర్ సత్యనారాయణ (కళలు) కర్ణాటక,
పంకజ్ ఎం షా (వైద్యం) గుజరాత్,
భజ్జ శ్యాం (కళలు–పెయింటింగ్) మధ్యప్రదేశ్,
మహారావు రఘువీర్ సింగ్ (సాహిత్యం, విద్యా) రాజస్థాన్,
కిదాంబి శ్రీకాంత్ (కీడలు–బ్యాడ్మింటన్) ఆంధ్రప్రదేశ్,
ఇబ్రహీం సుతర్ (కళలు– సంగీతం) కర్ణాటక
సిద్ధేశ్వర్ స్వామిజీ (ఆధ్యాత్మికం) కర్ణాటక,
లెంటినో థాకర్ (సామాజిక సేవా) నాగాలాండ్,
విక్రం చంద్ర ఠాకుర్ (సైన్స్ అండ్ ఇంజినీరింగ్) ఉత్తరాఖండ్,
రుద్రపట్నం నారాయణ స్వామి (కళలు–సంగీతం) కర్ణాటక,
ధరంథన్ రుద్రపట్నం నారాయణ స్వామి (కళలు–సంగీతం) కర్ణాటక,
త్యాగరాజన్ నెయెన్ టీన్ థిన్ (ఆధ్యాత్మికం) వియత్నాం,
భగీరత్ ప్రసాద్ త్రిపాఠి (సాహిత్యం–విద్య) ఉత్తర ప్రదేశ్,
నారాయణ్ దాస్ మహారాజ్ (ఆధ్యాత్మికం) రాజస్థాన్,
జోయ్ శ్రీగోస్వామి (సాహిత్యం–విద్య) అస్సోం,
ప్రవాకర మహారాణా (శిల్ప కళ) ఒడిషా,
జవేరిలాల్ మెహతా (సాహిత్యం–విద్య) గుజరాత్,
కృష్ణ బీహారీ మిశ్రా (సాహిత్యం–విద్య) పశ్చిమ బెంగాల్,
సిసిర్ పురుషోత్తం మిశ్రా (కళ–సినిమా) మహారాష్ట్ర,
ఎం ఎస్. సుభాసిని మిస్త్రే (సామాజిక సేవా) పశ్చిమ బెంగాల్,
కేశవ్ రావు (సాహిత్యం–విద్య) మధ్య ప్రదేశ్,
నానామమాల్ (యోగా) తమిళనాడు,
సులగిట్టి నరసమ్మ (సామాజిక సేవా) కర్ణాటక,
విజయలక్ష్మీ (కళ–జానపద సంగీతం) తమిళనాడు,
గోవర్ధన్ ఏనికా (కళలు–నేత) ఒడిషా,
బాబాని చరణ్ పట్నాయక్ (ప్రజా సంబంధాలు) ఒడిషా,
ముర్లీకాంత్ పెటేకర్ (క్రీడలు–ఈత) మహారాష్ట్ర,
ఎం. రాజగోపాల్ (వైద్యం) కేరళ,
సాంపత్ రామ్టేకే(మరణానంతరం): (సామాజిక సేవ) మహారాష్ట్ర,
చంద్ర శేఖర్ రాత్ (సాహిత్యం, విద్య) ఒడిషా
రాజగోపాలన్ వాసుదేవన్ (సైన్స్ అండ్ ఇంజినీరింగ్) తమిళనాడు,
మనస్ బిహారీ వర్మ (సైన్స్ అండ్ ఇంజినీరింగ్) బిహార్,
పనతవేనే గంగాధర్ (సాహిత్యం, విద్య) మహారాష్ట్ర,
రోములస్ విటేకర్ (జంతు సంరక్షణ) తమిళనాడు,
బాబా యేగేంద్ర (కళలు) మధ్యప్రదేశ్,
ఎ జాకియా (సాహిత్యం, విద్య) మిజోరం.

పద్మశ్రీకి ఎంపికైన విదేశీయులు

సందుక్ రూట్ (వైద్యం) నేపాల్,
హబీబుల్లో రాజాబోవ్ (సాహిత్యం, విద్య) తజికిస్తాన్,
మాలై హాజీ అబ్దుల్లా బిన్ మాలయ్ హాజి ఓథ్‌మన్ (సామాజిక సేవ) బ్రూనే, దారుస్సలాం,
ఐ న్యామన్ నౌటా (శిల్పకళ) ఇండోనేషియా,
డా॥ థాంట్ మైఇంట్–యు (ప్రజా సంబంధాలు) మయన్మార్,
సోమ్డెట్ ఫ్రా మహా (ఆధ్యాత్మికం) థాయిలాండ్,
టోమియో మిజోకిమి (సాహిత్యం, విద్య) జపాన్,
నౌఫ్ మర్వాయ్ (యోగా) సౌదీ అరేబీయా,
టామీకో ప్రజా సంబంధాలు) సింగాపూర్,
హన్ మెనీ ప్రజా సంబంధాలు) కంబోడియా,
రామ్లీ బిన్ ఇబ్రహీం (కళలు, నృత్యం) మలేషియా,
బౌన్లాప్ కీకోంగ్న (ఆర్కిటెక్చర్) లావోస్,
జోస్ మా జోయ్ (వ్యాపారం) ఫిలిప్పీన్స్.



చేనేత రుణాలు మాఫీ చేయాలి



మన తెలంగాణ / హైదరాబాద్ : చేనేత కార్మికుల రుణాలను తక్షణమే మాఫీ చేసి, తిరిగి రుణ సౌకర్యం కల్పించాలని తెలంగాణ చేనేత కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రచార ఆర్భాటమే తప్ప చేనేత కార్మికులను ఆకలి చావుల, ఆత్మహత్యల నివారించేందుకు తీసుకున్న చర్యలేమీ లేవని విమర్శించారు. మఖ్దూంభవన్‌లో గురువారం జరిగిన తెలంగాణ చేనేత కార్మికసంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి సంఘం అధ్యక్షులు పి.లక్ష్మి నర్సయ్య అధ్యక్షతన వహించగా చేనేత సంఘం రాష్ట్ర నాయకులు ఏశాల అశోక్, మంగళంపల్లి జనార్ధన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ ఆత్మహత్యలు చేసుకున్న చేనేత కార్మికుల కుటుంబాలకు తలా రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియో చెల్లించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, వారి పిల్లలకు ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువు చెప్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత సంవత్సరం బడ్జెట్‌లో చేనేత, జౌళి శాఖకు కలిపి రూ.1200 కోట్లు కేటాయించినట్లు ప్రకటించారే తప్ప ఇప్పటివరకు ఖర్చు చేసిందేమీలేదన్నారు. అర్హులైన చేనేత కార్మికులకు 50 శాతం సబ్సిడీతో నూలు సరఫరా చేయాలని, అర్హులైనవారందరికీ వర్కుషెడ్‌తో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.

రాష్ట్రంలో తైక్వాండో అకాడమీ!

మన తెలంగాణ/హైదరాబాద్: తైక్వాండో జాతీయ అకాడమీ ఏర్పాటు అంశంపై ముఖ్యమంత్రి కెసిఆర్‌తో చర్చిస్తామని మంత్రులు హరీశ్‌రావు, పద్మారావు చెప్పారు. తైక్వాండోకు తెలంగాణలో ఉన్న భవిష్యత్తు అవకాశాలు, ప్రభుత్వపరంగా కావాల్సిన సహకారం, జాతీయ అకాడమీ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సౌకర్యాలు, దీంతో వచ్చే ప్రయోజనాలు, భవిష్యత్తులో ఒలింపిక్ క్రీడల్లో పాల్గొనేలా యువతను తీర్చిదద్దడం వంటి వివరాలతో సమగ్ర ప్రతిపాదనలను క్రీడల శాఖ మంత్రి పద్మారావుకు ఇవ్వాలని క్రీడాకారులకు హరీశ్‌రావు సూచించారు. డల్లాస్‌లో జరిగిన పోటీల్లో గెలుపొందిన టేక్వాండో క్రీడాకారులు గురువారం జలసౌధలో మంత్రులు పద్మారావు, హరీశ్‌రావులను కలిసారు. విజేతలకు నగదు ప్రోత్సాహకాలు ఇస్తామని పద్మారావు ప్రకటించారు. అంతర్జాతీయ టేక్వాండో చాంపియన్‌షిప్ పోటీలలో 3 బంగారు పథకాలను తెలంగాణ క్రీడాకారులు సాధించారు. ఈ సందర్భంగా మంత్రులు బంగారు పథకాలు సాధించిన క్రీడాకారులు కొండ సహదేవ్, అబ్దుల్ ఖలీల్, కె.సింధు తపస్విలను సత్కరించారు. బ్యాట్మింటన్ క్రీడాపోటీల్లో అంతర్జాతీయంగా 12 మెడల్స్ సాధించే అవకాశం మాత్రమే ఉండగా, టేక్వాండోలో పురుషులు, మహిళలు కేటగిరీల్లో కలిపితే మొత్తం 64 బహుమతులు సాధించే అవకాశం ఉంటుందని మంత్రులకు తైక్వాండో వరల్డ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆశిష్ తనెజా వివరించారు.

బొగ్గు గనుల ప్రైవేటీకరణపై ఖండన



మన తెలంగాణ / హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఎఐటియుసి తీవ్రంగా ఖండించింది. జాతి ప్రయోజనాలకు వ్యతిరేకమైన గనుల ప్రైవేటీకరణను తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు టి.నరసింహన్ అధ్యక్షతన గురువారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానాన్ని ఆమోదించినట్లు ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అనేక ఉద్యమాల ఫలితంగా జాతీయకరణ జరిగి దేశానికి లక్షల కోట్ల ఆదాయం సమకూరిన బొగ్గు గనుల ప్రైవేటీకరణ విధానం విదేశీ, స్వదేశీ కార్పోరేట్ పెట్టుబడిదారులకు మరిన్ని లాభాలు చేకూర్చే విధంగా ఉందని విమర్శించారు. ఇపిఎఫ్‌పై స్తున్న వడ్డీని 8.65 శాతాన్ని యధావిధిగా కొనసాగించాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కాల పరిమితి ముగిసిన కనీస వేతనాల జిఓలను వెంటనే పునరుద్ధరించి కనీస వేతనం రూ.18 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు.

తుమ్మలతో కెనడా ప్రతినిధుల భేటీ

మన తెలంగాణ / హైదరాబాద్ : రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుతో గురువారం సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో కెనడా ప్రతినిధులు భేటీ అయ్యారు. ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, ఇంజనీర్ ఇన్ చీఫ్ రవీందర్‌రావుతో పాటు నిజామాబాద్ అర్బన్ ఎంఎల్‌ఎ బి.గణేష్ గుప్తాతో కలిసి కెనడా ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమావేశం అయ్యారు. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి కోసం నిధులు సేకరించేందుకు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల కెనడా ప్రతినిధులతో చర్చలు జరిపారు.

ఎస్‌సిఆర్‌పిఓఎ నూతన కార్యవర్గం





మన తెలంగాణ / హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే ప్రొమోటీ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎస్‌సిఆర్‌పిఓఎ) నూతన అధ్యక్షులుగా ఎల్.సాంబశివరావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.ఎన్.మూర్తి ఎన్నికయ్యా రు. రైల్ నిలయం లో జరిగిన అసోసియేషన్ వార్షిక సర్వసభ్య సమావేశంలో నూతన నాయకత్వాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్‌సిఆర్‌పిఓఎ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షకీల్ అహ్మద్, ఉపాధ్యక్షులుగా జి.రామ్‌సుధాకర్, పి.వి.ఎన్. నాయు డు, సి.నాగరాజు, ఎ.బడ్డయ్య, సంయుక్త కార్యదర్శులుగా కె.ఫణిరాజ్, పి.సంతోష్‌కుమార్, కె.గణేష సిహెచ్.వి.విజయభాస్కర్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా బి.డి.క్రిస్టఫర్, జి.హెచ్.ఎన్.చౌదరి, ఎస్.రమేష్ బాబు, ఎన్.ముత్తుస్వామీ, కోశాధికారిగా ఎస్.మదన్‌మోహన్‌లను ఎన్నుకున్నట్లు ప్రధాన కార్యదర్శి ఎం.ఎన్.మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. నూతన కార్యవర్గం 2021 వరకు బాద్యతలు నిర్వర్తిస్తుందని ఆయన తెలిపారు.

ఇసుక తవ్వకాలపై విచారణ వాయిదా

మనతెలంగాణ/న్యూఢిల్లీ: ఎపిలో ఇసుక అక్రమ తవ్వకాలపై రేలా అనే స్వచ్ఛంధ సంస్థ దాఖలు చేసిన పిటీషన్ పై గురువారం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో విచారణ జరిగింది. తదుపరి విచారణను ట్రిబ్యునల్ మార్చి 14కు వాయిదా వేసింది. రేలా స్వచ్ఛంధ సంస్థ, వరలక్ష్మి లు దాఖలు చేసిన పిటీషన్ తో పాటు ఇటీవల దాఖలయిన మరో పిటీషన్ ను కలిపి జస్టిస్ రాథోడ్ నేతృత్వంలోని గ్రీన్ ట్రిబ్యునల్ ధర్మాసనం గురువారం విచారించింది. ఇసుక తవ్వకాలకు సంబంధించి ఏ ప్రాతిపదికన అనుమతులు ఇచ్చారనే దానిపై ఎపి మైనింగ్ కార్యదర్శి, సీఆర్డీఎ, సాగునీటి శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖలు గ్రీన్ ట్రిబ్యునల్ కు నివేదికలు ఇచ్చాయి. అయితే ఈ నివేదికలు అన్నీ ఒకేలా ఉన్నాయని పిటీషనర్ల తరపు న్యాయవాది శ్రావణ్ కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎవరికి ఎంత ఇసుక కేటాయించారనే దానిపై వివరాలు సరిగా లేవని శ్రావణ్ కుమార్ ట్రిబ్యునల్ కు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి దాఖలయిన పిటీషన్లపై విచారణ జరపాల్సిన అవసరం లేదని, వాటికి విచారణ అర్హత లేదని ఎపి ప్రభుత్వం తరపు న్యాయవాది పాటిల్ ట్రిబ్యునల్ ని కోరారు.

26న ఎంసెట్ కమిటీ సమావేశం

మనతెలంగాణ/హైదరాబాద్ : ఎంసెట్, ఇసెట్ ప్రవేశ పరీక్షల కమిటీలు ఈ నెల 26న సోమవారం సమావేశం కానున్నాయి. ఈ ఏడాది తొలిసారిగా జెఎన్‌టియుహెచ్ ఆన్‌లైన్‌లో ఎంసెట్ పరీక్షలను నిర్వహిస్తున్నాయి. సోమవారం కమిటీ సమావేశమై దరఖాస్తుల స్వీకరణ, ముగింపు తేదీలు ఖరారు చేసి నోటిఫికేషన్ విడుదల చేయనున్నాయి

నీరవ్ మోడీ సెజ్‌పై నజర్

(మొదటిపేజీ తరువాయి)

ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్టుమెంట్ అధికారులు ఈ సెజ్‌లో కూడా సోదాలు జరిపారు. అనంతరం వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సెజ్ ఎదుట ఉద్యోగులు ధర్నా నిర్వహించి ఉద్యోగ భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలకు ముప్పు ఏర్పడినట్లయితే ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధిని చూపించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో పరిశ్రమల శాఖ, టిఎస్‌ఐఐసి అధికారులు సమావేశమై సెజ్ గురించి లోతుగా చర్చించడం, ఢిల్లీ వెళ్ళాలని నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

రేపటి నుంచి టిఆర్‌టి పరీక్షలు



- తొలిసారిగా ఆన్‌లైన్‌లో....
- అభ్యర్థులు ప్రాక్టీస్ చేసుకునేందుకు వెబ్‌సైట్‌లో మాక్ టెస్ట్‌లు

మనతెలంగాణ/హైదరాబాద్ : ఉపాధ్యాయ నియామక పరీక్షలు(టిఆర్‌టి) శనివారం నుంచి మార్చి 3 వరకు జరుగనున్నాయి. శనివారం ఉదయం జరుగనున్న పరీక్షలకు సవరించిన హాల్‌టికెట్లు బుధవారం నుంచి అందుబాటులో ఉంచగా, 25న జరిగే పరీక్షల హాల్‌టికెట్లు గురువారం నుంచి వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. శనివారం జరుగనున్న లాంగ్వేజ్ పండిట్ (తెలుగు) పరీక్షకు 17970 మంది, 25న ఉదయం జరుగనున్న ఎస్‌జిటి(తెలుగు) పరీక్షకు 56,468 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.

వెబ్‌సైట్‌లో మాక్ టెస్ట్‌లు

పబ్లిక్ సర్వీస్ కమిషన్ మొత్తం 48 విభాగాల్లో నిర్వహిస్తున్న ఈ పరీక్షల్లో మూడు మినహా అన్నీ ఆన్‌లైన్‌లోనే జరుపుతోంది. తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నందువల్ల అభ్యర్థుల అవగాహన కోసం వెబ్‌సైట్‌లో మాక్ టెస్ట్‌లను అందుబాటులో ఉంచింది. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటలకు పనిచేసేలా ఏర్పాటైంది. అభ్యర్థులు సమస్యల పరిష్కారం కోసం నేరుగానూ, ఫోన్ నెంబర్ 8333923740 ద్వారానూ, helpdesk@tspsc.gov.in ద్వారానూ సంప్రదించవచ్చు.

మైనారిటీల సబ్సిడీ రుణాలకు బ్యాంకులతో ఇబ్బందులు

మన తెలంగాణ / హైదరాబాద్ : నిరుద్యోగ విద్యావంతులకు స్వయం ఉపాధి పథకాల కింద మంజూరు చేస్తున్న సబ్సిడీ రుణాలకు బ్యాంకుల అనుసంధానంతో అవరోధాలు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వం సబ్సిడీని మంజూరు చేస్తున్నా బ్యాంకు లింకేజి కారణంగా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని స్వయం ఉపాధి పథకాల రుణాలు పూర్తి స్థాయిలో అందడం లేదని లబ్దిదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం నుంచి సకాలంలో సబ్సిడీ నిధులు అందకపోవడంవల్లనే రుణాలు ఇవ్వలేకపోతున్నామని బ్యాంకు అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రభుత్వం సబ్సిడీ రుణాల నిమిత్తం రూ.150 కోట్ల మేర కేటాయించినా ఇప్పటివరకు రూ. 45 కోట్లు మాత్రమే విడుదలైనట్లు వ్యాఖ్యానించారు. క్యాటగిరి–1 కింద లక్ష రూపాయల లోపు రుణానికి 80%, క్యాటగిరి–2 కింద రెండు లక్షల రూపాయల వరకు రుణానికి 70%, క్యాటగిరి–3 కింద 10 లక్షల రూపాయల వరకు 60% సబ్సిడీ లేదా రూ.5 లక్షలు ఏది తక్కువైతే అంత మొత్తాన్ని మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాలను మంజూరు చేస్తోంది. లబ్దిదారులను ఎంపిక చేసి కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ సబ్సిడీ మంజూరైనా బ్యాంకులు మాత్రం రుణాలు మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు లబ్దిదారులు వాపోతున్నారు. బ్యాంకుల చుట్టూ తిరిగినా ఫలితం ఉండడంలేదని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి ఆమోదం లభించగానే నేరుగా వంద శాతం సబ్సిడీ రుణాలు అందజేస్తామని ఉపముఖ్యమంత్రి మహమూద్ ఆలీ చాలా కాలం క్రితమే ప్రకటించినా ఇప్పటికీ అది కార్యరూపం దాల్చలేదని పలువురు మైనారిటీ యువత ప్రశ్నిస్తోంది. 2016–17 ఆర్థిక సంవత్సరంలో ఎంపికైన లబ్దిదారులకు ఇప్పటికీ రుణాలు లభించలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సబ్సిడీ రుణాలకు ఇంకా దరఖాస్తులను ఆహ్వానించలేదు. ప్రతి ఏడాది లక్షల సంఖ్యలో రుణాల కోసం దరఖాస్తులు వస్తున్నా లబ్దిదారుల సంఖ్య మాత్రం గత మూడేళ్ళకు కలిపి14 వేలకు మించలేదు.



తెలంగాణ సిఎం కెసిఆర్‌ను గవర్నర్ నరసింహన్ గురువారం పరామర్శించారు. కెసిఆర్ రెండో అక్క విమలాబాయి బుధవారం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. సోదరి వియోగంతో బాధపడుతున్న కెసిఆర్‌ను గురువారం గవర్నర్ నరసింహన్ కలిసి పరామర్శించారు.

ముదురుతున్న పేచీ!

(మొదటిపేజీ తరువాయి)

గతంలో గ్రూప్ 1 పరీక్షల ఫలితాల్లో ర్యాంకుల విషయంలో ఏర్పడిన గందరగోళం తదితర అంశాలను సంబంధిత అధికారులతో చర్చించాలని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో సిజిసి సైతం సర్వీస్ కమిషన్ అవసరాలకు సరిపడే తీరులో సాంకేతిక సహకారాన్ని ఇవ్వడంలేదన్న ఆరోపణలపై కూడా సమావేశంలో చర్చించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏ విభాగం వల్ల జరిగినా అంతిమంగా విద్యార్థులకు ఇబ్బందులు, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తున్నాయి కాబట్టి సంయుక్త సమావేశంలోనే ఈ అంశాలన్నింటినీ కూలంకషంగా చర్చించి పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సీనియర్ అధికారి సన్నాహాలు చేస్తున్నారు. రెండు విభాగాలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి మధ్య నెలకొనాల్సిన పకడ్బందీ సమన్వయంలపై వీలైనంత త్వరలోనే ఉన్నతాధికారులతో సంయుక్త సమావేమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే సీనియర్ అధికారి ఈ రెండు విభాగాల నిర్వాహకులతో మాట్లాడినట్లు తెలిసింది.

భవిష్యత్తు బయోదే

(మొదటిపేజీ తరువాయి)

మాస్టర్స్ డిగ్రీని బయో సైన్స్‌లోనే చేసినట్లు తెలి పారు. ప్రపంచంలో 33 శాతం వ్యాక్సిన్లు మన రాష్ట్రంలోనే తయారుకావడం సంతోషించదగిన విషయమన్నారు. రాష్ట్రంలోని జినోమ్ వ్యాలీ క్లస్టర్ ఆసియాలోనే అతి పెద్దదని, దాన్ని మరింత విస్తరింపచేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జినోమ్ వ్యాలీకి ఫార్మా కంపెనీలను ఆహ్వానిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో తక్కువ ధరలకు పలు వ్యాక్సిన్లు అందిస్తున్నామని, వ్యాక్సిన్ల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. లైఫ్ సైన్స్‌ను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరముందని, ఈ రంగంలో కొత్త ఒరవడిని సృష్టించేందుకు ప్రభుత్వం తన వంతు సహకారాన్ని అందిస్తుందని, ఇందుకోసం కొత్త మార్కెట్‌ను ఆవిష్కరించాల్సిన అవసరముందని తెలిపారు. ఓరల్ సాలిడ్స్ కోసం ఇంజక్షన్లు, ఫార్ములేషన్ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని, దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం ప్రత్యేక చొరవ చూపుతున్నారని గుర్తుచేశారు. ఈ సదస్సుకు సీఎం కేసీఆర్ రావాల్సి ఉన్నా కుటుంబ కారణాల వల్ల రాలేకపోయారని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా వైద్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. అనారోగ్య సమస్యల పరిష్కారంలో ప్రపంచం లోనే రాష్ట్రం ముందు వరుసలో ఉండాలని సీఎం ఆకాంక్షిస్తున్నారని, లైఫ్ సైన్స్‌ను అభివృద్ధి చేసి రానున్న పదేళ్ళ కాలంలో నాలుగు లక్షల ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మలేషియా దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. మలేషియా ప్రతినిధి దాతు హసన్ హాజారే, టిఎస్‌ఐఐసి వైస్ ఛైర్మన్ ఇ.వి.నర్సింహారెడ్డిలు ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. 'బయో ఏషియా అసోసియేషన్' అవార్డును ప్రొఫెసర్ మైఖెల్ హాల్‌కు మంత్రి కేటీఆర్ అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులతో పాటు పలువురు ఫార్మా కంపెనీల ప్రతినిధులు, ఛైర్మన్లు పాల్గొన్నారు. వీరితో పాటు 50 దేశాల నుంచి 1500 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

మిర్చి ఘాటు

(మొదటిపేజీ తరువాయి)

శాతం రూ.7వేల నుంచి రూ.8,500లకు కొనుగోలు చేశారు. దీంతో రైతులు రూ.1500లకు పైగా తగ్గించి కొనుగోలు చేస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. మిర్చి యార్డు గేటుకు తాళాలు వేసి రైతులంతా గిట్టుబాటు ధర కల్పించాలని ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న మార్కెట్ కార్యదర్శి ఆర్.సంతోష్‌కుమార్, సిబ్బంది అక్కడకు వచ్చి రైతులతో మాట్లాడి శాంతింపజేసే ప్రయత్నం చేసినప్పటికీ వినకపోవడంతో రూరల్ ఏసిపి నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో, సిఐలు వెంకన్న బాబు, రాజిరెడ్డి, నాగేంద్రచారి, తిరుపతిరెడ్డి తదితరులు ఆ ప్రాంతానికి వచ్చి రైతులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు. రైతుల ఆందోళనకు మద్దతుగా సిపిఐ జిల్లా కార్యదర్శి బాగం హేమంతరావు, సిపిఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, పొన్నం వెంకటేశ్వర్లు, నున్నా నాగేశ్వరరావు, ఎండి నాయకులు మరీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు తోటకూరి శివయ్య మార్కెట్ ప్రాంతానికి వచ్చి రైతులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గతేడాది జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకుండానే మార్కెట్‌ను నిర్వహిస్తున్నారని వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను దోచుకుంటున్నారన్నారు. అంతర్జాతీయంగా అధిక ధర ఉన్నప్పటికీ ఖమ్మం మార్కెట్‌లో రోజు రోజుకు ధరలు తగ్గిస్తూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనను మిర్చి యార్డు నుంచి మార్కెట్ కార్యాలయానికి వచ్చి అక్కడ ఆందోళన చేపట్టారు. సుమారు ఐదు గంటల పాటు ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న ఆర్డీవో పూర్ణచంద్ర, ఏడిసిపి కొల్లు సురేష్‌కుమార్, తహశీల్దార్ శ్రీలత మార్కెట్‌కు వచ్చి మార్కెట్ అధికారులతో, మిర్చి వ్యాపారులతో పాటు వివిధ పార్టీ నాయకులతో చర్చలు జరిపారు.రెండు గంటల పాటు చర్చలు జరిగినంతరం రూ.7వేల నుంచి రూ.8, 900లోపు కొనుగోలు చేసి మిర్చికి సంబంధించి అదనంగా రూ.200 చెల్లించేవిధంగా వ్యాపారులు అంగీకరించారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తుగా మార్కెట్ కార్యాలయానికి తాళాలు వేసి మహిళా అధికారులను బయటకు పంపించారు. ఆందోళనలు సర్దుమణగడంతో మార్కెట్ అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

రైతు కార్పొరేషన్

(మొదటిపేజీ తరువాయి)

కల్పించేందుకు కృషి చేయనుంది. అంతర్జాయ, జాతీయ స్థాయి శాస్త్రవేత్తలు, నిపుణుల సహకారంతో ప్రణాళికలు ఏర్పరుచుకుని వ్యవసాయాన్ని అభివృద్ధి చేయనుంది. అవసరమైతే అవగాహన (ఎమ్ఒయూ) ఒప్పందాలు కూడా కుదుర్చుకుంటుంది. ఇదిలా ఉండగా 30 జిల్లా రైతు సమన్వయ సమితులకు సంబంధించి కూడా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు పార్థసారధి తెలిపారు. ఉత్తర్వుల జారీకి ముందు ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు దీనిపై ప్రగతి భవన్‌లో మంత్రులు, అధికారులతో సమీక్షించారు. 'తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి' పేరిట రాష్ట్రంలో కొత్త కార్పొరేషన్ ప్రారంభించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్రగతి భవన్‌లో గురువారం జరిగిన మంత్రులు, అధికారుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. వ్యవసాయాభివృద్ధి రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను క్షేత్రస్థాయికి తీసుకుపోవడంలో ఈ కార్పొరేషన్ కృషి చేస్తుందని సిఎం కెసిఆర్ పేర్కొన్నారు. లాభాపేక్ష లేని సంస్థ (నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్) తరహాలో ఈ కార్పొరేషన్ పనిచేస్తుందని, ఈ సంస్థకు సమకూరిన నిధులను ఈ సంస్థ ఏర్పాటు చేసిన లక్ష్యాల సాధన కోసమే వినియోగించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఈటెల రాజేందర్, ఇంద్రకరణ్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపిలు బి.వినోద్ కుమార్, గుత్తా సుఖేందర్ రెడ్డి, బాల్క సుమన్, అడ్వకేట్ జనరల్ ప్రకాశ్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శులు ఎస్.నర్సింగ్ రావు, వ్యవసాయ శాఖ కమిషనర్ జగన్ మోహన్ రావు తదితరులున్నారు. రైతు సమన్వయ సమితుల నిర్మాణం, విధులు, బాధ్యతలను నిర్ణయించడంతో పాటు, ఈ నెల 25,26 తేదీల్లో నిర్వహించే ప్రాంతీయ సదస్సులపై సిఎం కెసిఆర్ సమీక్ష ఈ సమావేశంలో చర్చించారు. ప్రాంతీయ సదస్సుల్లో మండల రైతు సమన్వయ సమితి సభ్యులతో పాటు ఆయా జిల్లాలకు చెందిన మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, జడ్‌పి చైర్ పర్సన్లు హాజరు కావాలని సిఎం స్పష్టం చేశారు. రైతులు పరస్పరం తమ అభిప్రాయాలు పంచుకోవడం కోసం, నిరంతర అవగాహన సదస్సులు నిర్వహించడం కోసం ప్రతీ ఐదు వేల ఎకరాలకు ఒకటి చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 2,630 రైతు వేదికలు నిర్మించనున్నట్లు సిఎం తెలిపారు. ఈ రైతు వేదికలను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. రైతు వేదికల నిర్వహణ బాధ్యతలను మండల రైతు సమన్వయ సమితులు తీసుకోవాలని సూచించారు. రైతు వేదికల నిర్మాణానికి స్థలాలను ఎంపిక చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ భూముల నుంచి గానీ, దాతల నుంచి గానీ, కొనుగోలు ద్వారా గానీ రైతు వేదికల కోసం స్థలం సేకరించాలని చెప్పారు.

కార్పొరేషన్ లక్ష్యాలు

- మద్దతు ధరను నిర్ధారించడం. కొనుగోళ్లు చేపట్టి రైతు ఆదాయం పెంచాలి
- రోజు వారి వినియోగానికి ప్రజలకు నేరుగా పరిశుభ్రమైన, సురక్షితమైన వ్యవసాయ ఆహర ఉత్పత్తులను లభ్యతను ప్రోత్సాహించాలి
- వ్యవసాయానికి అనుబంధ రంగాలైన మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, అగ్రోస్, వేర్ హౌసింగ్, ఆయిల్‌ఫెడ్, విత్తనాభివృద్ధి సంస్థలతో సంప్రదింపులు చేస్తూ సమన్వయంగా పనిచేయాలి
- పంట కోత అనంతరం ఉత్పత్తులను నిల్వ చేయడానికి శీతల గిడ్డంగులను వినియోగించుకుని గొలుసు నిర్వహణ పద్ధతిలో వినియోగదారునికి చేర్చాలి
- పిపిపి పద్ధతిలో పరిశ్రమలు, ఇప్పటికే ఉన్న ఆహార పరిశ్రమలతో సహకారం పెంపొందించేందుకు కార్పొరేషన్ పనిచేయాలి.
- పొరుగు రాష్ట్రాలకు, దేశాలకు వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి చేసే లక్ష్యంగా పనిచేయాలి
- పంట వేసే సమయంలో పంట కోత అనంతరం అవసరాలకు రైతు ఉత్పత్తి సంస్థలను ప్రోత్సాహించాలి.
- మార్కెటింగ్ విస్తరణకు మేధస్సుతో కూడిన తగిన సామర్థ్యంలో గోదాముల నిర్మాణం చేపట్టాలి

యువతకు ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

హనుమంతరావు, కోదండరెడ్డి, సేవాదళ్ తెలంగాణ ఇంచార్జ్ కెకె పాండే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన తొలి సంస్థ సేవాదళ్ అని, స్వాతంత్ర సంగ్రామంలో సేవాదళ్ పోరాటం అనిర్వచనీయమని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం కూడా ఆనందంగా లేదని, నాలుగు కోట్ల ప్రజల్లో కేసిఆర్ కుటుంబంలోని నలుగురు తప్ప ఎవరు బాగు పడలేదని విమర్శించారు., విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల, మైనారిటీ వర్గాలు తీవ్రంగా నష్టపోయాయని, అవినీతి అప్పులు తప్ప రాష్ట్రానికి ఏమి మిగలలేదన్నారు. కుంటియా మాట్లాడుతూ ఈ సారి యువతకు పెద్ద ఎత్తున ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఇప్పటికే ఎఐసిసి అధ్యక్షులు రాహుల్ గాంధీ హామీ ఇచ్చారన్నారు. రాష్ట్రంలో బంగారు తెలంగాణ అంటు ప్రచారం చేస్తున్నారని కానీ ఒక్కకెసిఆర్ కుటుంబం మాత్రమే బంగారు కుటుంబంగా మారిందని విమర్శించారు. ఇదిలాఉండగా గాంధీభవన్‌లో తొలి కేంద్ర విద్యా శాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ 60వ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. గాంధీభవన్‌లో ఆయన చిత్ర పటానికి మాజీ ఎం.పి హనుమంతరావు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ప్రకాశం హాల్‌లో కార్యక్రమంలో పిసిసి ఛీఫ్ ఉత్తమ్ ప్రసంగించారు.

విక్రమ్ కొఠారీ, రాహుల్ అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

మహారాష్ట్ర : రూ 49.82 కోట్లు, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ : రూ 97.47 కోట్లు. సిబిఐ విచారణ సందర్భంగా కొఠారీ పలు సందర్భాలలో తాను రుణాలు తీసుకున్న మాట వాస్తవమేనని అయితే తిరిగి చెల్లించలేదనేది అవాస్తవం అని తనపై బురద చల్లుతున్నారని ఆరోపించినట్లు సమాచారం అందింది. బ్యాంక్ ఆఫ్ బరోడా ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిబిఐ కొఠారీపై కేసులు నమోదు చేసింది. తొలుత ఆయనను కాన్పూర్‌లోని ఆయన నివాసంలో విచారించింది. తరువాత దేశ రాజధానిలో సిబిఐ ప్రధాన కార్యాలయంలో ప్రశ్నించారు. విచారణకు ఆయన సహకరించకపోవడం, సరైన సమాధానాలు ఇవ్వకపోవడం వల్లనే ఇప్పుడు అరెస్టులు జరిగాయని సిబిఐ వర్గాలు పిటిఐకి తెలిపాయి. రోటామాక్ అధినేత ఇతరులతో కలిసి బ్యాంకులను మోసగించినట్లు వడ్డీలను మినహాయిస్తే రూ 2919 కోట్ల మేర మోసం జరిగినట్లు సిబిఐ తెలిపింది. బుధవారం లాగానే గురువారం కూడా విచారణకు కొఠారీని సిబిఐ కార్యాలయానికి రప్పించారు. విచారణ తరువాత ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు సిబిఐ తెలిపింది. సిబిఐ వారు విక్రమ్ , భార్య సాధన, కుమారుడు రాహుల్, కొందరు బ్యాంక్ అధికారులపై కేసులు నమోదు చేశారు. విచారణ పురోగతిలో ఉంది.

బోణీ రూ.200 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియోద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ముఖ్య కార్యదర్శులు రామకృష్ణరావు, అరవిందకుమార్, జిహెచ్‌ఎంసి కమిషనర్ డాక్టర్ బి.జనార్ధన్‌రెడ్డి, మున్సిపల్ శాఖ కార్యదర్శి టి.కె.శ్రీదేవిలతో పాటు కరీంనగర్ మేయర్ రవీందర్‌సింగ్, ఖమ్మం మేయర్ రూపాలాల్, నిజామాబాద్ మేయర్ ఆకుల లలిత, బిఎస్‌ఈ, ఎస్‌బిఐ, జిహెచ్‌ఎంసితో సహా ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు. బాండ్ల సేకరణ చేపట్టిన ఎలక్ట్రానిక్ బిడ్డింగ్‌లో పాల్గొన్న జిహెచ్‌ఎంసికి ఇన్వెస్టర్ల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. హైదరాబాద్‌ను సిగ్నల్ రహిత నగరంగా చేయడానికి చేపట్టిన వ్యూహాత్మక రహదారుల పథకం(ఎస్‌ఆర్‌డిపి) కోసం ఈ నిధులను వెచ్చించనున్నారు. ఆర్థిక క్రమశిక్షణ, ఆధాయ మార్గాల స్థిరత్వం, అంతర్గత వనరుల వృద్ధి, మిగులు నిధులు తదితర అంశాల్లో జిహెచ్‌ఎంసిపై నమ్మకమైన సంస్థగా ఏఏ స్టేబుల్ రేటింగ్ సాధించటంతో బాండ్ల జారీ సులువైంది. దశల వారిగా ఎస్‌ఆర్‌డిపి కోసం రూ.వెయ్యి కోట్లను బల్దియా బాండ్ల రూపంలో సేకరించాలని నిర్ణయించగా, మొదటి దశలో రూ.200 కోట్లను సేకరించింది.

మౌలిక వసతులకు బాండ్ల ద్వారా నిధులు : మేయర్

మౌళిక వసతుల కల్పన కోసం అప్పు తెచ్చుకోవటం తప్పు కాదని, అప్పు కట్టే సామర్థ్యం, ఆర్థిక క్రమశిక్షణ ఉంది కనుకే అభివృద్ధి కోసం నిధులు సేకరిస్తున్నామని మేయర్ బొంతు రామ్మోహన్ అన్నారు. అధికారికంగా ముంబాయి స్టాక్ ఎక్చేంజ్‌లో జిహెచ్‌ఎంసి లిస్టింగ్‌ను ఉన్నతాధికారులతో కలిసి బొంతు రామ్మోహన్ ప్రారంభించారు. దేశంలో నాలుగువేల మున్సిపాలిటీలు ఉంటే, కేవలం జిహెచ్‌ఎంసి మాత్రమే ఆర్థిక స్థిరత్వంలో డబుల్ ఏఏ స్టేబుల్ సాధించిందన్నారు. సేకరించిన నిధులతో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం వేగంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఎస్‌ఆర్‌డిపి పనులు ఇక నుంచి మరింత వేగం పుంజుకోన్నాయని మేయర్ అన్నారు. దేశంలోనే పూణే నగరం తర్వాత ముంబాయి స్టాక్ ఎక్చేంజ్ ద్వారా ఎలక్ట్రానిక్ బిడ్డింగ్‌తో జిహెచ్‌ఎంసి బాండ్ల ద్వారా నిధులు సమీకరించుకుంటోందని అన్నారు.

బాండ్ల ద్వారా నిధుల సేకరణతో దేశంలోనే జిహెచ్‌ఎంసి సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిందని, స్థానిక సంస్థలు ప్రభుత్వాలపై ఆధారపడకుండా సొంతగా నిధులు సమకుర్చుకోవటం మిగితా మున్సిపాలిటీలు, స్థానిక సంస్థలకు ఆదర్శమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి ప్రశంసించారు. ప్రస్తుతం రేటింగ్ సంస్థల అంచనా ప్రకారం డబుల్ ఏ స్టేబుల్ స్థాయిని సాధించిన జిహెచ్‌ఎంసికి భవిష్యత్‌లో త్రిబుల్ ఏ పాజిటివ్ సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. బాండ్ల సేకరణ ద్వారా జిహెచ్‌ఎంసి ముంబాయి స్టాక్ ఎక్చేంజ్ లిస్టింగ్‌లో నమోదు కావడం చారిత్రాత్మక ఘట్టమని అభినందించారు.



పాల్కిచెర్వును నింపాలన్న కల నెరవేరింది : మంత్రి జూపల్లి కృష్ణారావు

మన తెలంగాణ/పాన్‌గల్ : కెఎల్ఐ పథకం సాగునీరు ద్వారా పాన్‌గల్ పాల్కిచెర్వును నింపుతామని ఇచ్చిన హామీని నెరవేర్చుకున్నానని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండల పరిధిలోని కిష్టాపూర్, గోప్లాపూర్, పాన్‌గల్ గ్రామాలకు సాగునీరిచ్చే డి 8 కెనాల్ నుండి మంత్రి జూపల్లి కృష్ణారావు సాగునీరు విడుదల చేశారు. రైతులనుద్దేశించి మంత్రి మాట్లాడారు. ఈ ఏడాదే పాన్‌గల్ పాల్కిచెర్వుకు కెఎల్ఐ నీటిని నింపాలని యుద్ధప్రాతిపదికన కాల్వ పనులను వేగవంతం చేశామని తెలిపారు. మండలంలోని సాగునీరు అందని గ్రామాలు దావాజిపల్లి, గోప్లాపూర్,పాన్‌గల్, మాధవరావుపల్లి గ్రామాల రైతులు అధైర్యపడవద్దని వచ్చే పంటలకు అసంపూర్తి పనులను పూర్తి చేసి తప్పని సరిగా సాగునీరు అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. నియోజక వర్గంలోని ప్రతి గుంటకు సాగునీరందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. గ్రామాల్లో పచ్చని పంటపొలాలను చూస్తుంటే ఆనందం పులకరిస్తుందన్నారు. మూడున్నర సంవత్సర కాలంలోనే ప్రజా సంక్షేమం దిశలో ముందుకు వెళ్తుందని బంగారు తెలంగాణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కేతేపల్లి రవి, ఎంపిపి వెంకటేష్‌నాయుడు, టిఆర్ఎస్ అధ్యక్షులు గోవర్ధన్ సాగర్,తిరుపతయ్యసాగర్, కేతేపల్లి విష్ణు, విండో వైస్ చైర్మన్ భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

మైనర్ బాలికపై అత్యాచారం

మన తెలంగాణ/పరిగి : మైనర్ బాలికపై అత్యాచారం జరిగిన ఘటన పరిగి మండల పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. బాధిత బాలిక తెలిపిన వివరాల ప్రకారం.. పరిగి మండలం ఇబ్రహీంపూర్ తండాకు చెందిన ఓ మైనర్ బాలికను మంగళవారం తమ వ్యవసాయం పొలంలో బారు బావి వద్ద బట్టలు ఉతుకుతూ ఉంది. అదే గ్రామానికి చెందిన నేనావత్ శ్రీనివాస్, సునీల్ అనే యువకులు చుట్టు పక్కల ఎవరూ లేరని తెలుసుకుకొని బాలికను బలవంతంగా లాక్కొని పొలం పక్కనే ఉన్న వాగులోకి తీసుకువెళ్లాడు. బాలిక అరుస్తుండగా ఆమె నోట్లో బట్టలకు కుక్కి బాలికపై అత్యాచారానికి ఒడిగట్టారు. అనంతరం సునీల్ కూడా బాలికపై అత్యాచారం చేశారు. ఈ విషయమై ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాలిక ఈ విషయమై తల్లిదండ్రులకు చెప్పింది. ఈ అత్యాచారం విషయమై గ్రామంతో పంచాయతీ ఏర్పాటు చేశారు. తండాలో పెట్టిన పంచాయతీలో తమకు న్యాయం జరగదంటూ బాధిత బాలిక తల్లి ధరణి బాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలికను ఆరోగ్య పరీక్షల నిమిత్తం తాండూర్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, అత్యాచారానికి పాల్పడిన నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో జవాన్ మృతి



మన తెలంగాణ / భీమదేవరపల్లి (మల్లారం): అనారోగ్యంతో జవాన్ మృతిచెందిన సంఘటన వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని మల్లారం గ్రామంలో చోటు చేసుకుంది మల్లారంకు చెందిన నాగిళ్ళ సురేష్(29) సిఐఎస్ఎఫ్ జవాన్‌గా అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో విధులు నిర్వహిస్తున్నాడు. కొంత కాలంగా లీవర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న సురేష్ సెలవుల్లో ఇంటికి చేరుకున్నాడు. ప్రైవేట్ హాస్పత్రుల్లో చికిత్స చేసుకున్నప్పటికి వ్యాధి నయం కాకపోవడంతో ఇటీవలనే హైదరాబాద్‌లోని నిమ్స్‌లో మెరుగైన వైద్యం కోసం చేరడం జరిగింది. కాగా చికిత్సపొందుతూ జవాన్ సురేష్ బుధవారం రాత్రి కన్నుమూసాడు. మృతుడు తల్లిదండ్రులకు ఒక్కగానొక కుమారుడు కాగా కూలీ పనులు చేసుకుని జవాన్‌ను చేస్తే వ్యాధితో అకాల మరణం కుటుంబ సభ్యులను ఎంతగానో కలచివేసింది. సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య, ఉండగా ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కత్తితో గొంతు కోసి హత్యాయత్నం

మన తెలంగాణ/మంగపేట : పాత కక్షలతో బావపై బామ్మర్ది దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. కమలాపురం గ్రామానికి చెందిన బాలిశెట్టి గోపయ్య (35) గురువారం పిల్లలను భోజనానికి తీసుకు వచ్చేందుకు థాపర్ విద్యా విహార్‌కు వెళ్ళాడు ఇదే అదనుగా చూసుకున్న బాలిశెట్టి గోపయ్య బావ మరిది నాగిశెట్టి దాసు కొడవలి, కత్తితో దాడి చేసి గొంతు కోసి కడుపులో సుమారు 10 కతిపోట్లు పొడిచాడు. దీంతో అప్రమత్తమైన గోపయ్య వెంటను దాసును నెట్టి వేసి గొంతుకు జేబురుమాలాను కట్టుకుని తన ద్విచక్ర వాహనంపై మంగపేట పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. గమనించిన పోలీసులు 108కు సమాచారం ఇవ్వడంతో ఏటూరునాగారానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించినట్టు సమాచారం. ఈ విషయంపై పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్టు సమాచారం.

టిఆర్ఎస్ నుంచి సురేష్‌రెడ్డి సస్పెన్షన్



మన తెలంగాణ / హైదరాబాద్/ షాపూర్‌నగర్; బాచుపల్లి, సూరారం ప్రాంతాల్లో భూ కుంభకోణం కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న సుభాష్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డిని టిఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్ పత్రాన్ని డివిజన్ అధ్యక్షుడు దేవగారి రాజేందర్ రెడ్డి గురువారం మీడియా ముందు విడుదల చేశారు. కుత్బుల్లాపూర్ సూరారంలోని టిఆర్ఎస్ సుభాష్‌నగర్ డివిజన్ అధ్యక్షులు దేవగారి రాజేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు, వారాల వినోద్, మన్నెరాజులతో కలిసి విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు ,మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి కార్పొరేటర్ ఎన్నికల్లో ఓడిపోయిన తరువాత 2016 లో టిఆర్ఎస్‌లో చేరాడు. ఆయన కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో చేసిన తప్పులను, భూకబ్జాలను కప్పిపుచ్చుకోవటానికే టిఆర్ఎస్‌లో చేరిన సురేష్‌రెడ్డి భూకబ్జాలకు పాల్పడినట్లు తెలిపారు.ఈ విషయం బయటకు రావడంతో వివిధ పోలిసు స్టేషన్ల పరిధిలో తనిపై కేసులు నమోదయ్యాయన్నారు. వారాల వినోద్, మన్నెరాజు, శ్రాదర్‌రెడ్డి, జగతయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో రూ. 4కోట్లు దండుకున్నారు

- మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న శాఖలోనే అవినీతి
- ఎంఎల్ఎ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మన తెలంగాణ/నల్లగొండ ప్రతినిధి: మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విద్యుత్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.4కోట్లు వసూలు చేశారని నల్లగొండ ఎమ్మెల్యే, సిఎల్‌పి ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. గురువారం నల్లగొండలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ శాఖలో ఆపరేటర్ పోస్టులు ఇప్పిస్తామని ఒక్కొక్కరి వద్ద నుండి 5 లలకు పైగా వసూలు చేశారని అన్నారు. మూడున్నరేళ్లుగా అటు ఉద్యోగాలు రాక, ఇటు అప్పులకు వడ్డీలు కట్టలేక నిరుద్యోగులు కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. ఒక్క నల్లగొండ నియోజకవర్గంలో 60 మంది వద్ద డబ్బులు తీసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, 350 మందికి పైగా డబ్బులు చెల్లించినట్లు తెలుస్తుందని అన్నారు. ఉద్యోగాల పేరుతో రూ.4 కోట్లకు పైగా విద్యుత్ శాఖమంత్రి జగదీశ్వర్‌రెడ్డి వసూలు చేశారా, ఆ పార్టీ ఎమ్మెల్యేలా? పార్టీ నాయకత్వమా తేలాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుమ్మల మోహన్‌రెడ్డి, సంకు ధనలక్ష్మి పాల్గొన్నారు.

హవాలా రాకెట్ గుట్టు రట్టు



- రూ. 27.90 లక్షలు స్వాధీనం
- ముగ్గురు నిందితుల అరెస్టు
- చట్టబద్ధతతోనే బదిలీ చేయండి
- సిపి శ్రీనివాస్‌రావు

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : నగరంలో ఎంతో కాలంగా అక్రమ పద్ధతిలో నగదు బదిలీ ప్రక్రియ (హవాలా వ్యాపారం)ను జరుపుతున్న ముగ్గురు నిందితులను నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుండి రూ. 27.90 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఈ నేరానికి సంబంధించి నగర పోలీసు కమిషనర్ వివి శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగర శివారులోని నిజాంపేట్‌లో ఉంటూ మాదాపూర్ కావూరిహిల్స్‌లోని కెవిఆర్ కన్‌స్ట్రక్షన్స్‌లో మేనేజర్‌గా పని చేస్తున్న డీవి మధుసూదన ప్రసాద్ (65) హవాలా వ్యాపారం చేసేందుకు సిద్ధమయ్యారు. రాజస్థాన్‌కు చెందిన బల్వంత్‌సింగ్, ఢిల్లీ ప్రాంతవాసి కమల్ విక్రమ్, ముంబైకి చెందిన శంకర్‌ల సాంగత్యం నుండి హవాలా వ్యాపారం చేసే పద్ధతులను మధుసూదన ప్రసాద్ నేర్చుకున్నాడు. ప్రస్తుతం వీరు ముగ్గురు పరారీలో ఉన్నారు. కాగా మధుసూదనప్రసాద్ ప్రధానంగా హైదరాబాద్ నుండి ఢిల్లీకి హవాలా రూపంలో నగదు బదిలీ వ్యాపారం చేస్తూ అక్రమ సంపాదనకు శ్రీకారం చుట్టాడు. బల్వంత్ సింగ్‌కు దేశంలోని మెట్రోపాలిటన్ నగరాల్లోని హవాలా వ్యాపారం చేసే వారి వివరాలు ఉన్నాయి. ఢిల్లీలోని విక్రమ్, కిషోర్‌లు బల్వంత్ సింగ్ ద్వారా మధుసూదన్‌కు సంబంధాలు ఏర్పడ్డాయి. కాగా నగరంలో ముఖ్యంగా గౌలిగూడ చమాన్, కోఠి, గుజరాత్‌గల్లీ ప్రాంతాల్లో హవాలా వ్యాపారం జోరుగా సాగుతున్నట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆ ప్రాంతాల్లోని సిసి కెమెరాలను పరిశీలించిన పోలీసులు గుజరాతీ గల్లీలోని కృష్ణమొబైల్ దుకాణంపై దాడులు నిర్వహించారు. అక్కడ మధుసూదన్, షోహన్‌లాల్, కిషోర్‌కుమార్‌లతో పాటు వారి వద్ద లభించిన బ్యాగ్‌లో రూ. 27.90 లక్షలు లభించాయి. వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తే స్థానికంగా హవాలా నిర్వహిస్తున్న కమల్ విక్రమ్, శంకర్‌లతో పాటు రాజస్థాన్‌కు చెందిన బల్వంత్‌సింగ్, కమల్, విక్రమ్, శంకర్‌లు పరారీలో ఉన్నారు.

చట్టబద్ధంగా బదిలీ చేయండి : సిపి శ్రీనివాస్‌రావు

ఏదేని నగదు బదిలీలను చట్ట పరిధిలోనే చేయాలని, తద్వారా మోసాలకు, ఆర్థిక నేరాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని నగర పోలీసు కమిషనర్ శ్రీనివాస్‌రావు ప్రజలకు సూచించారు. చట్టబద్ధతలో చేయడం ద్వారా భద్రత ఉంటుందని, భరోసా లభిస్తుందనేది ప్రజలు మరవరాదని చెప్పారు. అక్రమ బదిలీల ద్వారా పెద్దమొత్తంలో చేతులు మారుతున్నప్పుడు ఆర్థికపరమైన మోసాలు చేసేందుకు ఆస్కారాన్ని మీరే కల్పించినవారవుతారని కమిషనర్ పేర్కొన్నారు.

నియంతృత్వాన్ని ఎదురిద్దాం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం




- ప్రగతిభవన్ నీ జాగీరు కాదు ప్రజల సొమ్ము
- ప్రజా సమస్యలపై సిపిఐ సమరం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి

మన తెలంగాణ/కోహెడ : దేశంలో బిజెపి, రాష్ట్రంలో టిఆర్ఎస్ సర్కారు నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో గత రెండు రోజులుగా జరుగుతున్న సిపిఐ జిల్లా రెండవ మహాసభలు గురువారం సాయంత్రంతో ముగిసాయి. ముందుగా మహాసభల ప్రాంగణంలో సిపిఐ జెండాను పార్టీ కంట్రోల్ సభ్యులు ఎడ్ల వెంకట్రాంరెడ్డి పతాక అవిష్కరించారు. అమర వీరుల స్థూపం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి నివాళ్లు అర్పించారు. అనంతరం జరిగిన ప్రతినిధుల మహాసభలో చాడ మాట్లడుతూ దేశంలో పేదరికం పోవాలంటే కాంగ్రెస్‌ను ఓడించాలన్న మోడీ అధికారంలోకి వచ్చాక పేదలకు చేసింది ఏమిటని ప్రశ్నించారు. కేంద్రంలో బిజెపి ఆధికారంలోకి వచ్చాక పెట్టుబడిదారి, కార్పొరేట్ వ్యవస్థ పెరిగిపోయిందన్నారు. లౌకికతత్వాన్ని కాపాడుకునేందుకు లౌకిక శక్తులన్నీ ఏకాం కావాలని కోరారు. దేశవ్యాప్తంగా బిజెపి లాంటి మతోన్మాద శక్తులను అడ్డుకునేందుకు లౌకిక, ప్రజాతంత్ర శక్తులతో కూడిన వామపక్ష ప్రత్యమ్నాయమే సరైందిగా సిపిఐ భావిస్తోందని తెలిపారు. ఆ దిశగా వామపక్ష శక్తుల ఏకీకరణకు సిపిఐ కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో సిఎం కెసిఆర్ సర్కార్ పోకడలు మితిమీరుతూ ప్రజాస్వామ్య విలువలను మంటగలుపుతుందని మండిపడ్డారు. కెసిఆర్ 9 ఎకరాల విస్తీర్ణంలో ప్రగతి భవన్ నిర్మించుకున్నారని, ప్రగతి భవన్ నీ జాగీరు కాదు.. అది ప్రజల సొమ్ముతో నిర్మించిందన్నారు. గండిపల్లి చెరువు వద్ద 12 ఎకరాల విస్తీర్ణంలో క్షేత్రం నిర్మిస్తానంటున్న కెసిఆర్ ఎవరి సొమ్ముతో నిర్మిస్తావో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రాబోయే రోజుల్లో టిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా సిపిఐ మిగతా జెఎసిలు, కోదండరాం, వామపక్షాలతో ఉద్యమాలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, దయానందరెడ్డి, జిల్లా కార్యదర్శి మంద పవన్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పల్లె నర్సింహం, జిల్లా నాయకులు పెండాల ఐలయ్య, కొయడ సృజన్‌కుమార్, గడిపే మల్లెశ్, రమ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన తరగతుల అభ్యున్నతే ముఖ్యం

- తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ బిఎస్ రాములు



మన తెలంగాణ/కరీంనగర్ టౌన్ : వెనుకబడిన తరగతుల అభ్యున్నతే ముఖ్యమని తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ బిఎస్ రాములు స్పష్టం చేశారు. గురువారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అత్యంత పేదరికం నుంచి వచ్చిన విద్యార్థుల మెరుగైన విద్య కొరకు ప్రభుత్వం 660 రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసిందని అన్నారు. ఈ స్కూళ్లలో నైపుణ్యం, ఉన్నత ప్రమాణలతో కూడిన విద్య, మంచి భోజన వసతులు కల్పిస్తున్నారని అన్నారు. రేపటి బంగారు తెలంగాణ భవిష్యత్తు కొరకు రెసిడెన్షియల్ స్కూళ్లలో 5వ తరగతిలో చేరుటకు మార్చి 16వ చివరి తేది అని ఆయన తెలిపారు. ఈ స్కూళ్లలో అనేక నైపుణ్యాలతో కూడిన శిక్షణ ఇవ్వటం జరుగుతుందని జర్నలిస్టులుగా, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ఐఎఎస్‌లుగా ఎదగాటానికి ఉపయోగపడతాయని అన్నారు. ఎక్కువగా ప్రైవేట్ స్కూళ్లలో చదివే విద్యార్థులే ఎంపిక అవటం జరుగుతుందని వాళ్లతో పాటు సంచార కులాల వారు ఎంపిక కావటం కోసం ప్రభుత్వ పాఠశాలల టీచర్లు కృషి చేయాలని సూచించారు. వివిధ శాఖలలో పనిచేస్తున్న వెనుకబడిన తరగతుల ఉద్యోగుల వివరాలను సేకరిస్తున్నామని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బిసి సంక్షేమాధికారి సరోజ తదితరులు పాల్గొన్నారు.

'గాయత్రి' వసతి గృహంలో గంజాయి కలకలం







- హాస్టల్ వార్డెన్ పాత్రధారి
- పరారీలో అనుమానితులు
- క్వింటాల్ గంజాయి పట్టివేత

మన తెలంగాణ/సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌కు కూత వేటు దూరంలో ఉన్న శ్రీ గాయత్రి జూనియర్ కళాశాల వసతి గృహం బుధవారం అర్ధరాత్రి గంజాయి కలకలం రేపింది. ఈ వసతిగృహంలో అక్రమంగా నిల్వ ఉంచిన క్వింటాల్ గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. మధ్యాహ్నం భోజనానికి వచ్చి వెళ్లిన విద్యార్థుల పడక మంచాల కింద గంజాయి ప్రత్యక్షమైంది. ఇదేమిటని వార్డెన్ లింగానాయక్‌ను విద్యార్థులు ప్రశ్నించారు. అందుకు వార్డెన్ లింగానాయక్ విద్యార్థులతో ఆ బండిల్స్‌ను ఎవరు ముట్టుకోవద్దని, అవి ప్రశ్న పత్రాలని చెప్పాడు. దీంతో తెలుసుకోవాలని ఆరాటపడిన విద్యార్థులు స్టడీ అవర్ అయిపోగానే బండిల్స్‌ను సీలు తీశారు. దీనితో వాసన గుప్పుమంది. వెంటనే విద్యార్థి సంఘాలకు, పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు కళాశాల చుట్టుముట్టి గంజాయి సరఫరా చేసిన వాహనం, గంజాయి కాటన్‌లను స్వాధీన పర్చుకున్నారు. కాగా, ఆటోలో గంజాయి సరఫరా చేసిన వ్యక్తులతో పాటు వార్డెన్ లింగానాయక్ పరారీలో ఉన్నట్లు పట్టణ సిఐ శివ శంకర్ తెలిపారు. సమగ్ర విచారణ కోసం పోలీసులు రెండు గ్రూపులుగా ఏర్పడి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కాగా, విద్యార్థులను అక్రమ వ్యాపార రంగంవైపు పరోక్షంగా నిర్వాహకులు మరల్చుతున్నారని పలు విద్యార్థి సంఘం నాయకులు గురువారం కళాశాల ముందు ధర్నాకు దిగారు. కొన్ని సంఘాల నాయకులు మరో అడుగు ముందుకు వేసి కళాశాల ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. కళాశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎప్పటి మాదిరిగానే సంఘటన జరిగాకే విచారణ కోసం వచ్చిన ఇంటర్మీడియట్ విద్యాధికారి రుద్రంగి రవిని విద్యార్థి సంఘ నాయకులు ఘొరావ్ చేశారు. నాయకులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక దాటవేశారు. దీనితో కొద్దిసేపు పోలీసులకు, విద్యార్థి సంఘ నాయకులకు వాగ్వాదం జరిగింది.

పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టకపోతే ముట్టడిస్తాం

- బిసి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



మన తెలంగాణ/హైదరాబాద్/ సోమాజిగూడ : బిసి బిల్లు పార్లమెంట్ లో అమలైతే రాజ్యాంగ బద్ధమైన హక్కులు కలుగుతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఒబిసి కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో 'జాతీయ బిసి కమిషన్‌కు రాజ్యాంగబద్ధ హక్కుల కల్పన మహిళా సాధికారిత' అనే అంశంపై బిసి సంఘాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. కమిటీ అధ్యక్షురాలు ఎ. భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ బీసీ కమిషన్ సభ్యులు డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఓబీసీ కేంద్ర కమిటీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దానకర్ణాచారి, కమిటీ నాయకురాళ్లు దశరథ లక్ష్మి, ఆసోజు పుష్పలత, ఎం. రాధ, డాక్టర్ మంజులత, ప్రమీల, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు యాది లాల్, ఒబిసి నాయకులు చెన్నయ్య తదితరులు పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి సంవత్సరాలుగా గడుస్తున్నా బిసిలకు రాజ్యాధికారం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ బిసి కమిషన్‌కు రాజ్యాంగబద్ధతకు కేంద్రం ముందుకు వస్తే పలు రాజకీయ పార్టీలు గత పార్లమెంట్ సమావేశాల్లో సరైన రీతిలో ఆమోదించబడకుండా రాజ్యసభలో అడ్డుకోవడం అప్రజాస్వామికమని కృష్ణ మోహన్ రావు పేర్కొన్నారు. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ దేశంలోనే 60శాతం ఉన్న బిసిలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉభయ సభల్లో బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

మంత్రులు ఆత్మహత్య చేసుకుంటే 60లక్షలిస్తా

జస్టిస్ చంద్రకుమార్



మన తెలంగాణ/హైదరాబాద్ / సోమాజిగూడ : తెలంగాణలో ఎంతో మంది రైతులు గిట్టుబాటు ధర లభించక ఆర్థికపరమైన ఇబ్బందులతో ఆత్మహత్యలకు పాల్పడుతుంటే రాష్ట్ర హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి డబ్బుల కోసం ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అనడం సిగ్గుచేటని తెలంగాణ రైతు సంక్షేమ సమితి కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు రైతులకు అండగా నిలువాల్సి పోయి వారి ఆత్మహత్యలకు పాల్పడుతుంటే అవమానకరంగా మాట్లాడటం బాధాకరమన్నారు. మంత్రులు ఆత్మహత్యలకు పాల్పడితే తన సొంత ఆస్తులు అమ్మేసి రూ.60లక్షలు చెల్లిస్తామని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగాన్ని నిట్టు నిలువునా ముంచుతుందని, ప్రతి సంవత్సరం రూ.25.619 కోట్ల విలువైన 58.98లక్షల టన్నుల పప్పుధాన్యాలు, ఒక లక్ష 15 టన్నుల నూనె దినుసులు, 40లక్షల టన్నుల పంచదార దిగుమతి చేసుకుంటున్నారని, దేశంలోని రైతుల వద్ద వాటిని కొనుగోలు చేస్తే వారికి లాభం చేకూరుతుందన్న ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి రాకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ ఏడాది పత్తి వేసుకోవద్దని సూచించటంతో అధిక సంఖ్యలో కందుల పంట వేశారని, కాని గిట్టుబాటు ధర మాత్రం రూ.5వేలు ఇస్తున్నారని, రూ.7,500 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే రైతాంగ సమస్యలపై నిరాహారదీక్షలు, పాదయాత్ర, ర్యాలీలు, ఆందోళన కార్యక్రమాలకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సామాజిక న్యాయ ఐక్య కార్యాచరణ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ టివి రామనర్సయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ సాంబ శివగౌడ్, చెన్నోజు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎంవిఐ కార్యాలయంలో ఎసిబి దాడులు

రూ.5 వేల లంచం తీసుకుంటుండగా పట్టుబడిన డ్రైవర్




మన తెలంగాణ / షాద్‌నగర్ : మోటారు వెహికల్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ చక్రవర్తి, డ్రైవర్ బాలయ్య ఆలియాస్ రాజు, ఎజెంట్ విజేందర్‌రెడ్డి ఓ పని నిమిత్తం ఎంవిఐ కార్యాలయానికి వేళ్తే రూ. 5 వేల ఇస్తేనే పని చేసి పెడతామని చెప్పడంతో ఆయన ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. దీంతో గురువారం డబ్బులు తీసుకోని కార్యాలయానికి వెళ్లిన సమయంలో ఎంవిఐ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి తన డ్రైవర్‌కు నగదు ఇవ్వమని చెప్పడంతో డ్రైవర్‌కు ఇస్తుండగా ఎసిబి అధికారులు, డిఎస్‌పి సూర్యనారా యణ, శ్రీకృష్ణగౌడ్, సిఐ లక్ష్మి ఆధ్వర్యంలో ఎంవిఐ కార్యాలయంపై ఎకతాటిగా దాడులు నిర్వహించి తక్షణమే బాలయ్యను అదుపులోకి తీసుకున్నారు. దాడుల్లో సిఐలు లింగ స్వామి, కమల్ కుమార్, రఘు నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలానా రాసారని ఠాణా ముందు విషం తాగిన వాహనదారుడు

మన తెలంగాణ/హైదరాబాద్: చలానా రాసినందుకు నిరసనగా ఓ వాహనదారుడు సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ముందు విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అయితే పోలీసులు సకాలంలో 108లో గాంధీ ఆసుపత్రికి తరలించడంతో అతనికి ప్రాణాపాయం తప్పింది. యాప్రాల్ బాలాజీనగర్‌కు చెందిన శ్రీకాంత్ (22) గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఐమాక్స్ థియేటర్ నుంచి యమహా బైక్‌పై వెళ్తుండగా..ట్రాఫిక్ ఎస్ఐ అతన్ని ఆపాడు. లైసెన్స్, హెల్మెట్ లేనందుకు అతని బైక్‌ను సీజ్ చేశారు. చలానా కడుతాను బైక్ ఇవ్వమని శ్రీకాంత్ వేడుకున్నాడు. అయితే లైసెన్స్ లేనందున బైక్ ఇవ్వడం జరగదని కౌన్సెలింగ్‌కు హాజరైన తరువాత కోర్టుకు వెళ్లాల్సి వస్తుందని అక్కడి సిబ్బంది చెప్పారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన శ్రీకాంత్ గుర్తు తెలియని విషం సేవించి ఠాణా ముందే పడిపోయాడు. అప్రమత్తమైన పోలీసులు 108 వాహనాన్ని రప్పించి గాంధీ ఆసుపత్రికి తరలించారు. అతనికి ప్రాణాపాయం ఏమి లేదని వైద్యులు చెప్పారు.

అధికార పార్టీ వాళ్లు కబ్జా చేసింన్రు

న్యాయం చేయండి : ఓ కుటుంబం ఆవేదన



మన తెలంగాణ/ హైదరాబాద్/ సోమాజిగూడ : మా తాత ముత్తాతల నుంచి వచ్చిన ఆస్తిని కొంత మంది అధికార పార్టీకి చెందిన నాయకులు కబ్జాచేసేందుకు చూస్తున్నారని ఓ కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. తమ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి, 50 ఏళ్ళుగా ఇంటి ఆరాధ్యదైవమైన మైసమ్మ దేవాలయాన్ని పూర్తిగా ధ్వంసం చేశారని వాపోయారు. విలేకరుల సమావేశంలో బాధితుడు ఎం.శ్రావణ్ కుమార్ వారి కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడుతూ, షేక్‌పేటలోని సెవెన్ టూంబ్స్ సమీపంలో, సమతా కాలనీ సర్వే నెం. 221, 222, 234లో 1.2 ఎకరాల స్థలం ఉందని తెలిపారు. ఈ స్థలంలో ఆలయంతో పాటు, వాటర్ ఫ్యాక్టరీ, 17 లేబర్ రూములున్నాయన్నారు. 2017లో 50 మంది రౌడీలు ఆలయంలోని విగ్రహాన్ని, చిత్రపటాలను ధ్వంసం చేసి, కార్మికులను కిడ్నాప్ చేశారని తెలిపారు. తాము పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిజామాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధి సోదరులు ఇమ్రాన్, సయ్యద్ ముస్తాఫా, ఖదీర్, అహ్మద్‌లపై కేసు నమోదు చేశారని తెలిపారు.తరువాత వారి వేధింపులు విపరీతమయ్యాయని, చనిపోయిన తన తండ్రి సంతకం ఫోర్జరీ చేసి నకిలీ డాక్యుమెంట్లు తయారు చేశారని తెలిపారు. సెటిల్‌మెంట్‌కు రావాలని లేకపోతే చంపుతామని బెదిరిస్తున్నారని అన్నారు.

పాటలే ఉండవట!



ఇటీవల 'తొలిప్రేమ' చిత్రంతో మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకొని ఎంతో సంతోషంగా ఉన్నాడు యంగ్ హీరో వరుణ్‌తేజ్. ఇప్పుడు అతను తన తదుపరి చిత్రం కోసం సిద్ధమవుతున్నాడు. 'ఘాజీ' ఫేమ్ సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కనుంది. అంతరిక్షం నేపథ్యంలో ఈ చిత్రం రూపుదిద్దుకోనుంది. ఏప్రిల్ నుండి జార్జియాలో షూటింగ్ జరుపుకోనున్న ఈ సినిమా కోసం వరుణ్‌తేజ్ జీరో గ్రావిటీ పరిస్థితుల్లో ప్రత్యేకంగా శిక్షణ తీసుకోనున్నాడు. ఇకపోతే తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో ప్రత్యేకంగా పాటలేమీ ఉండవట. కేవలం కథను వివరిస్తూ బ్యాక్‌గ్రౌండ్‌లో నడిచే పాటలు మాత్రమే ఉంటాయట. జ్ఞానశేఖర్ సినిమాటోగ్రఫీ అందించనున్న ఈ చిత్రాన్ని రాజీవ్ రెడ్డి నిర్మిస్తున్నాడు. వరుణ్‌తేజ్ అంతరిక్ష వ్యోమగామిగా కనిపించనున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది చివరలో విడుదల చేయాలని ప్లాన్ చేశారు దర్శకనిర్మాతలు. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కే ఈ చిత్రం ప్రేక్షకులకు మరచిపోలేని అనుభూతులను అందిస్తుందని వారు తెలిపారు. వరుణ్ కెరీర్‌లోనే ఈ చిత్రం ఓ మైలురాయిగా ఉంటుందని చెప్పారు.

రెండు వారాల గ్యాప్‌తో వస్తున్నారు





ఏప్రిల్ 26నే మహేష్ 'భరత్ అనే నేను', అల్లుఅర్జున్ 'నా పేరు సూర్యనా ఇల్లు ఇండియా' చిత్రాలు విడుదల అని ఇటీవల ఈ సినిమాల నిర్మాతలు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఈ స్టార్ హీరోల అభిమానులు సందిగ్ధంలో పడిపోయారు. ఈ నేపథ్యంలో తెలుగు సినీ ప్రముఖులు దిల్‌రాజు, కె.ఎల్. నారాయణ, నాగబాబు సమక్షంలో ఈ రెండు చిత్రాల నిర్మాతలు డి.వి.వి.దానయ్య, లగడపాటి శ్రీధర్, బన్నీవాసు సమావేశమయ్యారు. రెండు భారీ చిత్రాలు ఒకే రోజు విడుదలవడం చిత్ర పరిశ్రమకు శ్రేయస్కరం కాదని భావించిన వీరు ఒక నిర్ణయానికి వచ్చారు. చివరికి ఏప్రిల్ 20న 'భరత్ అనే నేను', మే 4న 'నా పేరు సూర్యనా ఇల్లు ఇండియా' చిత్రాలు విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా నిర్మాతలు డి.వి.వి.దానయ్య, లగడపాటి శ్రీధర్, బన్నీ వాసు మాట్లాడుతూ ''ఈ రెండు భారీ చిత్రాల మధ్య కనీసం రెండు వారాల గ్యాప్ ఉండాలన్న ఉద్దేశంతో ఏప్రిల్ 20న 'భరత్ అనే నేను', మే 4న 'నా పేరు సూర్య... నా ఇల్లు ఇండియా' చిత్రాలను విడుదల చేయాలని నిర్ణయించాం. చిత్ర పరిశ్రమలో ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలన్న అభిప్రాయంతో తీసుకున్న ఈ నిర్ణయాన్ని సపోర్ట్ చేసిన మా హీరోలు, దర్శకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం''అని అన్నారు. దిల్‌రాజు, డా.కె.ఎల్.నారాయణ, నాగబాబు మాట్లాడుతూ ''సంక్రాంతి సీజన్‌ను మినహాయిస్తే మిగిలిన సందర్భాల్లో రెండు భారీ చిత్రాల మధ్య ఇలా రెండు వారాల గ్యాప్ ఇచ్చి రిలీజ్ డేట్స్ ప్లాన్ చేయడం వల్ల చిత్ర పరిశ్రమకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ రెండు సినిమాల నిర్మాతల మధ్య మంచి అవగాహన కుదరడం ఓ శుభ పరిణామంగా భావిస్తున్నాం''అని తెలిపారు.

బెల్లంకొండ శ్రీనివాస్ సినిమా షురూ



వంశధార క్రియేషన్స్ చిత్రం ప్రారంభోత్సవంలో వి.వి.వినాయక్, బెల్లంకొండ శ్రీనివాస్, శ్రీనివాస్, నవీన్ శొంటినేని తదితరులు

బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడిగా శ్రీనివాస్ దర్శకత్వంలో రొమాంటిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న చిత్రం ప్రారంభోత్సవ వేడుక హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో జరిగింది. వంశధార క్రియేషన్స్ పతాకంపై రూపొందుతున్న ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నవీన్ శొంటినేని (నాని) నిర్మిస్తున్నారు. చిత్ర కథానాయకుడు బెల్లంకొండ శ్రీనివాస్‌పై తెరకెక్కించిన ముహూర్తపు సన్నివేశానికి వి.వి.వినాయక్ క్లాప్ కొట్టగా ... తెలంగాణ ఎఫ్‌డిసి ఛైర్మన్ రామ్మోహన్‌రావు గౌరవ దర్శకత్వం వహించారు. ఎమ్మెల్యే యరపతనేని శ్రీనివాసరావు, శ్రీవాస్ కలిసి కెమెరా స్విచ్చాన్ చేశారు. తెలంగాణ మంత్రి మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, కలిసి స్క్రిప్ట్‌ను చిత్ర బృందానికి అందజేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సి.కళ్యాణ్, కె.ఎస్.రామారావు, ఎం.ఎస్.రాజు, అభిషేక్, శ్రీవాస్, బి.గోపాల్, ఎస్.గోపాల్ రెడ్డి, జెమిని కిరణ్, బెల్లంకొండ సురేష్, రాజ్ కందుకూరి, మధుర శ్రీధర్, డాలీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత నవీన్ శొంటినేని మాట్లాడుతూ ''మా బ్యానర్‌లో తెరకెక్కుతున్న మొదటి సినిమా ఇది. చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. యంగ్ హీరో బెల్లంకొండ శ్రీనివాస్‌తో ఈ చిత్రం చేయడం ఆనందంగా ఉంది''అని అన్నారు. చిత్ర దర్శకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ''రొమాంటిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మార్చి 2 నుంచి మొదలవుతుంది. ఈ చిత్రంలో బెల్లంకొండ శ్రీనివాస్ సరసన ఇద్దరు స్టార్ హీరోయిన్స్ నటించనున్నారు. వాళ్లెవరన్నది త్వరలోనే తెలియజేస్తాం''అని చెప్పారు. కెమెరామెన్ ఛోటా కె.నాయుడు మాట్లాడుతూ ''దర్శకుడు శ్రీనివాస్ నాకు చాలా కాలంగా తెలుసు. మంచి కథ, అద్భుతమైన స్క్రీన్‌ప్లేను వినిపించింది అందరినీ ఆశ్చర్యపరిచాడు. నిర్మాత భారీ బడ్జెట్‌లో సినిమా తీయమని మాకు అనుమతినిచ్చినప్పటికీ... కథకు అవసరమైనంతమేరకు ఖర్చు చేసి ఆయనకు మంచి అవుట్‌పుట్ ఇచ్చేందుకు కష్టపడతాం. నవీన్ భవిష్యత్‌లో మరిన్ని మంచి సినిమాలు తీయాలని ఆశిస్తున్నాను'' అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఎడిటర్: ఛోటా కె.ప్రసాద్, మాటలు: కేశవ్ పప్పల.

మంత్రముగ్ధులను చేసే 'సమ్మోహనం'



సుధీర్‌బాబు, అదితిరావు హైదరీ జంటగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్న చిత్రానికి 'సమ్మోహనం' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ ''సమ్మోహనం అంటే మంత్రముగ్ధులను చేసే ఒక అందమైన ఆకర్షణ. మా చిత్రంలో హీరోహీరోయిన్ల మధ్య సమ్మోహనకరమైన రొమాన్స్ ఉండటంతో పాటు మిగతా పాత్రలకు ఉండే విభిన్నమైన ఆకర్షణలు మెప్పిస్తాయి. ఓ కొత్త పోకడ ఉన్న నవతరం ప్రేమ కథా చిత్రంగా ఉంటూనే ఆద్యంతం హాస్యం, సజీవమైన కుటుంబ బంధాలు, ఉద్వేగభరిత సన్నివేశాల సమాహారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది''అని అన్నారు. చిత్ర నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ''కథకు సరిపోయేవిధంగా 'సమ్మోహనం' టైటిల్‌ను ఖరారు చేశాం. ఇప్పటివరకు మూడు షెడ్యూళ్లు పూర్తయ్యాయి. ఈనెల 22 నుంచి మార్చి 3 వరకు నాలుగో షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతుంది. దాంతో 80 శాతం షూటింగ్ పూర్తవుతుంది. మార్చి మూడవ వారం నుంచి ఏప్రిల్ 3 వరకు హిమాచల్‌ప్రదేశ్, ముంబయ్‌లలో షూటింగ్ చేస్తాం. 'పెళ్లిచూపులు' ఫేమ్ వివేక్ సాగర్ మంచి సంగీతాన్నిచ్చారు. పిజి విందా కెమెరా సినిమాకు హైలైట్ అవుతుంది. ఇది ఫీల్‌గుడ్ ఫిల్మ్. ప్రేమ, వినోదం ప్రత్యేక ఆకర్షణలుగా ఉంటాయి. మే మూడో వారంలో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం''అని అన్నారు. కాదంబరి కిరణ్, హరితేజ, కేదార్ శంకర్, శిశిర్ శర్మ, అభయ్, హర్షిణి ప్రధాన తారాగణంగా నటిస్తున్న ఈ చిత్రానికి ఎడిటర్: మార్తాండ్ కె.వెంకటేష్, ప్రొడక్షన్ డిజైనర్: రవీందర్.

హిట్ కాంబినేషన్‌లో రెండవ చిత్రం



గత ఏడాది వరకు బిజీ షెడ్యూల్‌తో గడిపిన స్టార్ హీరోయిన్ రకుల్‌ప్రీత్ సింగ్‌కు ప్రస్తుతం పెద్దగా ఆఫర్లు రావడం లేదు. స్పైడర్ సినిమా నిరాశపరచడంతో ఈ భామకు అవకాశాలు తగ్గిపోయాయి. అప్పటివరకు ఆమె కోసం ఎదురుచూసిన ఫిల్మ్‌మేకర్స్ ఇతర హీరోయిన్లను తమ సినిమాల్లో తీసేసుకున్నారు. అయితే చాలా కాలం తర్వాత రకుల్‌కు ఒక మంచి ఆఫర్ దక్కింది. గత ఏడాది మొదట్లో 'రారండోయ్ వేడుక చూద్దాం' చిత్రంతో ఈ భామ చివరి హిట్‌ను అందుకుంది. నాగచైతన్యతో అమ్మడి కెమిస్ట్రీ అద్భుతంగా కుదిరి ఈ సినిమా విజయాన్ని సాధించింది. అయితే ఈ సినిమా తర్వాత రకుల్, చైతన్యకు ఒక్క హిట్ దక్కలేదు. దీంతో మళ్లీ ఇద్దరు కలిసి హిట్ కొట్టాలని చూస్తున్నారు. ఇద్దరి కాంబినేషన్‌ను ఒక దర్శకురాలు సెట్ చేయడం విశేషం. కృష్ణవంశీ దగ్గర కొన్ని సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన సౌజన్య వీరిద్దరి కాంబినేషన్‌లో ఓ సినిమాను తెరకెక్కించనుంది. సింపుల్ లవ్‌స్టోరీ లైన్‌తో స్క్రీన్‌ప్లేను ఆధారంగా చేసుకొని తీయబోయే ఈ సినిమా కథ చాలా బావుంటుందట. ఈ సినిమాకు నాగచైతన్య సింగిల్ సిట్టింగ్‌లోనే ఓకే చేయగా... రకుల్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిసింది. ప్రస్తుతం నాగచైతన్య రెండు సినిమాలతో బిజీగా ఉన్నాడు. కొన్ని రోజుల తర్వాత హీరోహీరోయిన్ల డేట్స్ అడ్జస్ట్ చేసి ఈ సినిమాను ప్రారంభిస్తారట. 'శైలాజా రెడ్డి అల్లుడు' చిత్ర నిర్మాత నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మించనున్నాడు.

'వాడేనా' గీతాల ఆవిష్కరణ


నిర్మాణి ఫిలిమ్స్ బ్యానర్‌పై ఓం సాయిరామ్ సమర్పణలో శివ తాండేల్, నేహా దేశ్‌పాండే జంటగా నటిస్తున్న చిత్రం 'వాడేనా'. సాయి సునీల్ నిమ్మల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని మణిలాల్ మచ్చి అండ్ సన్స్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్‌ల్యాబ్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్.శంకర్ బిగ్ సీడీని విడుదల చేయగా... విశిష్ట అతిథిగా హాజరైన రాజ్ కందుకూరి థియేట్రికల్ ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్.శంకర్ మాట్లాడుతూ ''ట్రైలర్, సాంగ్స్, ఆర్.ఆర్. బాగున్నాయి. టైటిల్ ఆసక్తికరంగా ఉంటే సినిమాపై ఉత్సుకత పెరుగుతుంది. క్యాచీగా ఉండే టైటిల్ కాబట్టి తప్పకుండా ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందని భావిస్తున్నాను''అని అన్నారు. నిర్మాతల్లో ఒకరైన ధృవ్ మాట్లాడుతూ ''పాటల విషయంలో చాలా సంతృప్తిగా ఉన్నాను. వంద శాతం క్వాలిటీతో దర్శకుడు సినిమాను తెరకెక్కించాడు. ప్రేక్షకులకు నచ్చే సినిమా ఇదవుతుంది''అని తెలిపారు. దర్శకుడు సాయి సునీల్ మాట్లాడుతూ ''సినిమా సెకండాఫ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ సినిమాకు నేను దర్శకత్వం వహించడంతో పాటు నాలుగు పాటలు రాశాను, కొరియోగ్రఫీ కూడా చేశాను. నేను ఎవరి దగ్గరా పని చేయలేదు. చాలా సినిమాలు చూసి అనుభవాన్ని పొంది ఈ సినిమా చేయడం జరిగింది. 'వీడేనా' చిత్రం మంచి విషయం ఉన్న సినిమాగా నిలిచిపోతుందని నమ్మకంగా చెప్పగలను''అని పేర్కొన్నారు. హీరో శివ తాండల్ మాట్లాడుతూ హీరోగా నాకు మంచి పేరు తెచ్చే చిత్రమిదని చెప్పారు. హీరోయిన్ నేహా దేశ్‌పాండే మాట్లాడుతూ ''ట్రెక్కింగ్‌లాంటి అడ్వెంచర్‌ను ఈ సినిమాలో చేశాము. సినిమా చాలా బాగా వచ్చింది''అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మణిపాల్ మచ్చి, అజయ్ ఘోష్, అపురూప్, కాసర్ల శ్యాం, టిఎన్ఆర్, రాకెట్ రాకేష్, భీమేశ్వరచారి, లోబో, లిప్సిక తదితరులు పాల్గొన్నారు.



'వాడేనా' ఆడియో వేడుకలో ఎన్.శంకర్, రాజ్ కందుకూరి, శివ తాండేల్, నేహా దేశ్‌పాండే, సాయి సునీల్ నిమ్మల, మణిలాల్ మచ్చి

దెయ్యంతో ప్రేమలో పడతాను!

శ్రీకాంత్, నాజియా హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'రా... రా'. శ్రీమిత్ర చౌదరి సమర్పణలో విజి చెర్రీస్ విజన్స్ నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలకానుంది. ఈ సందర్భంగా హీరో శ్రీకాంత్‌తో ఇంటర్వ్యూ విశేషాలు...



- **తొలి హార్రర్ మూవీ...**

నేను నటించిన 125వ సినిమా 'రా...రా'. నా కెరీర్‌లోనే తొలిసారిగా ఈ హార్రర్ మూవీ చేశాను. సినిమా కూడా బాగా వచ్చింది. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే చిత్రమిది.

- **దెయ్యాలు భయపడతాయి...**

ఇప్పటివరకు వచ్చిన హార్రర్ సినిమాలకంటే కొంచెం డిఫరెంట్‌గా ఈ సినిమా ఉంటుంది. ఇందులో మనుషులకు దెయ్యాలు భయపడతాయి. అలాగే వాటికి, మనుషులకు మధ్యన సెంటిమెంట్ కూడా ఉంటుంది.

- **కొత్త అనుభూతినిచ్చే...**

సినిమాలో నేను మూవీ డైరెక్టర్‌గా నటించాను. మంచి హిట్ కోసం హార్రర్ సినిమా చేయాలనుకొని చివరికి దెయ్యాలతోనే సినిమా చేస్తాను. దెయ్యంతో ప్రేమలో కూడా పడతాను. ప్రేక్షకులకు కొత్త అనుభూతినిచ్చే చిత్రమిది.

- **తన పేరును బయటపెట్టవద్దన్నాడు...**

మా సినిమాకు దర్శకుడు లేడు. సినిమా మధ్యలో నిర్మాతకు, దర్శకుడికి పడలేదు. చిన్న చిన్న గొడవలు మొదలయ్యాయి. ఇద్దరి మధ్య రాజీ కుదర్చడానికి ప్రయత్నించాను కానీ కుదరలేదు. చివరికి దర్శకుడు తప్పుకున్నాడు. కథ అతనిది కాకపోవడంతో ఓ పెద్ద దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. తన పేరును బయటపెట్టవద్దని అతను చెప్పాడు.

- **విలన్‌గా ఆఫర్లు వచ్చాయి...**

'యుద్ధం శరణం' చిత్రంలో విలన్‌గా నటించిన తర్వాత మళ్లీ ప్రతినాయకుడిగా కొన్ని ఆఫర్లు వచ్చాయి. కానీ ఆ సినిమాలు చేయలేదు. ప్రస్తుతం హీరోగా మూడు సినిమాలు చేతిలో ఉన్నాయి. దీంతో విలన్‌గా ఇప్పుడే చేయడం ఎందుకని ఆగాను.

- **నేటి రాజకీయాల మీద...**

ప్రస్తుతం నేను చేస్తున్న 'ఆపరేషన్ 2019' నేటి రాజకీయాల మీద ఉంటుంది. రాజకీయ నాయకులు ప్రజల్ని మోసం చేస్తున్నారా లేకపోతే ప్రజలే నాయకుల్ని మోసగిస్తున్నారా అనేది ఈ చిత్రంలో చూపిస్తాం. ఈ చిత్రం కొత్తగా ఉంటుంది.

- **రోహన్ కూడా హార్రర్ మూవీలో...**

మా చిన్నబ్బాయి రోహన్ ఓ సినిమా చేస్తున్నాడు. ప్రస్తుతం ఆ చిత్రం షూటింగ్‌లోనే ఉన్నాడు. అది కూడా హార్రర్ సినిమానే. ప్రభుదేవాతో కలిసి రోహన్ ఈ సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ భాషల్లో తెరకెక్కుతోంది.

- **మూడేళ్ల తర్వాతే పూర్తిస్థాయి హీరోగా...**

మా పెద్దబ్బాయి రోషన్ ఇంకో మూడేళ్ల తర్వాత పూర్తిస్థాయి హీరోగా వస్తాడు. ఇప్పుడు అతను లాస్‌ఏంజిల్స్‌లో యాక్టింగ్ డిప్లొమా చేస్తున్నాడు. మొదటి సినిమా 'నిర్మల కాన్వెంట్' నటునిగా అతనిలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది.

నూతన గాయనీ గాయకుల కోసం ఆడిషన్



ఆడిషన్‌ను ప్రారంభిస్తున్న సంపత్‌కుమార్ స్వామి, నిర్మల. చిత్రంలో ప్రదీప్ చంద్ర, మనోహర్ చిమ్మని

పిసి క్రియేషన్స్ పతాకంపై మనోహర్ చిమ్మని దర్శకత్వంలో రూపొందుతున్న పక్కా కమర్షియల్ యూత్ ఎంటర్‌టైనర్ 'నమస్తే హైదరాబాద్'. కొత్త నటీనటులను పరిచయం చేస్తున్న ఈ సినిమా ద్వారా కొత్త గాయకులను కూడా పరిచయం చేయాలన్న ఉద్దేశ్యంతో సంగీత దర్శకుడు ప్రదీప్ చంద్ర సారథ్యంలో రెండు రోజుల పాటు జరిగే గాయకుల ఆడిషన్ కార్యక్రమాన్ని గురువారం హైదరాబాద్ ఫిలింనగర్‌లోని ఓ స్టూడియోలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార స్వామి చిలగాని, కోశాధికారి నిర్మల కలిసి ఆడిషన్‌ను ప్రారంభించి సినిమా టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ స్వామి మాట్లాడుతూ ''తెలంగాణ దర్శకుడు మనోహర్ చిమ్మని రూపొందిస్తున్న ఈ సినిమా ద్వారా నూతన నటీనటులు, నూతన గాయనీ గాయకులను పరిచయం చేస్తుండటం అభినందనీయం. ఈ చిత్రం అద్భుత విజయం సాధించాలి''అని అన్నారు. దర్శకుడు మనోహర్ చిమ్మని మాట్లాడుతూ ''పూర్తిస్థాయి పక్కా యూత్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. సినిమాలో అంతర్లీనంగా మంచి సందేశం ఉంటుంది. ఎంతో మందిని ఎన్నో విధాలుగా ప్రభావితం చేసిన చరిత్ర ఉన్న హైదరాబాద్ నేపథ్యంగా రూపొందిస్తున్న ఈ సినిమా కోసం తెలంగాణ నుంచి కొత్త గాయనీగాయకులను పరిచయం చేయాలని ఈ ఆడిషన్‌ను నిర్వహిస్తున్నాము''అని తెలిపారు. సంగీత దర్శకుడు ప్రదీప్‌చంద్ర మాట్లాడుతూ ''తెలంగాణ యువతలో మంచి సంగీత పరిజ్ఞానం ఉన్నవాళ్లు ఎందరో ఉన్నారు. ఈ ఆడిషన్ ద్వారా మంచి టాలెంట్ ఉన్న గాయనీగాయకులను వెండి తెరకు పరిచయం చేస్తాము''అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: వీరేంద్రలలిత్, నిర్మాణం: ప్రదీప్ చంద్ర, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: మనోహర్ చిమ్మని.



సైబర్‌క్రైమ్‌లతో ఏటా 60,000 కోట్ల డాలర్ల నష్టం

న్యూఢిల్లీ : సైబర్ క్రైమ్‌ల బారిన పడడం వల్ల ఏడాదికి అంతర్జాతీయ జిడిపిలో 1 శాతం మేరకు నష్టపోతున్నట్టు సర్వేలో వెల్లడైంది. అంతేకాదు ఉపాధి సృష్టి, వినూత్న ఆవిష్కరణలు, ఆర్థిక వృద్ధిపై సైబర్ క్రైమ్‌లు ప్రభావం చూపుతున్నాయని నివేదిక తెలిపింది. సిఎస్ఐసి(సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్) సహకారంతో అంతర్జాతీయ సైబర్‌సెక్యూరిటీ సంస్థ మెకాఫీ ఈ సర్వే చేపట్టింది. అంతర్జాతీయ జిడిపి(స్థూల జాతీయ ఉత్పత్తి)లో 0.8 శాతం అంటే 60 వేల కోట్ల డాలర్ల నష్టం.. ఈ సైబర్ క్రైమ్‌ల వల్ల ఏర్పడుతోంది. మూడేళ్ల క్రితం అంతర్జాతీయ జిడిపి 445 బిలియన్ డాలర్లుగా ఉంది. దీని ప్రకారం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒక శాతం నష్టం ఈ సైబర్ నేరాల కారణంగా ఏర్పడుతోంది. గత మూడేళ్లలో సైబర్ నేరాలు వేగంగా పెరిగాయి. కొత్త టెక్నాలజీని సైబర్ నేరగాళ్లు తొందరగా పొందుతున్నారని, దీని వల్ల వీరు ఆర్థిక వ్యవస్థకు భారీగా నష్టాన్ని కల్గిస్తున్నారని సర్వే నివేదిక వెల్లడించింది. రాన్సమ్‌వేర్ ఇటీవల పెద్దమొత్తంలో సిస్టమ్ లపై దాడి చేసిందని, దీనివల్ల పలు దేశాలు నష్టపోయాయని మెకాఫీ చీఫ్ టెక్నాలజీ అధికారి స్టీవ్ గ్రోబ్‌మాన్ తెలిపారు.



మళ్లీ నష్టాల్లో మార్కెట్లు

సెన్సెక్స్ 25, నిఫ్టీ 15 పాయింట్లు పతనం

ముంబై: బుధవారం వరుస నష్టాలకు బ్రేక్ పడిందనే ఆనందం అంతలోనే ఆవిరైంది. గురువారం దేశీయ స్టాక్‌మార్కెట్లు మళ్లీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 25.36 పాయింట్లు నష్టపోయి 33,819.50 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 14.75 పాయింట్లు నష్టపోయి 10, 382.70 వద్ద స్థిరపడింది. ఫిబ్రవరి కాంట్రాక్టుల గడువు గురువారంతో ముగిసింది. దీంతో ఇన్వెస్టర్ల అప్రమత్తంగా ఉండగా.. మరోవైపు అమెరికాలో వడ్డీ రేట్లు పెరగనున్నాయనే అంచనాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. గతరాత్రి అమెరికా మార్కెట్ నష్టాల ముగింపు దేశీయ సూచీలపై ప్రభావం చూపింది. సెన్సెక్స్ ప్రారంభంలో 140 పాయింట్ల నష్టంతో 33817.09 వద్ద ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి కాంట్రాక్టుల ముగింపు నేపథ్యంలో ఇన్వెస్టర్ల అప్రమత్తత కారణంగా సూచీలు రోజు మొత్తం నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. ఆటో, మీడియా, పిఎస్‌యు బ్యాంక్, ఎఫ్ఎంసిజి, మెటల్ రంగాలకు చెందిన షేర్లు నష్టాలతో ముగిశాయి. మరోవైపు రియల్టీ, ప్రైవేట్ బ్యాంకు, ఫార్మా, నిఫ్టీ బ్యాంకు షేర్లు లాభపడ్డాయి. మార్కెట్లు నష్టాల్లో ట్రేడ్ అవుతున్నా ఐటీ షేర్ల ర్యాలీ కొనసాగింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ నష్టాలతో ఐటీ షేర్లకు సానుకూలంగా మారింది. మార్కెట్ ముగి సే సరికి నిఫ్టీ ఐటీ 70.20 పాయింట్లు లాభపడి 12,730.25 ముగిసింది.

పిఎన్‌బి రేటు తగ్గింపు

న్యూఢిల్లీ: మరో రెండు ప్రభుత్వ రంగ బ్యాంకుల రేటింగ్స్‌ను తగ్గించినట్లు గోల్డ్‌న్ సాచ్స్ ప్రకటించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ భారీ కుంభకోణం నేపథ్యంలో ఈ కంపెనీ ఎర్నింగ్స్ లక్ష్యంతో పాటు రెండు బ్యాంకుల రేటింగ్ తగ్గింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడాల షేర్ల సంఖ్య పెరిగిన కారణంగా ఇపిఎస్ అంచనాలను కుదించవలసి వచ్చిందని సంస్థ వెల్లడించింది. ఇదే సమయంలో పిఎన్‌బి స్కామ్‌ఆ సంస్థ ఇపిఎస్‌ను చతికల పడేలా చేసిందని వివరించింది.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	33819.50	25.36	-0.07%
నిఫ్టీ	10382.70	14.75	-0.14%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29090	31112.30	-0.1%
ముంబై	29920	32000.00	-0.6%
ఢిల్లీ	29700	31764.71	-0.5%
కోల్‌కతా	30040	32128.34	-1.02%
కేరళ	28200	30160.43	0%
బెంగళూరు	28850	30855.61	0.52%
హైదరాబాద్	29090	31112.30	-0.07%
గల్ఫ్	1407.18	1505.00	-0.33%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	గురువారం	బుధవారం	మార్పు (%)
చెన్నై	41400.00	41200.00	0.49
ముంబై	41400.00	41200.00	0.49
ఢిల్లీ	41400.00	41200.00	0.49
కోల్‌కతా	41400.00	41200.00	0.49
హైదరాబాద్	41400.00	41200.00	0.49



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	363	విశాఖపట్నం	369
వరంగల్	366	చిత్తూరు	388
విజయవాడ	365	చెన్నై	395
గోదావరి	365	బెంగళూరు	384

ఎక్కడికీ పారిపోవడం లేదు

- సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నాం
- ఫోర్టిస్ ప్రమోటర్లు మల్విందర్ సింగ్, శివిందర్ సింగ్


ముంబై : బిలియనీర్ నీరవ్ మోడీ రూ.11 వేల కోట్ల కుంభకోణం నేపథ్యంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫోర్టిస్ ప్రమోటర్లు మల్వీందర్ మోహన్ సింగ్, శివిందర్ మోహన్ సింగ్‌లపై ఒత్తిడి పెరిగింది. వీరు కూడా విదేశాలకు పారిపోతారేమోననే సందేహాలు వాటాదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సింగ్ సోదరులు స్పందించారు. తాము ఎక్కడికీ పారిపోవడం లేదని, సమస్యను నిజాయితీగా పరిష్కరిస్తామని ఫోర్టిస్ హెల్త్‌కేర్ ప్రమోటర్లు వాటాదారులకు అభయమిచ్చారు. ఫోర్టిస్‌లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాము ఎక్కడికీ పారిపోవడం లేదని వాటాదారుల అభయమిస్తూ.. ఎలాంటి విచారణ అయినా ఎదుర్కొంటామని, సహకారం అందిస్తామని అన్నారు. 'మా ప్రయత్నానికి వాటాదారులు అండగా ఉండాలని కోరుతున్నాం. మేము అన్నింటికి కట్టుబడి ఉన్నాం' అని సింగ్ సోదరులు అన్నారు. దైచి స్యాంక్యోకు రూ.3500 కోట్ల పరిహారం చెల్లించాలంటూ ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో కంపెనీ బోర్డు నుంచి డైరెక్టర్ల పదవికి వీరిద్దరు రాజీనామా చేశారు. జపాన్‌కు చెందిన ఫార్మా దిగ్గజం దైచి సాంక్యోకు అనుకూలంగా పరిహారం తీర్పును జనవరి 31న ఢిల్లీ హైకోర్టు సమర్థించిన విషయం తెలిసిందే. దైచి స్యాంక్యో పిటిషన్‌పై హైకోర్టు తీర్పు నేపథ్యంలో ర్యాన్‌బ్యాక్సీ మాజీ ప్రమోటర్లు సింగ్ బ్రదర్స్ ఫోర్టిస్ హెల్త్‌కేర్ బోర్డ్‌కు రాజీనామా చేశారు. ఒక సంవత్సరం క్రితం బోర్డు ఆమోదం లేకుండా కనీసం రూ.500 కోట్లు సింగ్ బ్రదర్స్ తీసుకున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. సింగ్ సోదరులు ప్రమోటర్లుగా ఉన్న ఆర్‌హెచ్‌టి హెల్త్ ట్రస్ట్‌ను కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నామని, సింగపూర్‌లో లిస్టైన ఈ కంపెనీని రూ.4,650 కోట్లకు కొనుగోలు చేయనున్నామని, ఈక్విటీ, రుణాల ద్వారా ఈ మొత్తాన్ని సమీకరిస్తామని కూడా సంస్థ తెలిపింది. క్యూ2, క్యూ3 ఆర్థిక ఫలితాలను ఈ నెల 28న వెల్లడిస్తామని, దీని కోసం ఆ రోజు డైరెక్టర్ల సమావేశం జరుగతుందని పేర్కొంది. బోర్డ్ ఆమోదం లేకుండా సింగ్ సోదరులు కంపెనీ నుంచి రూ.500 కోట్లు తీసుకున్నారని, దీనికి లెక్కలు లేకపోవడంతో ఆడిటింగ్ వ్యవహారాలు చూస్తున్న డెలాయిట్ హాస్కిన్స్ అండ్‌సెల్స్ ఎల్ఎల్‌పి రెండో త్రైమాసిక ఫలితాలను వెల్లడించడానికి నిరాకరించిందని కొద్ది రోజుల క్రితం బ్లూమ్‌బర్గ్ సంస్థ వెల్లడించింది. క్యూ2 ఫలితాలు వెల్లడించడంలో జాప్యం జరిగినందుకు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు రూ.66 కోట్ల మేర జరిమానా చెల్లించామని వివరించింది.





సెన్సెక్స్ 30,000కు పడిపోవచ్చు

ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని దెబ్బతీసిన పిఎన్‌బి స్కామ్ : ప్రముఖ ఇన్వెస్టర్ మార్క్ ఫ్యాబర్



ముంబై : పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) కుంభకోణం ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని దెబ్బతీసిందని, బిఎస్ఇ సెన్సెక్స్ 30 వేల స్థాయికి పడిపోవచ్చని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయి. 2018 సంవత్సరం పటిష్టమైన లాభాలతో మంచి ఆరంభాన్ని ఇచ్చిన ఈక్విటీ మార్కెట్లు.. కొద్ది వారాలుగా నేల చూపులు చూస్తున్నాయి. దిగి వచ్చిన మార్కెట్లను చూసి ఇన్వెస్టర్లు కొనుగోళ్లు చేపట్టేందుకు ఆసక్తి చూపిస్తున్న నేపథ్యంలో ఇప్పుడే తొందర పడాల్సిన అవసరం లేదని ప్రముఖ ఆర్థిక నిపుణుడు మార్క్ ఫ్యాబర్ అంటున్నారు. 'ద గ్లూమ్, బూమ్ అండ్ డూమ్ రిపోర్ట్' పబ్లిషర్, ఎడిటర్ మార్క్ ఫ్యాబర్ ఇంటర్వ్యూలో పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ప్రస్తుతం ఇన్వెస్ట్‌మెంట్‌కు తొందరపడాల్సిన అవసరం లేదని, ముందు ముందు మార్కెట్లు మరింతగా పతనమయ్యే అవకాశముందని అన్నారు. అయితే దీర్ఘకాలిక విధానంలో చూస్తే భారత్ ఈక్విటీలు ఇప్పటికీ బుల్లిష్‌గానే ఉన్నాయని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లకు 2017 సంవత్సరం అద్భుతంగా ఉందని అన్నారు. డాలర్ రూపంలో చూస్తే భారత్ మార్కెట్లు 35 శాతం పెరగ్గా, వియత్నాం 50 శాతం, యురోపియన్ మార్కెట్లు 30 శాతం పెరిగాయని అన్నారు. అమెరికా మార్కెట్లు రాకెట్‌లా దూసుకెళ్లాయి. ఐదు శాతానికి పైగా కరెక్షన్ ఇంతవరకు లేదు. 2016 ఫిబ్రవరిలో ఎస్ అండ్ పి 1,810 పాయింట్ల కనిష్టానికి చేరింది. అప్పటి నుంచి ఇంతవరకు 10 శాతం దిద్దుబాటు ఇప్పటి వరకూ లేదు. మార్కెట్లు ఓవర్‌బాట్‌లో ఉండగా.. హై వాల్యుయేషన్ నేపథ్యంలోనూ మొత్తంగా సెంటిమెంట్ సానుకూలంగా ఉంది.

10 శాతం మేరకు దిద్దుబాటు

జనవరి 29న బిఎస్ఇ సెన్సెక్స్ జీవితకాల గరిష్ట స్థాయి 36,443 పాయింట్లు చేరగా.. గత రెండేళ్లలో భారత మార్కెట్లు అద్భుతంగా రాణిస్తున్నాయి. రూపాయి విలువ ఆశించిన మేరకు పెరగపోయినా.. బలంగానే ఉంది. 10 శాతం దిద్దుబాటు ఈక్విటీ మార్కెట్లలో ఉండే అవకాశముంది. భారత్ ఈక్విటీ మార్కెట్లు దిగువ ముఖంగానే పయనిస్తున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో వేల కోట్ల మోసం కేసుల నేపథ్యంలో మార్కెట్ సెంటిమెంట్ బలహీనపడింది.

మద్దతు స్థాయి 30,000 పాయింట్లు

గత రెండేళ్ల క్రితం 23,000 పాయింట్ల వద్ద ఉన్న బిఎస్ఇ సెన్సెక్స్.. వేగంగా ర్యాలీని కొనసాగిస్తూ 30 వేల మార్క్‌ను క్రాస్ చేసింది. మార్కెట్లకు తర్వాతి మద్దతు స్థాయి 30,000 పాయింట్లు అని.. తాను అంచనా వేస్తున్నానని ఫ్యాబర్ అన్నారు. ఈ స్థాయిని దాటిందంటే.. సులువుగా 27,000 నుంచి 28,000 పడిపోతుంది. 30 వేల మద్దతు స్థాయిని దాటే అవకాశాలైతే లేవు. ప్రస్తుతం 30 వేల మార్క్‌కు చేరువ కావొచ్చని అంచనా వేస్తున్నట్టు ఆయన వెల్లడించారు. అంతర్జాతీయ సంస్థలు రుణాల ఊబిలో కూరుకుపోయాయని, ప్రస్తుతం మార్కెట్లు భారీగా పతనమైతే గనుక దారుణమైన బేరిష్‌ను చూస్తామని ప్రముఖ ఇన్వెస్టర్ జిమ్ రోగర్ ఇటీవల హెచ్చరించిన విషయం తెలిసిందే.

భారత్‌పై ఆశావాహ దృక్పథం

భారత్‌పైనా ప్రతి ఒక్కరూ ఆశావాహ దృక్పథంతో ఉన్నారు. వేగవంతంగా రాబడులను ఇస్తుందని నమ్ముతున్నారు. ఎస్ అండ్ పి 2,872 పాయింట్లకు చేరడంతో.. జనవరి 26 తర్వాత కరెక్షన్ ప్రారంభమైంది. అమెరికాలో గత కొద్ది రోజులుగా మార్కెట్లు పుంజుకున్న పరిస్థితులను చూస్తున్నామని, అయినప్పటికీ దీర్ఘకాలంలో ఇది ఇలాగే ఉంటుందని భావించడం లేదని ఫ్యాబర్ అన్నారు. ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే 10 నుంచి 20 శాతం పతనం ఉండొచ్చని.. అయితే ఇప్పుడైతే అంచనా వేయడం కష్టమేనని అన్నారు.

1,415 మంది పిఎన్‌బి ఉద్యోగుల బదిలీ



ముంబై : ఎల్ఒయు(లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్) మోసం కేసు నేపథ్యంలో ప్రభుత్వరంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) వేలాది మంది ఉద్యోగులను బదిలీ చేసింది. సివిసి(సెంట్రల్ విజిలెన్స్ కమిషన్) సలహా మేరకు ఈ ఏడాది ఫిబ్రవరి 19 నుంచి దాదాపు 1400 మంది ఉద్యోగులను బదిలీ చేసినట్టు బ్యాంక్ వెల్లడించింది. బ్యాంక్ రొటేషనల్ ట్రాన్స్‌ఫర్ పాలసీ మేరకు వీరిని బదిలీ చేశామని, ఈ ట్రాన్స్‌ఫర్లతో బ్రాంచ్ ఆపరేషన్లకు ఎలాంటి ప్రభావం ఏర్పడబోదని ఢిల్లీకి చెందిన పిఎన్‌బి తెలిపింది. 721 మంది అధికారులు, 437 మంది క్లర్క్‌లు, 257 మంది సబ్ స్టాఫ్.. మొత్తంగా 1,145 మంది ఉద్యోగులను బదిలీ చేసినట్టు బ్యాంక్ వివరించింది. అయితే 18,000 మంది ఉద్యోగులను బదిలీ చేసినట్టు ఇటీవల మీడియాలో వచ్చిన వార్తలు వాస్తవం కాదని పిఎన్‌బి స్పష్టం చేసింది. సివిసి సలహా మేరకు ఈ సిబ్బందిని ఇతర ప్రాంతాలకు ట్రాన్స్‌ఫర్ చేశామని పిఎన్‌బి ఎగ్జిక్యూటివ్ చెప్పారు. ఏడాది చివర వర్క్‌కు ఆటంకం కల్గకుండా ఉండేందుకు మార్చి నెల తర్వాత ప్రతి ఏడాదీ బదిలీ సాధారణంగా ఉంటాయని అన్నారు. దురదృష్టవశాత్తు ఈసారి ముందుగానే బదిలీ చేపట్టామని, ఎల్ఒయు మోసం కేసుల నేపథ్యంలో ఇలా చేయాల్సి వచ్చిందని ఆయన వివరించారు. బ్రాంచ్‌లలో పనులు సజావుగానే సాగుతున్నాయని, బదిలీలతో ఎలాంటి ప్రభావం ఉండబోదని పంజాబ్ నేషనల్ బ్యాంక్ పేర్కొంది.

మూలధనం అవసరాల కోసం పిఎన్‌బి ప్రణాళిక

భూషణ్ స్టీల్‌ను విక్రయించిన తర్వాత మూలధన అవసరాలను తీర్చేందుకు ప్రణాళికను రూపొందిస్తామని స్కామ్ బాధిత పంజాబ్ నేషనల్ బ్యాంక్ తెలిపినట్టు అధికార వర్గాల సమాచారం. దేశీయ దివాలా చట్టం కింద ఈ చర్యలు చేపట్టనున్నట్టు, దీనికి ఎంత సమయం పట్టనుంది, ధర ఎంత అనేది వెల్లడించలేదు. కాగా రూ.11,400 కోట్ల నీరవ్ మోడీ కుంభకోణంలో 120 షెల్ కంపెనీలు (బోగస్ సంస్థలు) గుర్తించామని ఇంతకు ముందు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) వెల్లడించింది. వీటిలో 80 కంపెనీలను నిరవ్ మోడీ, ఆయన మామ మెహుల్ చోక్సి నడుపుతున్నారని తెలిసింది. ఈ కుంభకోణంలో 20 ప్రాంగణాల్లో దాడులు ఐటి నిర్వహించింది.

వచ్చే నెల 2 నుంచి హైదరాబాద్ ప్రాపర్టీ షో

- ప్రకటించిన క్రెడాయ్ హైదరాబాద్ అధక్షుడు ఎస్. రామిరెడ్డి



మన తెలంగాణ/ హైదరాబాద్: కాన్ఫిడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(క్రెడాయ్) హైదరాబాద్ ఆరో ఎడిషన్ ''హైదరాబాద్ ప్రాపర్టీ షో–2018''ను మార్చి 2వ తేదీ నుంచి 4వ వరకు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ హైదరాబాద్ అధ్యక్షులు ఎస్.రామిరెడ్డి వెల్లడించారు. త్వరలోనే రియల్ ధరలు 10 నుంచి 15 శాతం వరకు పెరగనున్న నేపథ్యంలో ఫ్లాట్స్, ప్లాట్లను కొనుగోలు చేసుకోవాలని, తమ 'ప్రాపర్టీ షో'ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హైదరాబాద్‌లోని క్రెడాయ్ హైదరాబాద్ కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్న వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, పెట్టుబడిదారులకు హైదరాబాద్, మాదాపూర్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే ప్రాపర్టీ షో మంచి వేదికగా నిలుస్తుందన్నారు. మరో రెండు నుంచి మూడు సంవత్సరాల్లో హైదరాబాద్‌లో 9 కోట్ల చదరపు అడుగుల స్థలంలో వాణిజ్య నిర్మాణాలు జరగబోతున్నాయని, తద్వారా ప్రత్యేక్షంగా,పరోక్షంగా మొత్తం ఏడు నుంచి ఎనిమిది లక్షల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు పెరగడంతో హైదరాబాద్‌లో మరో 40 నుంచి 50వేల గృహ నిర్మాణాలు పెరిగే అవకాశాలుంటాయని అభిప్రాయపడ్డారు. రియల్ ఎస్టేట్ ధరలపై జిఎస్‌టి ప్రభావం పడుతుందని, ఒక చదరపు అడుగుకు రూ. 100 నుంచి 200 వరకు భారం పడుతున్నప్పటికీ దాన్ని వినియోగదార్లపై మోపకుండా బిల్డర్లే భరిస్తున్నారని తెలిపారు. రేరా చట్టం అమలుకు రియల్ ఎస్టేట్ ధరలకు సంబంధమే లేదన్నారు. ఇతర మెట్రోనగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో గృహ, వాణిజ్య స్థలాలు తక్కువగా ఉన్నాయని, అందుకే చాలా మంది ఇక్కడ స్థలాలను తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. క్రెడాయ్ ప్రాపర్టీ షోకు ప్రతి ఏటా మంచి స్పందన లభిస్తుందని, సందర్శకులలో సుమారు 40 నుంచి 50 శాతం కొనుగోలుచేసేందుకు అసక్తి చూపుతున్నారని, ఈసారి కూడా 70వేల సందర్శకులు వస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ షోలో సుమారు 15వేల యూనిట్స్‌తో పాటు, 140 మంది బిల్డర్లు పాల్గొంటారని, అన్ని రకాల ప్రాజెక్టులు, వివిధ నిర్మాణ సంస్థలు, బ్యాంకులు పాల్గొననున్నట్లు ఆయన వివరించారు. క్రెడాయ్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ స్టీలు, సిమెంటు ధరలు పెరిగిన నేపథ్యంలో భవిష్యత్తులో రియల్ ఎస్టేట్ ధరలు కూడా పెరుగుతాయన్నారు. జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థ ద్వారా నిర్మాణ పనులను చేడపుతన్న వారికి శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి సర్టిఫికెట్లను అందజేస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో క్రెడాయ్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు ఎం.ఎస్.ఆనందరావు, డి మురళీకృష్ణారెడ్డి, కోశాధికారి కె.రాజేశ్వర్, సంయుక్త కార్యదర్శి వి.రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
సన్ ఫార్మా	547.00	524.00	541.45	525.75	15.70	2.99
అరబిందో ఫార్మా	596.65	561.00	586.85	571.00	15.85	2.78
అదాని పోర్ట్స్	406.20	392.75	404.00	395.60	8.40	2.12
ఎం &ఎం	724.50	700.40	721.95	708.40	13.55	1.91
ఇండియా బుల్స్	1,272.55	1,233.25	1,267.40	1,244.05	23.35	1.88
ఇండస్‌ఇండ్ బ్యాంకు	1,631.00	1,586.20	1,623.50	1,594.25	29.25	1.83
కొటక్ మహీంద్రా	1,077.50	1,050.65	1,072.50	1,055.05	17.45	1.65
టెక్ మహీంద్రా	606.45	592.00	602.60	595.20	7.40	1.24
యస్ బ్యాంకు	316.90	308.15	316.10	312.35	3.75	1.20
ఇన్ఫోసిస్	1,164.00	1,140.45	1,160.75	1,147.40	13.35	1.16

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
బిపిసిఎల్	435.85	425.45	427.45	447.55	20.10	4.49
ఒఎన్‌జిసి	188.40	185.25	186.10	190.15	4.05	2.13
డా. రెడ్డీస్ ల్యాబ్స్	2,172.60	2,086.55	2,123.45	2,165.90	42.45	1.96
పవర్ గ్రిడ్ కార్ప్	194.50	189.25	190.25	193.95	3.70	1.91
యుపిఎల్	686.95	672.50	675.45	688.25	12.80	1.86
అంబుజా సిమెంట్స్	259.00	254.80	256.90	261.70	4.80	1.83
ఈచర్ మోటార్స్	27,350.00	26,700.00	26,868.50	27,365.75	497.25	1.82
లుపిన్	815.50	796.25	800.05	813.95	13.90	1.71
మారుతి సుజికీ	8,769.00	8,601.50	8,634.05	8,782.75	148.70	1.69
టాటా పవర్	87.20	83.45	84.90	86.35	1.45	1.68

ఒకదాని తర్వాత మరో కుంభకోణం : ఉద్ధవ్



న్యూఢిల్లీ : పిఎన్‌బి రూ.11400 కోట్ల కుంభకోణం విషయంలో శివసేన అధినేత ఉద్ధవ్ థాకరే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీపై విరుచుకుపడ్డారు. పెద్ద నోట్ల రద్దు సమయంలో ఇంత పెద్ద కుంభకోణం ఎలా జరిగిందని ప్రశ్నించారు. కేంద్రంలోను, మహారాష్ట్రలోని శివసేన బిజెపి ప్రభుత్వంలో భాగస్వామి. శివసేన ఎఎల్‌సి నీలం గోర్హే రచించిన పుస్తకాన్ని గురువారం ఇక్కడ ఆవిష్కరించిన ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు వివాదాన్ని కొత్తగా తెరపైకి వచ్చిన పిఎన్‌బి కుంభకోణం మరుగున పడేలా చేసిందని అన్నారు. 'వేలాది కోట్ల రూపాయల రుణాలు ఎలా ఇచ్చారు? కుంభకోణాలు ఒకదాని వెనుక ఒకటి వస్తున్నాయి. ఈ కుంభకోణంతో రాఫెల్ స్కాం వెనక్కిపోయింది' అని థాకరే విమర్శించారు. 'రెండు–మూడేళ్ల కాలంలో, పెద్ద నోట్ల రద్దు సమయంలో వేలాది కోట్ల రూపాయలు కుంభకోణాలను ఎలా పాల్పడ్డారు. బ్యాంకు ఖాతాల్లో ఉన్న నగదును పొందేందుకు బ్యాంకు వెళితే సవాలక్ష ప్రశ్నలు అడిగే అధికారులు వేల కోట్లను ఎలా రుణాలుగా ఇచ్చారు' అని ఆయన ప్రశ్నించారు. నోట్ల రద్దు తర్వాత సమయంతో పాటు ఇప్పటి వరకు దాని ఫలితాలను ప్రజలు అనుభవిస్తూనే ఉన్నారని ఆక్షేపించారు. బ్యాంకుల్లో డబ్బులు దొరకక ఇప్పటికీ కష్టాలు పడుతూనే ఉన్నారని ఉద్ధవ్ దుయ్యబట్టారు.

నీరవ్.. సమస్య పరిష్కరించుకో

పిఎన్‌బి ప్రతిపాదన, లేఖలో కీలక విషయాలు



న్యూఢిల్లీ : రుణాల చెల్లింపుల విషయంలో నీరవ్ మోడీకి పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) ఒక ప్రతిపాదన చేసింది. సరైన అనుసరణీయ పథకంతో ముందుకు వచ్చి , రుణాలను తిరిగి చెల్లించాలని ఈ విధంగా సమస్యకు పరిష్కారం కుదుర్చుకోవాలని ప్రతిపాదించింది. నీరవ్ మోడీ కంపెనీల బ్యాంకు రుణాల వ్యవహారం ఇప్పుడు పిఎన్‌బికి స్కామ్ గుదిబండను మిగిల్చింది. ఓ వైపు ఆర్థిక మంత్రిత్వ శాఖ కూడా రంగంలోకి దిగింది. త్వరలోనే ఈ వ్యవహారంపై పలు బ్యాంకుల ఉన్నతాధికారులతో సమావేశం కానుంది. నీరవ్ మోడీకి అదేపనిగా ఎల్‌వోయూలను కట్టబెట్టి, వివిధ బ్యాంకులలో నీరవ్ మోడీకి బ్యాంకు రుణాలను ఇప్పించడంలో పిఎన్‌బి మధ్యవర్తిగా ఉండటం వివాదాస్పదం అయింది. బ్యాంకులకు రూ 11,400 కోట్ల మేర నిండా ముంచి నీరవ్ ప్రస్తుతం దేశం విడిచిపెట్టి వెళ్లారు. పైగా తాను కేవలం వ్యాపార పనులపైనే విదేశాలకు వెళ్లానని చెపుతున్నారు. అయితే ఈ దశలోనే రుణాల తిరిగి చెల్లింపు అంశంపై నీరవ్‌కు పిఎన్‌బి వారు దౌత్యం పంపించినట్లు సమాచారం . రుణాల చెల్లింపు గురించి సరైన ఆలోచనతో రావాలని పిఎన్‌బి వారు నీరవ్‌ను కోరినట్లు తెలిసింది. తన పరిస్థితి గురించి నీరవ్ మోడీ ఇటీవలే బ్యాంకు వారికి ఒక మెయిల్ పంపించారు. దీనికి జవాబుగా ఇప్పుడు పిఎన్‌బి వారు నీరవ్‌కు తగు ప్రతిపాదనలు చేసినట్లు వెల్లడైంది. నీరవ్ నుంచి సరైన సహకారం అందకుంటే రుణాల చెల్లింపుల జంజాటం చివరికి పిఎన్‌బినే చుట్టుకుంటుంది. ఇది ఆర్థిక సంకటంగా మారుతుంది. ఎస్‌బిఐ, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంక్‌తో పాటు పలు బ్యాంకులకు పిఎన్‌బి బకాయిలు పడింది. ఇటీవలే బ్యాంకర్ల సంఘాలు సమావేశం అయి ఈ బకాయిలను చెల్లించాల్సిందిగా పిఎన్‌బిని కోరాయి. అయితే తాము మొత్తం చెల్లించలేమని కేవలం రూ 6000 కోట్లు చెల్లిస్తామని పిఎన్‌బి వారు బ్యాంకర్లకు తెలిపారు. దీనితో విషయాన్ని ఆర్‌బిఐకి తెలియచేయాలని బ్యాంకర్లు నిర్ణయించారు. విషయం తెలుసుకున్న ఆర్థిక మంత్రిత్వశాఖ ఇప్పుడు సమస్య పరిష్కారానికి నడుం బిగించింది. కాగా పిఎన్‌బి వారు ఇప్పుడు నీరవ్‌కు రాసిన లేఖ చర్చనీయాంశం అయింది. ఈ లేఖలో వారు ఈ విధంగా తెలిపారు " మీరు కొందరు బ్యాంకు అధికారులతో కుమ్మక్కు అయి అక్రమంగా ఎల్‌వోయులు సంపాదించుకున్నారు. ఇంతకు ముందు ఎప్పుడూ లేని రీతిలో వాటిని జారీ చేయడం జరిగింది. మీకే కాకుండా మీ ముగ్గురు భాగస్వామ్య సంస్థలకు కూడా ఈ సౌకర్యం కల్పించారు. దీనితో మా బ్యాంకుపై రుణాల ప్రభావం పడింది. తీసుకున్న రుణాలకు సరైన పూచీకత్తులు లేవు. నిబంధనల ఉల్లంఘన జరిగింది. ఈ దశలో మీరు సరైన అనుసరణీయ పద్ధతులలో రుణాల చెల్లింపునకు ముందుకు రావాల్సి ఉంది" అని ఈ లేఖలో స్పష్టం చేశారు. నీరవ్ మోడీ కంపెనీ ఫెమా, పిఎంఎల్‌ఎలను ఉల్లంఘించిన వైనాన్ని పిఎన్‌బి వారు చట్టపరమైన దర్యాప్తు సంస్థలకు తెలిపారు.

లగ్జరీ కార్లు స్వాధీనం



పిఎన్‌బి స్కామ్‌కు సంబంధించి ఇడి గురువారం నీరవ్ మోడీ కంపెనీపై కొరడాను తీవ్రతరం చేసింది. నీరవ్ కంపెనీకి చెందిన రూ 7.80 కోట్ల విలువైన మ్యూచువల్ ఫండ్స్‌ను, షేర్లను, ఛోక్సీ గ్రూప్‌నకు చెందిన రూ 86.72 కోట్ల విలువైన ఫండ్స్, షేర్లను స్తంభింపచేసింది. అంతేకాకుండా మోడీ, ఛోక్సీ వ్యక్తిగతంగా వాడే పలు లగ్జరీ కార్లను, కంపెనీల వాడకానికి ఉండే వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్లలో రోల్స్ రాయిస్ ఘోస్ట్, మెర్సిడిస్ బెంజ్, టయోటా ఫార్చ్యునర్, టయోటా ఇన్నోవా, పార్స్చే పనామెరా, హోండా కార్లు ఉన్నాయి. ఈ కార్లు, వాహనాల మొత్తం విలువ ఎంత అనేది వెల్లడికాలేదు. మోడీ, ఛోక్సీపైన ఇప్పుడు వివిధ కేసులకు సంబంధించి సిబిఐ, ఇడి,ఐటిలు వేర్వేరుగా దర్యాప్తు సాగిస్తున్న విషయం తెలిసిందే.

భూ సేకరణ అంశం సిజెఐ పరిధికి

న్యూఢిల్లీ: భూసేకరణ అంశం ఇప్పుడు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నిర్ణయ పరిధికి చేరింది. భూ సేకరణకు సంబంధించి త్రిసభ్య ధర్మాసనం ఒకటి బుధవారం వెలువరించిన తీర్పుతో సందిగ్ధత నెలకొంది. భూసేకరణపై ఫిబ్రవరి 8న వెలువరించిన తీర్పు అమలును ఈ త్రిసభ్య ధర్మాసనం నిలిపివేయడంతో న్యాయవ్యవస్థ పరంగా సంక్షోభం ఏర్పడింది. దీనిని పరిష్కరించేందుకు సరైన మరో ధర్మాసనం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఈ అంశాన్ని ఇప్పుడు ప్రధాన న్యాయమూర్తికి నివేదించింది. న్యాయమూర్తులు జస్టిస్ అరుణ్ మిశ్రా, అమితావా రాయ్‌తో కూడిన ధర్మాసనం తమ నిర్ణయాన్ని గురువారం తెలియచేస్తూ ఈ అంశాన్ని ప్రధాన న్యాయమూర్తి నిర్ణయ పరిధికి వదిలివేయాలని, సిజెఐనే తగు ధర్మాసనం ఏర్పాటు చేయాలని అభిప్రాయపడింది. తాము ఈ అంశానికి సంబంధించి తదుపరి విచారణను సాగించాలా? లేదా అనేది స్పష్టం చేయాలని కూడా ఈ ద్విసభ్య ధర్మాసనం అభ్యర్థించింది. భూసేకరణకు సంబంధించిన వ్యాజ్యాలలో ఐదేళ్ల నిర్ధిష్ట కాలపరిమితిలో పరిహారం తీసుకోకపోతే భూ సేకరణ రద్దు అవుతుందని చెప్పడం సరికాదని ఒక్కరోజు క్రితమే త్రిసభ్య ధర్మాసనం తీర్పు వెలువరించింది. పైగా అంతకు ముందు దీనిపై మరో ధర్మాసనం వెలువరించిన తీర్పు అమలును నిలిపివేసింది. ప్రస్తుతం తాము వెలువరించిన తీర్పు అమలు అవసరం అని లేకపోతే వ్యవస్థకు తీవ్ర పరిణామాలు ఉంటాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై ప్రధాన న్యాయమూర్తినే తగు ధర్మాసనం ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఫైటర్ పైలట్ అవనీ మరో రికార్డు



జామ్‌నగర్ : భారత మహిళా ఫైటర్ పైలట్ అవనీ చతుర్వేది చరిత్ర సృష్టించారు. ఒంటరిగా యుద్ధ విమానంలో విహరించిన భారత తొలి మహిళా ఫైటర్ పైలట్‌గా రికార్డుల్లోకెక్కారు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో మిగ్21 ఫ్లయిట్‌లో గురువారంనాడు ఆమె విహరించారు. రెండేళ్ల క్రితం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లోకి ముగ్గురు మహిళ పైలట్లను ఫైటర్ స్క్వాడన్‌కు తీసుకున్నారు. భవానా కాంత్, మోహనా సింగ్‌తో పాటు వారిలో అవనీ చతుర్వేది కూడా ఉన్నారు. అవనీ మిగ్‌లో విహరించడం భారతీయ వైమానిక దళానికి, దేశానికి ఓ పెద్ద విజయమని ఎయిర్ కమాండర్ ప్రశాంత్ దీక్షిత్ తెలిపారు. వివిధ పార్టీల నేతలు కూడా అవనీ చతుర్వేదిని అభినందించారు. బ్రిటన్, అమెరికా, ఇజ్రాయిల్, పాకిస్థాన్ లాంటి దేశాల్లో మాత్రమే మహిళా యుద్ధ పైలట్లు ఉన్నారు.

ఉద్యోగులకు 'డిజిటల్'అవార్డులు

న్యూఢిల్లీ : డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించిన, కీలకమైన ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో చిత్తశుద్ధి చూపిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రధాన నరేంద్ర మోడీ 'ప్రధాని అవార్డు'లను అందించనున్నారు. ఏప్రిల్‌లో జరిగే సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా ఈ అవార్డులను అందించనున్నట్టు అధికార ప్రకటన ఒక పేర్కొంది. ప్రజా పరిపాలనలో సమర్థవంత బాధ్యతల విభాగంలో అనేక మంది అధికారుల నుంచి ఇప్పటి వరకు మొత్తం 2010దరఖాస్తులు వచ్చాయని తెలిపింది. ఏప్రిల్ 21న అవార్డుల ప్రదానోత్సవం కూడా ఉంటుందని పేర్కొంది. అవార్డుల ఎంపికకు ప్రధానంగా నాలుగు అంశాలను ప్రాతిపదికగా ప్రభుత్వం తీసుకుంటున్నదని, ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన, డిజిటల్ చెల్లింపుల ప్రోత్సాహం, ప్రధానమంత్రి ఆవాజ్ యోజన–అర్బన్ అండ్ రూరల్, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన (డిడియుజికెవై)లో అవార్డుల ఎంపిక జరుగుతుందని వివరించింది.

కాంగ్రెస్‌లో చేరిన సిద్ధిఖీ

న్యూఢిల్లీ : బిఎస్‌పి నుంచి బహిష్కరణకు గురైన నసీముద్దీన్ సిద్ధిఖీతో పాటు ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రులు కొందరు గురువారం నాడు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సిద్ధిఖీ గత ఏడాది మే 10న రాష్ట్ర శాసనసభ ఎన్నికల సమయంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో బిజెపి నుంచి బహిష్కరణకు గురయ్యారు. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, ఉత్తరప్రదేశ్ ఇన్‌చార్జి గులాం నబీ ఆజాద్, పార్టీ రాష్ట్ర చీఫ్ రాజ్ బబ్బర్‌ల సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో సిద్ధిఖీతో పాటు మాజీ మంత్రులు ఓపి సింగ్, లియాఖత్ అలీ, మాజీ ఎంఎల్‌ఎలు ఉన్నారు.

నెహ్రూపై మోడీ వ్యాఖ్యలు సరికాదు



ముంబై : వ్యక్తిగత దూషణలు దేశంలో ప్రస్తుతం ఓ ట్రెండ్‌గా మారాయని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి)అధినేత శరద్ పవార్ అన్నారు. ప్రధాని మోడీ పార్లమెంటులో జవహర్ లాల్ నెహ్రూను విమర్శించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉభయ సభల్లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం సందర్భంగా నెహ్రూపై మోడీ చేసిన వ్యాఖ్యలు సమంజసం కాదన్నారు. 'విధానాల పై విమర్శలు సబబే, అయితే దేశ ప్రగతికి, ప్రజాస్వామ్య పటిష్టతకు నెహ్రూ ఏమీ చేయలేదని మోడీ అనడాన్ని నేను ఒప్పుకోను. ప్రజాస్వామ్యం 12 శతాబ్దంలో వచ్చినప్పటికీ ఆ తరువాత బ్రిటీష్ పాలకులు మనలను బానిసలను చేసి పాలించారు' అని పవార్ పేర్కొన్నారు. వాజ్‌పేయి సిద్ధాంత వైరుధ్యాలున్నప్పటికీ వ్యక్తుల పట్ల మర్యాదపూర్వకంగా ఉండేవారని చెప్పారు.

వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ల అరెస్ట్

చైల్డ్ పోర్నోగ్రఫీ పోస్టుల ఫలితం

న్యూఢిల్లీ : చిన్న పిల్లల అశ్లీల చిత్రాలను వాట్సాప్‌లో పోస్ట్ చేస్తున్న అంతర్జాతీయ ముఠా గుట్టును సిబిఐ ఛేధించింది. వివిధ దేశాల నుంచి సుమారు 119 మంది ఈ గ్రూపులను నిర్వహిస్తున్నారు. దీంట్లో గ్రూప్ అడ్మిన్లు అయిన అయిదుగురిపై కేసు నమోదు చేశారు. ఢిల్లీతో పాటు ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్రల్లోనూ గురువారంనాడు అనేక ప్రాంతాల్లో సోదాలు జరిగాయి. యుపిలోని కనౌజ్‌లో గ్రూప్ అడ్మిన్ నిఖిల్ వర్మను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బి.కామ్ గ్రాడ్యుయేట్ అయిన అతన్ని తదుపరి విచారణ కోసం ఢిల్లీకి తీసుకురానున్నారు. ముంబైకి చెందిన సత్యేంద్ర చౌహాన్, ఢిల్లీకి చెందిన నఫీస్ రాజా, జహీద్, నోయిడాకు చెందిన ఆదర్శ్‌లు ఆ వాట్సాప్ గ్రూప్‌లో ఇతర అడ్మిన్లుగా ఉన్నారు. కిడ్స్ ట్రిబులెక్స్ అనే పేరుతో ఈ గ్రూపులో చిన్న పిల్లల అశ్లీల చిత్రాలను అప్‌లోడ్ చేశారు. శ్రీలంక, పాక్, ఆఫ్ఘనిస్తాన్, అమెరికా, మెక్సికో, న్యూజిలాండ్, చైనా, నైజీరియా, బ్రెజిల్, కెన్యా దేశాలకు చెందిన చైల్ పోర్న్ మెటీరియల్ ఆ గ్రూపుల్లో పోస్ట్ చేశారు.

ప్రధాని మౌన్నేంద్ర మోడీ : ఏచూరి



త్రిస్సూర్: నీరవ్‌పిఎన్‌బి స్కామ్‌పై మౌనం వహిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీని 'మౌనేంద్ర మోడీ' (నిశ్శబ్ద మోడీ) అయ్యారని సిపిఎం జనరల్ సెక్రటరీ సీతారాం ఏచూరి విమర్శించారు. యుపిఎ పాలనలో పలు అంశాలపై మన్మోహన్ సింగ్‌ను మౌన్ మోహన్‌సింగ్ అని పిలిచిన మోడీ ఇప్పుడు తనకు తానే మౌనేంద్ర మోడీ అయ్యారని ఆయన విమర్శించారు. సిపిఎం కేరళ రాష్ట్ర 22వ సమావేశంలో ఏచూరి ప్రసంగించారు. పరీక్షల గురించి పిల్లలతో మాట్లాడిన మోడీ నీరవ్‌పిఎన్‌బి స్కామ్‌కు సంబంధించి ఏమీ మాట్లాడటం లేదని ఆయన పేర్కొన్నారు. మోడీ హాజరైన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాలకు, వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ కూడా హాజరయ్యారని ఆయనపేర్కొన్నారు. బ్యాంకుల నుంచి బడా కార్పొరేట్లు తీసుకున్న రూ.2.40లక్షల కోట్లను రద్దు చేసి, రైతు రుణ బాకీలను మాఫీ చేయకపోవడంపై బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపై ఏచూరి విరుచుకు పడ్డారు.రుణాలు రద్దు చేసిన బడా కార్పొరేట్ల జాబితాను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సతీ పద్మావత్ వివాదం అప్రస్తుతం

న్యూఢిల్లీ : పద్మావత్ సినిమాలో సతీ సహగమనం ఆచారం పాటింపును గొప్పగాచిత్రీకరించడాన్ని సవాలు చేస్తూ దాఖలు అయిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది.సతీ సహగమనం ఘట్టాన్ని సినిమాలోనుంచి తొలిగించాలని, దీనిని ఉన్నతంగా చిత్రీకరించినందుకు సినిమా దర్శకులు, నిర్మాతపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సామాజిక ఉద్యమకారులు స్వామి అగ్నివేశ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

నాగాలాండ్ బరిలో 59 శాతం కోటీశ్వరులు

మొదటి స్థానంలో జెడియు అభ్యర్థి రామోంగో లోథా

కోహిమా : నాగాలాండ్ శాసనసభకు ఫిబ్రవరి 27న జరగనున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో దాదాపు 59 శాతం మంది కోటీశ్వరులున్నారు. వీరిలో జనతాదళ్ యునైటెడ్ (జెడియు) తనపున నామినేషన్ వేసిన రామోంగో లోథా రూ.38.92 కోట్ల స్థిర చరాస్తులతో మొదటి స్థానంలో ఉన్నారు. ఈ విషయాన్ని ది అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) తన నివేదికలో ప్రకటించింది. నాగాలాండ్ శాసనసభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్లను ఎడిఆర్ విశ్లేషించింది. దీనిలో భాగంగా పోటీలో ఉన్న 196 మంది అభ్యర్థుల్లో 193 మంది అఫిడవిట్లను విశ్లేషించింది. వీరిలో 114 మంది కోటీశ్వరులున్నట్లుగా నిర్ధారించింది. ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన అభ్యర్థి తనకు ఎలాంటి స్థిర చారస్తులు లేవని అఫిడవిట్లో వెల్లడించినట్లు ఎడిఆర్ నివేదికలో వెల్లడించింది. ప్రస్తుత నాగాలాండ్ ముఖ్యమంత్రి టి.ఆర్. జెలియాంగ్ రూ.3.52 కోట్లు, ఎన్‌డిపిపి అభ్యర్థి నీఫి రియో రూ. 15.37 కోట్లు, మరో మాజీ ముఖ్యమంత్రి కె.ఎల్. చిషీ రూ.38.20 కోట్ల స్థిరచరాస్తులు ఉన్నట్లుగా నివేదికలో ప్రకటించింది. రూ. 5 కోట్లకు పైగా ఆస్తులున్న వారు 46 మంది అభ్యర్థులు, రూ. 2 కోట్లకు పైగా ఉన్న వారు 42 మంది అభ్యర్థులున్నట్లు వెల్లడించింది.



హదియా పెళ్లిపై దర్యాప్తు ఎంతవరకు న్యాయం?

కేరళ హైకోర్టుకు సుప్రీం ప్రశ్న

న్యూఢిల్లీ : కేరళ లవ్‌జిహాద్ ఉదంతంలో హదియా వివాహం రద్దు తీర్పును ఏ విధంగా సమర్థించుకుంటారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. గురువారం ఈ మేరకు కేరళ హైకోర్టును నిలదీసింది. యుక్త వయస్కుకు వచ్చిన వారు ఇష్టపూర్తిగా పెళ్లి చేసుకున్న తరువాత సమ్మతికి సంబంధించి దర్యాప్తునకు ఆదేశించడం సబబు అవుతుందా? అని ప్రశ్నించింది. కేరళలో జరిగిన మతాంతీకరణ, వివాహ ఘట్టంపై దాఖలు అయిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారణకు చేపట్టింది. పరస్పరం ఇష్టపడి పెళ్లికి సిద్ధపడ్డ వారి వైఖరి సరైనదా? కాదా? అంగీకారం ఉందా లేదా అనేదానిపై ఆరా తీయాలనే ఆదేశాలను ధర్మాసనం ప్రస్తావించింది. హైకోర్టు వ్యవహారశైలి సమర్థనీయమేనా అని ప్రశ్నించింది. వివాహం, దర్యాప్తు అనేవి వేర్వేరు అంశాలని, వివాహంపై ఎలాంటి దర్యాప్తు అవసరం లేదని, ఇతర అంశాలపై దర్యా ప్తు చేసుకోవచ్చునని ధర్మాసనం తెలిపింది. పాతిక సంవత్సరాల యువతి హాదియా లవ్ జిహాద్ వివాదంలో కేంద్ర బిందువు అయ్యారు. బలవంతపు మతమార్పిడి జరిగిందని, అక్రమంగా ముస్లింతో పెళ్లి జరిగిందని ఆరోపణలు వెలువడటం వివాదానికి దారి తీసింది. తాను భర్త షఫీన్ జహాన్‌తోనే కలిసి ఉండాలనుకుంటున్నానని,తనది ఇష్టపూర్తి వివాహం అని పేర్కొంటూ హాదియా మంగళవారం సుప్రీంకోర్టులో అఫడవిట్ దాఖలు చేశారు. దీనిపై గురువారం విచారణ జరిగింది. బలవంతంగా మత మార్పిడి జరిగిందని పేర్కొంటూ ముస్లిం యువకుడితో ఆమె వివాహం చెల్లనేరదని స్పష్టం చేస్తూ కేరళ హైకోర్టు ఆమె పెళ్లిని రద్దు చేసింది. తల్లిదండ్రుల కస్టడీకి పంపించాలని ఆదేశించింది. దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లగా నవంబర్ 27న హాదియాకు ఊరట లభించింది.

నాగాలాండ్‌కు స్థిరమైన ప్రభుత్వం

ప్రధాని నరేంద్ర మోడీ

కోహిమా: అభివృద్ధి కోసం పని చేయడానికి నాగాలాండ్‌కు బలమైన, స్థిరమైన ప్రభుత్వం అవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. బిజెపి–ఎన్‌డిపిపి అధికారంలోకి వస్తే ప్రజా ధనం దుర్వినియోగాన్ని అరికట్టి రోడ్ల అనుసంధానాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ట్యూన్సాంగ్ వద్ద ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. ఈశాన్య రాష్ట్రాలలో రవాణా ద్వారా పరివర్తన తీసుకు రావడమే తన కల ఆయన పేర్కొన్నట్లు నాగాలాండ్ బిజెపి అధికారిక ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. తాము అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల లోపే రాష్ట్రంలో 500 కిలో మీటర్ల వరకు జాతీయ రహదారులను అభివృద్ధి చేశామని, రోడ్ల అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆయన తెలిపారు. టెక్నాలజీ సాయంతో ప్రజాధనం దుర్వినియోగం కావడాన్ని అరికడతామన్నారు. కేంద్రం ఇస్తున్న రూపాయిలో కేవలం 15 పైసలు మాత్రమే ప్రజలకు చేరుతోందని ఓ మాజీ ప్రధాని పేర్కొన్నారని మోడీ గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితిని దృఢ నిర్ణయంతో మార్చాల్సిన అవసరం ఉందన్నారు.రాష్టానికి కేంద్రం చేసిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆయన ప్రస్తావించారు.

బడ్జెట్ ప్రవేశ పెట్టిన సిఎం పారికర్

పానాజీ: ముంబయిలోని లీలావతి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అనంతరం గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ గురువారం గోవాకు చేరుకున్నారు. డబోలిన్ విమానాశ్రయంలో దిగిన ఆయన మధ్యాహ్నం 2 గంటలకు అసెంబ్లీకి చేరుకుని అనంతరం బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. పాంక్రియాస్ సంబంధిత సమస్యతో బాధపడుతున్న పారికర్ ఫిబ్రవరి 15 నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఫుడ్ పాయిజన్ కావడంతో మొదట ఆయనను లీలావతి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య చికిత్స కోసం ఆయనను అమెరికాకు తరలించనున్నట్లు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పుకార్లు వచ్చాయి. దీంతో పారికర్ బాగానే ఉన్నారని ఆయనకు చికిత్స కొనసాగుతోందని ఆస్పత్రి అధికారులు ఒక ప్రకటన విడుదల చేయాల్సి వచ్చింది. పారికర్ పాంక్రియాస్ సంబంధిత సమస్యతో బాధపడుతున్నారని ముఖ్యమంత్రి కార్యాలయం మొదటి నుంచి తెలియజేస్తోంది.

ఆర్మీచీఫ్ రాజకీయ వ్యాఖ్యలా?



గువహతి : సైనిక దళాల ప్రధానాధికారి రాజకీయ వ్యాఖ్యలకు దిగడం అనుచితంగా ఉందని ఆలిండియా యునైటెడ్ డెమొక్రాటిక్ ఫ్రంట్ (ఎఐ యుడిఎఫ్) విమర్శించింది. ఈ ఫ్రంట్ ఎదుగుదల బిజెపిని మించిపో యిందని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా ఉన్నాయని, దిగ్భ్రాంతి కల్గించాయని ఫ్రంట్ అధ్య క్షులు బద్రదుద్దిన్ అజ్మల్ ట్వీట్ చేశారు. ఒక రాజకీయ పార్టీ గురించి ఆర్మీ చీఫ్ వ్యాఖ్యానాలకు దిగడం, అదీ రాజకీయ కోణంలో మాట్లాడటం దారుణం అని అజ్మల్ స్పందించారు. 1980 ప్రాంతంలో ఒక్కసారిగా సంభవించిన బిజెపి ఎదుగుదలను ఈ రాజకీయ కూటమి పురోగతి తలపిస్తోందని ఆర్మీచీఫ్ వ్యాఖ్యానించడం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. అసోంలోని పలు జిల్లాల్లో ముస్లింల సంఖ్య పెరుగుదలను ప్రస్తావిస్తూ ఆర్మీ చీఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పెద్ద పార్టీల దుష్పరిపాలనతోనే ఎఐయుడిఎఫ్, ఆప్ వంటి పార్టీలు పుట్టుకొచ్చాయని రావత్ వ్యాఖ్యానించారు. రావత్ చేసిన వ్యాఖ్యలను ధుబ్రి ఎంపి అయిన బద్రదుద్దిన్ ఇప్పుడు రాష్ట్రపతి భవన్‌కు, ప్రధాన మంత్రి కార్యాల యానికి పంపించారు. వీటిని తీవ్రంగా పరిశీలించాల్సి ఉందని కోరారు. ముస్లిం వర్గాల కోసం ఈ ఫ్రంట్ 2005లో ఏర్పాటు అయింది. ప్రస్తు తం ఈ కూటమికి ముగ్గురు ఎంపీలు, అసోం అసెంబ్లీలో 13 మంది ఎమ్మెల్యేల బలం ఉంది.

రజనీతో రహస్య భేటీ : కమల్

చెన్నై: తన రాజకీయ రంగ ప్రవేశంపై రజనీకాంత్‌తో రహస్యంగా సమావేశమైనట్లు కమల్ హాసన్ తెలిపారు. భవిష్యత్‌లో తాము రాజకీయ ప్రత్యర్థులమైన హుందాగా ఉండేందుకు నిర్ణయించుకున్నానని ఆయన తెలిపారు. మధురైలో బుధవారం ఆయన 'మక్కల్ నీతి కయ్యమ్' అనే రాజకీయ పార్టీని ప్రకటించగా, గత డిసెంబర్‌లోనే తాను రాజకీయాల్లోకి రాబోతున్నట్లు రజనీకాంత్ ప్రకటించారు. తమిళ వార పత్రిక 'ఆనంద వికటన్'లో రాసిన వ్యాసంలో హాసన్ ఈ విషయం వెల్లడించారు. కాగా, ఇరువురి మధ్య సమావేశం ఎప్పుడు జరిగిందనే విషయం ఆయన వెల్లడించలేదు. అయితే బిగ్ బాస్ షూటింగ్ సమయంలో తాము మాట్లాడుకున్నట్లు హాసన్ తెలిపారు.

అవినీతి భారతం @81

• టిఐ నివేదికలో వెల్లడి • జర్నలిస్టుల హత్యలపై ఆందోళన

బెర్లిన్ : అవినీతి సూచీలో భారతదేశం ర్యాంక్ ఇప్పుడు 81వ స్థానంలో ఉంది. 2017 సంవత్సరానికి 180 దేశాలలో అవినీతి స్థాయిపై బెర్లిన్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ (టిఐ) నివేదిక విడుదల చేసింది. 2016లో అవినీతి సూచీలో భారతదేశం 79వ స్థానంలో నిలిచింది. అయితే అప్పుడు 176 దేశాలలో అవినీతి స్థాయినే లెక్కించి నివేదిక వెలువరించారు. పలు కుంభకోణాలు, అనేక అంశాలలో అక్రమాల నేపథ్యంలో ఈ అవినీతి స్థాయి సూచీలో భారతదేశం స్థానం బట్టి చూస్తే ఇప్పుడు అవినీతిలో భారత్ చైనాను దాటేసింది. అయితే పాకిస్థాన్ కన్నా పరిస్థితి మెరుగ్గా ఉందని వెల్లడైంది. వివిధ దేశాలలో అవినీతిని కొలిచేందుకు సంస్థ వారు శాస్త్రీయ దృక్పథం అవలంభించారు. ప్రత్యేకించి ప్రభుత్వ రంగంలో అవినీతిని అంచనా వేశారు. దీనికోసం సున్నా నుంచి వంద వరకూ స్కేలును వాడారు. సున్నా పరిధిలో వచ్చే దేశంలో అత్యంత ఎక్కువ అవినీతి అని, వంద అంటే పారదర్శకత ఉందని, అవినీతి లేదని అర్థం. ఈ స్కేలు మేరకు భారత్ స్కోర్ 40 ర్యాంకు 81గా నిలిచింది. అవినీతిలో ఇప్పుడు పాకిస్థాన్ ర్యాంక్ 117. చైనా ర్యాంకు 77గా ఉంది. భూటాన్‌కు వచ్చిన అవినీతి ర్యాంక్ 67. అవినీతి రహిత లేదా తక్కువ స్థాయి దేశాల వరుసలో న్యూజిలాండ్, డెన్మార్క్‌లు తరువాత సింగపూర్ నిలిచాయి. అయితే 2013 నుంచి చూస్తే భారతదేశంలో అవినీతి తగ్గుతూ వచ్చింది. 2013, 14లో భారీ స్థాయి స్పెక్ట్రమ్, కోల్ స్కామ్‌లు అవినీతి సూచీలో ప్రతిఫలించాయి. ఇక ఆసియా పసిఫిక్ ప్రాంతంలో భారత్ అతి పెద్ద అపరాధిగా నిలిచింది. ప్రభుత్వ రంగంలో అవినీతి ఏ స్థాయిలో ఉందనే దానిపైనే టిఐ దృష్టి సారించింది. ప్రపంచంలోనే అతి భారీ స్థాయి అవినీతి దేశంగా ఇప్పుడు సోమాలియా నిలిచింది. ఇప్పటి సూచీ మేరకు పలు దేశాలలో అవినీతి తీవ్రత అధికంగానే ఉందని వెల్లడయినట్లు సంస్థ తెలిపింది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, ప్రతిపక్ష నేతలు చివరికి దర్యాప్తు సంస్థలు, చట్టపరమైనసంస్థల అధికారులు, సిబ్బంది బెదిరింపులకు గురవుతున్నట్లు తెలిపింది. పలు హత్యలు హింసాత్మక ఘటనలు జరిగాయని తెలిపింది. ఈ ప్రాంతంలో భారత్ పెద్ద దోషిగా ఉందని కూడా పేర్కొనడం కీలకంగా మారింది. భారత్, ఫిలిప్పీన్స్, మాల్దీవులలో ఎక్కువగా దాడులు జరుగుతున్నాయని, అవినీతి ఎక్కువగా ఉన్న ఈ దేశాలలోనే ఇవి జరగడం అక్కడే పత్రికా స్వేచ్ఛ హరించుకుపోవడం,జర్నలిస్టులపై దాడులు , కొందరు జర్నలిస్టుల హత్యలు జరగడం వంటి అంశాలను నివేదికలో పేర్కొన్నారు. భారత్‌తో పాటు ఈ ఆసియా దేశాలలో గత ఆరు సంవత్సరాలలో 15 మంది జర్నలిస్టులు హత్యకు గురయినట్లు వెల్లడయిందని, అవినీతిని వెలుగులోకి తెచ్చిన పరిశోధనాత్మక జర్నలిస్టుల హత్యలే ఎక్కువగా జరిగినట్టు తేలిందని నివేదికలో తెలిపారు. ఇక మీడియాతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలకు బెదిరింపులు, అణచివేతలు వంటివి అవినీతిభరిత దేశాలలో ఎక్కువగా జరుగుతున్నాయి. పౌర సమాజంపై,మీడియాపై దాడులు, దీనితో ముడివడి ఉన్న అవినీతి అక్రమాల నేపథ్యంలో సరైన రీతిలో స్పందించాల్సి ఉందని టిఐ మేనేజింగ్ డైరెక్టర్ పాట్రికా మోరిరా స్పష్టం చేశారు. ఇప్పటి నివేదికను సమగ్రంగా విశ్లేషించుకుంటే పలు దేశాలు అవినీతి ఆటకట్టులో మందకొడిగా వ్యవహరిస్తున్నట్లు వెల్లడైందని, అయితే అవినీతిని నివారించాలనే ప్రయత్నాలు మొదలు కావడం కీలకం అని సంతృప్తి చెందాల్సి ఉందని సంస్థ వ్యాఖ్యానించింది.





మార్చి 1 నుంచి ఎలక్టోరల్ బాండ్ల విక్రయం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఎలక్టోరల్ బాండ్స్ తొలి దశ అమ్మకాలు మార్చి 1 నుంచి 10 వరకూ జరుగుతాయి. అధీకృత ఎస్‌బిఐ శాఖల నుంచి వీటిని కొనుగోలు చేయవచ్చునని ఆర్థిక మంత్రిత్వశాఖ గురువారం ఒక ప్రకటన వెలువరించింది. రాజకీయ పార్టీలకు విరాళాల ప్రక్రియ ప్రక్షాళన పేరిట కేంద్రం ఎలక్టోరల్ బ్యాండ్స్ పథకం తీసుకువచ్చింది. ఈ ఏడాది జనవరి రెండున ఎలక్టోరల్ బాండ్స్ స్కీమ్‌ను ప్రకటించింది. దీని మేరకు భారతీయ పౌరులు కానీ దేశంలో నెలకొన్న /ఏర్పాటు అయిన సంస్థలు కానీ వీటిని కొనుగోలు చేయవచ్చు. తొలుత ఎస్‌బిఐకి చెందిన న్యూ ఢిల్లీ, ముంబై, కొల్‌కతా, చెన్నై బ్రాంచ్‌లలో ఈ బాండ్లను జారీ చేసి,నగదు చేసుకునేందుకు వీలు కల్పించారు. ఆయా శాఖలలోనే ఎలక్టోరల్ బాండ్లను విక్రయిస్తారు. ఈ ఏడాది ప్రథమ త్రైమాసికానికి తొలి దఫాగా ఈ బాండ్ల అమ్మకాల ప్రక్రియ మార్చిలో మొదలవుతుందని , ఇది పది రోజులు ఉంటుందని మంత్రిత్వశాఖ తమ ప్రకటనలో తెలిపింది. 2017–18 కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి జైట్లీ ఎలక్టోరల్ బాండ్స్ పథకం ప్రకటించారు. దీని మేరకు కేవలం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలూ, గత లోక్‌సభ, లేదా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో పోలయిన ఓట్లలో కనీసం ఒక్కశాతం ఓట్లు పోలయిన పార్టీలు ఈ బాండ్లను పొందేందుకు అర్హత పొందుతాయి.

సిక్కు వ్యక్తిపై శ్వేతజాతీయుడి దాడి

లండన్: బ్రిటన్‌లో ఓ సిక్కుపై శ్వేతజాతీయుడు దాడికి పాల్పడ్డాడు. ఇది ఆ దేశ పార్లమెంటు సాక్షిగా జరిగింది. పంజాబ్‌కు చెందిన 37ఏళ్ల రవ్‌నీత్ సింగ్ పోర్ట్‌కుల్లిస్ హౌస్ వద్ద సిక్కు ఎంపి తన్‌మన్‌జీత్ సింగ్ దేసిని కలిసేందుకు వేచి ఉన్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఓ శ్వేత జాతీయుడు రవ్‌నీత్ సింగ్ పట్ల దురుసుగా ప్రవర్తించాడు. అతడిపై దాడి చేసి టర్బన్‌ను లాగేశాడు. 'ముస్లిం గో బ్యాక్' అంటూ గట్టిగా కేకలు వేస్తూ దాడికి పాల్పడినట్లు రవ్‌నీత్ తెలిపారు. ఘటనపై రన్‌వీత్ స్పందించాడు. ఓ వ్యక్తి నాతో అకారణంగా గొడవకు దిగాడని, నాపై దాడి చేసి టర్బన్‌ను గట్టిగా లాగేశాడన్నారు. అది కొద్దిగా ఊడిపోతుంటే, వెంటనే దాన్ని పట్టుకున్నానని, గట్టిగా ఎదురు తిరిగి అరిచే సరికి అతడు పారిపోయాడన్నారు.జాత్యాంహకార మాటలు ఏవో మాట్లాడాడని వాపోయాడు

జావాలో విరిగిపడిన కొండచరియలు

జకార్తా:ఇండోనేషియాలోని జావా ద్వీపంలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. మరో 15 మంది అదృశ్యమయ్యారు. సెంట్రల్ జావాలోని బ్రిబిస్ జిల్లాలోని వరిపొలాల్లో రైతు లు పనిచేస్తుండగా హఠాత్తుగా కొండచరియలు విరిగిపడ్డాయి. కొంచరియల కింద పడి ఐదుగురు రైతులు ప్రాణాలు కోల్పోయారు.మరో14 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారని విపత్తు నిర్వహణా బృందం వెల్లడించింది. జావా పర్వత ప్రాంతంలో కొన్నిరోజులుగా వర్షంపడటంతో కొండచరియలు విరిగిపడ్డాయని వెల్లడించారు.శిథిలాలకింద ఇరుక్కుపోయిన వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయన్నారు.

గురుకులాల్లో రోబొటిక్ విధానం

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలల్లో రోబొటిక్ విద్యా విధానానికి అడుగులు పడుతున్నాయి. నగరంలోని సైదాబాద్ బాలుర మైనారిటీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన 'రోబొటిక్స్ విత్ బేసిక్ ఇంజినీరింగ్ స్కిల్ ల్యాబ్'ను రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారు ఎకె ఖాన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోబొటిక్ ల్యాబ్ రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటైన మొదటిదని పేర్కొన్నారు. తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలల విద్యార్థులు రోబొటిక్స్‌తో బేసిక్ ఇంజినీరింగ్ స్కిల్స్‌ను పొందేందుకు ఈ ల్యాబ్‌లు దోహదపడతాయన్నారు. ఈ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థులు వార్షిక విద్యాసంవత్సర ప్రణాళిక, స్కిల్ ల్యాబ్స్ కోర్సులకు స్పెషల్ కరికులమ్‌లలో శిక్షణ పొందవచ్చన్నారు. ముఖ్యంగా ఐటిఐలలో మెకానికల్ ల్యాబ్, ప్లంబింగ్ ల్యాబ్, ఎలక్ట్రికల్ ల్యాబ్, కార్పెంటరీ ల్యాబ్, రోబొటిక్ ల్యాబ్‌లలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి వీలవుతుందని తెలిపారు. భవిష్యత్తులో తెలంగాణలోని అన్ని మైనారిటీ గురుకుల పాఠశాలల్లో వీటిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. దీని వల్ల సుమారు 50 వేల మంది విద్యార్థులకు మేలు జరుగుతుందని, హైదరాబాద్ కు చెందిన క్యాటలిస్ట్ ఎంపవర్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ సహకారంతో ఈ విధానానికి డిజైన్ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి బి.షఫిఉల్లా ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేరాల అదుపులో సిసి కెమెరాల పాత్ర కీలకం : హోం మంత్రి



మన తెలంగాణ / హైదరాబాద్ : నేరాలను అదుపు చేయడంలో సిసి కెమెరాలు కీలక పాత్రను పోషిస్తున్నాయని రాష్ట్ర హోం శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి వ్యాఖ్యానించారు. దోపిడీలు,దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను అదుపు చేయడంలో అవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. సిసి కెమెరా దృశ్యాల ఆధారంగా 24 గంటల్లోనే ఎన్నో కేసులను పోలీసులు ఛేదిస్తున్నారని అన్నారు. తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టిఐటిఎ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మారియట్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి నాయిని జికామ్ సంస్థ రూపొందించిన 'మేక్ తెలంగాణ సేఫ్' యాప్‌ను ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో ఇప్పటి వరకు 10 వేల సిసి కెమెరాలు ఏర్పాటయ్యాయని, వివిధ నివాస ప్రాంతాల్లో 'కాలనీ సంక్షేమ అసోసియేషన్లు', 'అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు' సొంతంగానే సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకుంటున్నాయని తెలిపారు. సిసి కెమెరాలు రావడంతో నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు. దొంగతనాలకు పాల్పడినవారిని పట్టుకోవడం సులభం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వాటర్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ వి. ప్రకాశ్, తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోపిరెడ్డి, జికామ్ ఎలక్ట్రానిక్ సొసైటి ఎండి రాణా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల వినతులపై నెల రోజుల్లో పరిష్కారం

మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లోని హౌసింగ్ బోర్డుల్లో పనిచేసిన విశ్రాంత ఉద్యోగులకు సవరించిన పేస్కేల్స్ మేరకు పింఛన్, కరవు భృతి చెల్లించాలనే విజ్ఞాపన పత్రాలను నెలరోజుల్లో పరిష్కరించాలని ఉమ్మడి హైకోర్టు గురువారంరెండు రాష్ట్రాలను ఆదేశించింది. 2013లో వేతన సవరణ చేసినా తమకు అందుకు అనుగుణంగా పింఛన్, కరవు భృతి ఇవ్వడం లేదని హైదరాబాద్‌కు చెందిన కుమారస్వామి వేసిన రిట్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని బెంచ్ విచారించింది. హౌసింగ్ బోర్డుల మధ్య వివాదాల కారణంగా విశ్రాంతి ఉద్యోగులకు బకాయిలు చెల్లించకపోవడం సబబుకాదని బెంచ్ పేర్కొంది.

రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టుకు విద్యుత్ కంపెనీ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమ నుంచి కొనుగోలు చేసిన విద్యుత్‌కు బకాయిలు రూ.27.54 కోట్లు చెల్లించడం లేదని ముంబయిలోని విద్యుత్ కంపెనీ శారద మెటల్స్ అండ్ అలాయ్స్ లిమిటెడ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. దీనిని గురువారం విచారించిన నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్.. తెలంగాణ విద్యుత్ డిస్కంలకు నోటీసులు ఇచ్చింది. నోటీసులు ఇచ్చినా బకాయిలు ఇవ్వడం లేదని కంపెనీ వాదన. డిస్కంలకు నోటీసులు ఇచ్చిన ట్రిబ్యునల్ విచారణ మార్చి 7కి వాయిదా వేసింది.

'ఇజ్తెమా'కు ప్రత్యేక రైళ్లు

మన తెలంగాణ / హైదరాబాద్ : ఔరంగబాద్‌లో జరగనున్న ముస్లింల సమ్మేళనం 'ఇజ్తెమా' సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 23 – 26 తేదీల్లో వివిధ ప్రాంతాల నుంచి 4 ప్రత్యేక రైళ్ళను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) ప్రకటించింది. గుల్బర్గ – ఔరంగబాద్ ప్రత్యేక రైలు (నెం.01321/01322) ఈ నెల 23న మధ్యాహ్నం 12:55 గంటలకు గుల్బర్గ నుంచి బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు జామున 4 గంటలకు ఔరంబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 26న రాత్రి 6:30 గంటలకు ఔరంగబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11:30 గంటలకు గుల్బర్గకు చేరుకుంటుంది.

టీచర్లకూ తుపాకులు



- వారిలో కొందరికి రహస్యంగా శిక్షణ
- దేశంలో గన్‌ల జారీ ఇక కఠినతరం
- ఫ్లోరిడా బాధితులతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమావేశం

వాషింగ్టన్: తుపాకుల యజమానులకు నిబంధన కఠినతరం చేస్తామని, వాటి జారీకి పక్కాగా నిబంధనలను అమలుచేస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హామీ ఇచ్చారు. ఇటీవల ఫ్లోరిడా పాఠశాలలో జరిగిన కాల్పుల ఘటన నుంచి ప్రాణాలతో బయటపడిన వారితో అమెరికా ట్రంప్ గురువారంనాడు సమావేశమయ్యారు. గత వారం పాఠశాలకు చెందిన ఓ మాజీ విద్యార్థి విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో 17 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై దేశవ్యాప్తంగానిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ట్రంప్ క్షతగాత్రులతో పాటు బాధితుల కుటుంబాలతో శ్వేతసౌధంలో సమావేశమై మాట్లాడారు. రి మానసిక పరిస్థితిని కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తామని చెప్పారు. పాఠశాలల్లో తరచూ ఇలాంటి కాల్పులు జరగకుండా టీచర్ల వద్ద కూడా తుపాకులు ఉండాలని ఆయన సూచించారు. కొందరు ఉపాధ్యాయులకు తుపాకుల వినియోగంలో మంచి శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. అయితే అది రహస్యంగా ఉండాలని చెప్పారు.కొందరు ఉపాధ్యాయులకు తగిన శిక్షణ ఇచ్చి వారి దగ్గర రహస్యంగా తుపాకులు ఉంచితే పరిస్థితిలో కొంత మేర మార్పు వస్తుందని ట్రంప్ ఆశించారు. దీని వల్ల గన్‌ఫ్రీ జోన్ ఉండబోదని, అయితే గన్‌ఫ్రీ జోన్ అంటే దుండగులు తుపాకులతో వచ్చి కాల్పులు జరుపుతున్నారని ట్రంప్ పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటానని ట్రంప్ హామీ ఇచ్చారు. కాల్పుల ఘటనను ప్రత్యక్షంగా చూసిన కొందరు విద్యార్థులు తమ ఆవేదనను అధ్యక్షుడితో పంచుకున్నారు. ప్రపంచంలో ఇంకెవ్వ రికీ ఇలాంటి పరిస్థితి ఎదురుకావొద్దని ఒకరు, స్కూల్ నుంచి ప్రాణాలతో ఇంటికెళ్లగలిగినందుకు తాను చాలా అదృష్టవంతుడినని మరొకరు అన్నారు.



44 మంది దుర్మరణం

పెరూలో ఘోరబస్సు పమాదం

లిమా : పెరూలో ఘోర బస్సు ప్రమాదం చోటుచేసుకుంది. దక్షిణ పెరూలోని కొండ ప్రాంతంలో ప్రయాణికులతో వెళుతున్న డబుల్ డెక్కర్ బస్సు అదుపు తప్పి 100అడుగుల లోయలో పడింది. ఈ ఘటనలో 44 మంది దుర్మరణం పాలయ్యారు.మరికొంత మంది తీవ్ర గాయాలతో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. అరెక్విపాలోని జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది.పర్వత ప్రాంతాలు..పైగా ఇరుకైన ఒకే రహదారి కావడంతో పాటు బస్సు డ్రైవర్ అతి వేగం వల్లే ఈ ప్రమాదానికి కారణమని అధికారులు తెలిపారు. తాజా ఘటనాస్థలిలో సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై పెరు అధ్యక్షుడు షెడ్రో పాబ్లో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని ఆయన చెప్పారు. నెల రోజుల్లో పెరూలో ఇది రెండో ఘోర బస్సు ప్రమాదం. అప్పుడు జరిగిన దుర్ఘటనలో 48 మంది చనిపోయారు.

ట్రూడో పర్యటన వివాదాస్పదం

- విందుకు ఖలిస్తాన్ తీవ్రవాదికి ఆహ్వానం
- విమర్శలు చెలరేగడంతో ఆహ్వానం రద్దు



న్యూఢిల్లీ : కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో విందుకు ఖలీస్తానీ తీవ్రవాది అత్వాల్‌కు ఆహ్వానం అందడంపై వివాదం చెలరేగడంతో ఆ దేశం వెంటనే నష్టనివారణ చర్యలు చేపట్టింది. ఈ విందులో పాల్గొనేందుకు అత్వాల్‌కు ఆహ్వానం లేదని కెనడా హైకమిషన్ తేల్చిచెప్పింది. 'ఏలాంటి కార్యక్రమానికి అయినా వ్యక్తి (జస్పాల్ అత్వాల్)కి ఎప్పుడూ ఆహ్వానించబోం, అత్వాల్‌కు పంపిన ఆహ్వానాన్ని రద్దు చేశాం. అసలు ఈ అహ్వానం ఎలా అందిందన్న విషయంపై విచారణ జరుపుతున్నాం' అని కెనడా ప్రధాన మంత్రి కార్యాలయం తెలిపింది. అయితే, ఈ వ్యవహారంపై వ్యాఖ్యానించేందుకు న్యూఢిల్లీలోని విదేశాంగ మంత్రిత్వ శాఖ నిరాకరించింది.అత్వాల్‌తో పాటు మరో ముగ్గురు 1986లో అకాలీదళ్ నేత, పంజాబ్ మంత్రి మల్కియాత్ సింగ్ సిద్ధూపై జరిగిన హత్యాయత్నంలో దోషిగా ఉన్నారు. ఈ దాడిలో సిద్ధూ గాయపడ్డారు. అనంతరం 1991లో పంజాబ్‌లో సిక్కు ఉగ్రవాదులు సిద్ధూను హత్య చేశారు. కాగా, సిద్ధూ సిక్కు వేర్పాటువాద సంస్థ సిక్కు యూత్ ఫెడరేషన్‌లో క్రియాశీలకంగా ఉన్నాడు. అప్పట్లో పంజాబ్ మంత్రిపై జరిగిన హత్యాయత్నంలో అత్వాల్‌తో పాటు మరో ఇద్దరు దోషులుగా తేలారు.

సోఫీ ట్రూడోతో ఫోటోలు : ట్రూడో కుటుంబం భారత పర్యటనలో భాగంగా ముంబయి, ఢిల్లీ రెండు ప్రాంతాల్లో అధికారిక విందుల్లో పాల్గొనే విధంగా ప్రణాళిక వేసుకున్నారు. ఈ రెండు విందులకు కూడా కెనడా రాయబార కార్యాలయం నుంచి జస్పాల్ అత్వాల్‌కు ఆహ్వానం అందింది. మంగళవారం ముంబయిలో జరిగిన విందుకు అత్వాల్ కూడా హాజరయ్యాడు. కెనడా ప్రధాని సతీమణి సోఫీ ట్రూడో, కెనడా మంత్రి అమర్‌జీత్ సోహితో ఆయన ఫొటోలు దిగడంపై దుమారం చెలరేగింది.


జస్పాల్ అత్వాల్‌తో సోఫీ

భారత్ విస్మయం

ఖలీస్తానీ తీవ్రవాది జస్‌పాల్ అత్వాల్‌కు భారత వీసా దక్కడంపై కేంద్ర విదేశాంగ శాఖ విస్మయం వ్యక్తం చేసింది. భారత్‌లో ప్రవేశించేందుకు అతడు వీసా ఎలా సంపాదించాడు, ముంబైలో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో పాల్గొన్న విందుకు ఎలా వెళ్లాడ న్న దానిపై విచారణ చేపట్టనున్నట్టు వెల్లడించింది. 'ఇక్కడ ప్రధానంగా రెండు విషయాలు స్పష్టం కావాల్సి ఉంది. ఒకటి అతడు ఆ కార్యక్రమంలో పాల్గొనడం, రెండు వీసా సంపాదించడం. అయితే తమ పర్యవేక్షణ లోపం వల్లే అలా జరిగిందని, అతడి ఆహ్వానాన్ని రద్దు చేశామని కెనడా స్పష్టంగా చెప్పేసింది. ఇక వీసా ఎలా సంపాదించాడన్న దానిపై దృష్టి పెట్టాం' అని పేర్కొంది.

కావాలనే కాలయాపన

- కార్మికులకు తక్షణమే నూతన వేతన ఒప్పందం
- టిజెఎంయు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, బస్ భవన్ వద్ద బహిరంగ సభ



మన తెలంగాణ / హైదరాబాద్/ ముషీరాబాద్: ఆర్టీసీ కార్మికులకు నూతన వేతన ఒప్పందాన్ని ఆర్టీసీ యాజమాన్యం అమలు చేయాలని, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆర్టీసీ తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎంయూ) ఆధ్వర్యంలో గురువారం చలో బస్‌భవన్ కార్యక్రమం జరిగింది. విద్యానగర్‌లోని యూనియన్ కార్యాలయం నుంచి బస్‌భవన్ వరకు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.సుధాకర్, హనుమంతు ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. అనంతరం జరిగిన బహిరంగసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంఎల్‌ఎ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ సీఎం కెసిఆర్ నూతన వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని ఆదేశించినప్పటికీ ఆర్టీసీ యాజమాన్యం కాలయాపన చేయడంలో అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. నూతన వేతన ఒప్పందాన్ని అమలు కాకుండా అధికార టీఎంయూ యూనియన్ కుట్రలు చేస్తుందని ఆయన విమర్శించారు. 2017 ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలు కావాల్సిన నూతన వేతన ఒప్పందాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం ఆర్టీసీ యాజమాన్యం జాప్యం చేయడం వల్ల ఆర్టీసీ ఉద్యోగులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఆర్టీసీ యాజమాన్యం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా టీజేఎంయూ చేసే ప్రతి పోరాటానికి తమ మద్దతు ఉంటుందని ఆయన ప్రకటించారు. టీడీపీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, టీజేఎంయూ గౌరవ అధ్యక్షుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ చట్టవ్యతిరేకంగా వేసిన డ్యూటీలను రద్దు చేయాలని, పెంచిన పనిభారాన్ని తగ్గించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్ల సాధన కోసం టిజెఎంయు చేసే పోరాటానికి తాము మద్దతు ఇస్తామన్నారు. టిజెఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారంలో యాజమాన్యం, అధికార టిఎంయులు కుమ్మకై తీరని అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. నూతన వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయకపోతే టిజెఎంయు ఆధ్వర్యంలో ఛలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. యూనియన్ అధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ కండక్టర్, డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అన్ని విభాగాల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో టిజెఎంయు నాయకులతో పాటు వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు.

జగన్ కేసులో కేంద్రానికి నోటీసులు?

ఢిల్లీ : వైసిపి చీఫ్ జగన్ అక్రమాస్తుల కేసులో కేంద్రానికి కోర్టు నోటీసులు జారీ చేసింది. ఎపిలోని ఇందూ టెక్ జోన్‌లో పెట్టుబడులు పెట్టి తాము తీవ్రంగా నష్టపోయామంటూ మారిషస్ ప్రభుత్వం నెదర్లాండ్స్‌లోని ఆర్బిట్రేషన్ అంతర్జాతీయ కోర్టులో పిటిషన్ వేసింది. ఇందూ టెక్ జోన్ కుంభకోణం కేసులో గుత్తేదారు శ్యాంప్రసాద్‌రెడ్డి, జగన్ తదితరులపై సిబిఐ ఛార్జిషీట్ దాఖలు చేసింది. దీనిలో మారిషస్‌కు చెందిన కరీసా ఇన్వెస్ట్‌మెంట్ ఎల్‌ఎల్‌సి సంస్థ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల కింద 43శాతం వాటాలు కలిగి ఉన్న విషయం విదితమే. సిబిఐ ఛార్జిషీట్ దాఖలు చేయడంతో ఇందూ టెక్ జోన్ పనులు నిలిచిపోయిన విషయం కూడా తెలిసిందే. దీంతో తాము మోసపోయామని పేర్కొంటూ మారిషస్ ప్రభుత్వం భారత ప్రధాని నరేంద్ర మోడీకి కోర్టు నోటీసులు పంపించింది. మోడీ తో పాటు తన ఫిర్యాదులో కేంద్ర ఆర్థిక, న్యాయ, వాణిజ్య పన్నులు, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రులను కూడా ప్రతివాదులుగా చేర్చింది.

గోవర్ధనధారిగా నరసింహుడు

మన తెలంగాణ/ యాదాద్రి : లోకరక్షణకు శ్రీకృష్ణుడు ఎత్తిన గోవర్ధనగిరి పర్వతము అలంకారం రూపములో యాదాద్రి బ్రహ్మోత్సవాలలో భక్తకోటి రక్షణకు శ్రీలక్ష్మీ నరసింహుడు గోవర్ధనధారి అలంకారుడగా దర్శనమిచ్చాడు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట దేవస్థానము తెలంగాణ మహా క్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీ నర్సింహ్మాస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరవరోజు గోవర్ధనగిరిధారి, సింహవాహనశేవలు అత్యంతవైభవంగా జరిగాయి. గురువారం ఉదయం శ్రీవారి ఆలయంలో ఉదయం శ్రీవైష్ణవి సమాఖ్య వారిచే సామూహిక విష్ణుసహస్ర నామ పారాయణములు గావించగా యజ్ఞాచార్యులు, అర్చకబృందం నిత్యహవనము, వేద మంత్ర పారాయణములు, మూల మంత్ర, మూర్తి మంత్ర జపములను, పూజా కార్యక్రమాలను నిర్వహించి శ్రీస్వామి, అమ్మవార్లను అభిషేకించి గోవర్ధనధారి అలంకారుడిగా అలంకరించి మేళతాళాల మధ్య పారాయణములను చేస్తూ వేద పండితులు మంత్రాలను ఉచ్చరిస్తూ బాలాలయంలో స్వామివారిని ఊరేగిస్తూ భక్తకోటికి దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయంలో శ్రీవారిని సింహవాహన అలంకార సేవలో ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. ఉదయం, సాయంత్రం నిర్వహించిన అలంకార సేవలను ఆలయ మండపంలో అధిష్టించి స్వామి వారి సేవల విశిష్టతను ఆలయ అర్చకులు భక్తకోటికి తెలిపి మంగళారాధనను నిర్వహించారు.బ్రహ్మోత్సవాలలో భాగంగా ధార్మిక సభలను ప్రారంభించారు. సంగీత మండపంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు మనోరంజకంగా కొనసాగుతున్నాయి. ఆస్థాన విద్వాంసులు, వేద పండితులచే మంగళవాయిద్య గోష్టి, వైదిక ప్రార్థన, భజన కీర్తనలు, కవిసమ్మేళనం, హరికథ, కూచిపుడి, భరతనాట్యం, కర్ణాటక సంగీతం, భక్తిసంగీతం, నృత్యం, ఈల పాట, చిందు యక్షగానం కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించగా భక్తులకు అలరించాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు స్వామివారికి ఎదురుకోల్ల మహోత్సవం జరుగనుంది. ఈ మహోత్సవ కార్యక్రమంలో యజ్ఞాచార్యులు సముద్రాల శ్రీనివాసాచార్యులు, ప్రధాన అర్చకులు నల్లంధిగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కారంపొడి నరసింహ్మాచార్యులు, కాదూరి వెంకటాచార్యులు, సంపతాచార్యులు, అర్చకుల బృందం, అనువంశిక ధర్మకర్త నరసింహ్మామూర్తి, ఆలయ ఈవో గీత, సహాయ కార్యనిర్వహణ అధికారులు భాస్కర్‌శర్మ, చంద్రశేఖర్, రాంమోహన్, ఆలయ ఉద్యోగ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్‌లో ఇద్దరి ఆత్మహత్య

మన తెలంగాణ/తూప్రాన్:మెదక్ జిల్లా, తూప్రాన్ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి శివారులో రైలు కింద పడి ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లాలో సంచలనం రేపుతుంది. ఘటన స్థలంలో లభించిన ఆధారల ప్రకారం... మృతులు కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలానికి చెందిన ఒంటెద్దు కాశిరాం, జయేంద్రలుగా పోలీసులు గుర్తించారు. వీరి మరణానికి వివాహేతర సంబంధమే ప్రధాన కారణమని మృతుల బంధువులు తెలియజేస్తున్నారు. రైల్లో గురువారం ఉదయం తెల్లవారుజామున హైదరాబాద్ వైపు వెళ్తుండగా బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్‌లో దిగి జయేంద్ర యొక్క పది నెలల చిన్నారిని స్టేషన్‌లో ఉంచి వీరిరువురు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ధృవీకరించారు. ఒంటెద్దు కాశిరాం మేనత్త కూతురైన జయేంద్రతో ఇతనికి వివాహేతర సంబంధం ఉందని వీరిరువురి బంధువర్గాలు తెలియజేస్తున్నాయి. గత ఐదు సంవత్సరాల క్రితమే మృతురాలు జయేంద్రకు మరొకరితో వివాహం జరిగింది.వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడిని హాస్టల్‌లో చేర్పించడంతో చిన్నపాప తన వెంటే ఉంది. భర్త బతుకుదెరువు కోసం దుబాయి వెళ్లడంతో బావా మరదళ్ల వద్ద వివాహేతర సంబంధం ఉన్నట్లుగా సమాచారం. ఈ విషయమైన వీరిరువురి బంధువర్గాల్లో ఇప్పటికే గొడవలు కూడా జరిగాయి. దీంతో వీరిరువురు కూడా కుటుంబ సభ్యులతో తరచు గొడవపడి చివరకు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుంది. కామారెడ్డి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. వీరిది ఆత్మహత్యా లేదా హత్యా అనే విషయంలో కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. వారి వెంట ఉన్న 10నెలల చిన్నారిని స్టేషన్ ముందు వదిలివేయడంతో చిన్నారి ఒంటరిగా మిగిలింది. చిన్నారి రాత్రంతా బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయగా స్థానికులు పోలీసులు సమాచారం అందించారు. ఘటనా స్థలంలో మృతువులకు సంబంధించిన ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు గుర్తింపు కార్డులు లభించాయి. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం కామారెడ్డి రైల్వే ఆసుపత్రికి తరలించారు. తల్లి మరణంతో పది నెలల చిన్నారి ఒంటరిగా మిగిలిపోయిన చిన్నారిని స్థానికులు ఐసిడిఎస్ అధికారులకు అప్పజెప్పారు.



సెమీస్‌లోకి మేరికోమ్.. క్వార్టర్ ఫైనల్స్‌కు బాక్సర్ వికాస్

సోఫియా (బల్గేరియా): 69వ స్ట్రాండ్‌జా స్మారక అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్ పోటీలో ప్రత్యర్థి రోమనియాకు చెందిన స్టెల్లా దుదాను భారతీయ మహిళా బాక్సర్ మేరికోమ్ ఓడించి సెమీస్‌లోకి ప్రవేశించింది. ఇప్పుడి వరకు ఈ టోర్నమెంటులో భారత్‌కు ఏడు పతకాలు ఖాయమయ్యాయి. అందులో మహిళలే ఐదు ఖాయం చేశారు. సీమా పునియి(81 కిలోలు), సవీతి బూరా(75 కిలోలు), మీనాకు మారి దేవి(54కిలోలు), భాగ్యబతి కచరి(81 కిలోలు) మేరికోమ్(48 కిలోలు)కారణంగా భారత్‌కు నాలుగు పతకాలు ఖాయమయ్యాయి. భారత బాక్సర్లు వికాస్ కృషన్ యాదవ్ (75 కేజీలు), అమిత్ పంఘల్ (49 కేజీలు), మనీశ్ పన్వర్ (81 కేజీలు) క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. రెండో రౌండ్ బౌట్‌లలో అమీర్ గినిఫిడ్ (మొరాకో)పై వికాస్... శర్విన్ (మారిషస్)పై అమిత్... ఆమిన్ (మొరాకో)పై మనీశ్ గెలుపొందారు. మరోవైపు మనోజ్ (69 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లో అబ్దుల్ కబీర్ (మొరాకో) చేతిలో ఓడిపోయాడు.





క్రికెట్ బోర్డులో సంచలనం..

కెన్యా కెప్టెన్ సహా అందరూ రాజీనామా!

లండన్ : కెన్యా క్రికెట్ బోర్డులో సంక్షోభం నెలకొంది. వరల్డ్ క్రికెట్ లీగ్ డివిజన్ –2లో ఘోర ప్రదర్శన తీవ్ర పరిణామాలకు దారి తీసింది. ఈ ఓటమి బోర్డు సభ్యులు, కెప్టెన్ రాజీనామా చేశారు. ఈ టోర్నీలో పాల్గొన్న ఆరు జట్లలో కెన్య చివరి స్థానంలో నిలిచింది. అంతేకాక గత నెల జింబాబ్వే వేదికగా జరిగిన ప్రపంచకప్ క్వాలిఫయర్‌లో కూడా కెన్యా చిత్తుగా ఓడింది. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ.. కెన్యా కెప్టెన్ రాకెప్ పటేల్ తన పదవికి రాజీనామా చేశాడు. అంతకు ముందే క్రికెట్ కెన్యా ఛైర్మన్ జాకీ జాన్ మహ్మద్, డైరెక్టర్ ఆఫ్ డెవలప్‌మెంట్ అభిజీత్ సర్కార్ తమ రాజీనామాలు సమర్పించారు. కాగా ఈ రోజు కెప్టెన్ కూడా రాజీనామా చేయడంతో అతని అడుగుజాడల్లోనే తాత్కాలిక కోచ్ థామస్ ఓడియో కూడా తన పదవి నుంచి తప్పుకున్నారు. దీంతో కెన్యా క్రికెట్ బోర్డ్ తీవ్ర సంక్షోభంలో పడిపోయింది. ఇప్పటికే సరైన గుర్తింపులేక కష్టాల్లో ఉన్న జట్టుకి ఇప్పుడు ఈ రాజీనామాల వేడి తగలడంతో విలవిలలాడిపోతోంది.

బుకీలు ఫిక్సింగ్‌కు పాల్పడమన్నారు

లీ చోంగ్‌వి

కౌలాలాంపూర్: మ్యాచ్ ఫిక్సింగ్ ఇప్పుడు బ్యాడ్మింటన్‌కు కూడా సోకినట్లు కనబడుతోంది. తాజాగా బ్యాడ్మింటన్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ కలకలం మొదలైంది. గతంలో ఒక మ్యాచ్‌ను ఫిక్స్ చేయాల్సిందిగా బుకీలు సంప్రదించిన విషయాన్ని ప్రపంచ నెం. 2 ఆటగాడు, మలేసియా స్టార్ షట్లర్ లీ చోం గ్ వి వెల్లడించాడు. అయితే దానిని తాను తిరస్కరించినట్లు పేర్కొన్నాడు. దీనిలో భాగంగా ఫిక్సింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు సహచర క్రీడాకారులను చూసి తలదించుకోవాల్సిన పరిస్థితి దా పురించిందని లీ ఆవేదన వ్యక్తం చేశాడు. దేశ గౌరవమే తనకు ముఖ్యమని చెప్పాడు. ఫిక్సింగ్ ఆరోపణలపై ఇద్దరు మలేసియా ఆటగాళ్లను బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బిడబ్ల్యుఎఫ్) ఈ నెల చివర్లో సింగపూర్‌లో విచారించనుంది. ఒకవేళ వారు దోషులని తేలితే జీవిత కాలం నిషేధానికి గురికావచ్చని సమాచారం.





కోరుకుంటే కోహ్లికి విశ్రాంతి!

- శ్రీలంకలో ట్రై-సిరీస్ ఆడనున్న భారత్
- మొదటి మ్యాచ్ మార్చి 6న
- సిరీస్‌లో భారత్‌తో పాటు శ్రీలంక, బంగ్లాదేశ్ ఆడనున్నాయి

న్యూఢిల్లీ: భారత , దక్షిణాఫ్రికా పర్యటన అనంతరం శ్రీలంకలో మార్చి 6 నుంచి18 వరకు నిదాహస్ ట్రోఫీ ట్రైయాంగ్యులర్ ట్వంటీ20 ఇంటర్నేషనల్ టోర్నమెంట్ జరగనున్నది. ఈ సిరీస్‌కు భారత్ జట్టును ఎంపిక చేసేందుకు ఎం.ఎస్.కె. ప్రసాద్ నేతృత్వంలో జాతీయ ఎంపిక కమిటీ సమావేశం కాబోతున్నది. ఇందులో ముఖ్యంగా విరాట్ కోహ్లిపై ఉన్న వర్క్‌లోడ్ గురించి చర్చించనున్నారు. త్వరలో జరగనున్న ట్రైసిరీస్‌లో ఆడాలా లేక విశ్రాంతి తీసుకోవాలా అన్నది విరాట్ కోహ్లియే నిర్ణయించుకోవాలని బిసిసిఐ ఉన్నతాధికారి ఒకరభిప్రాయపడ్డారు. ఆయన ఒకవేళ విశ్రాంతి కావాలని కోరితే తప్పక పరిశీలించడం జరుగుతుందన్నారు.

'ఒకవేళ విరాట్ విశ్రాంతి కోరితే అది లభిస్తుంది. విరాట్ విషయంలో ఆడాలా లేదా అన్నది ఆయనే నిర్ణయించుకుంటే మంచిది. ఈ సీజన్‌లో ఇదే చివరి టి20 సిరీస్ కావడం వల్ల ఆయన ఆడాలనుకుంటారా లేదా అనేది ఎవరికీ తెలియదు. టోర్నమెంటు పూర్తికాగానే ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్)లో ఆడేందుకు ఆయనకు కేవలం పక్షం రోజుల సమయం మాత్రమే ఉండగలదు' అని పేరుచెప్పడానికి నిరాకరించిన బిసిసిఐ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ట్రయాంగ్యులర్ టి20 టోర్నమెంటులో భారత్ ఓపెనింగ్ మ్యాచ్‌ను శ్రీలంకతో ఆడనున్నది. భారత్, శ్రీలంకతోపాటు బంగ్లాదేశ్ కూడా ఈ సిరీస్‌లో ఆడనున్నది. శ్రీలంక స్వాతంత్ర్యం 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ టోర్నమెంటు నిర్వహిస్తున్నారు. కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో లైట్ల వెలుగులో ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి.

దక్షిణాఫ్రికాతో భారత్ ఆడిని మూడు టెస్టుల్లో కోహ్లి అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్. కోహ్లి 286 పరుగులు చేసి 47.66 సగటును సాధించాడు. అందులో ఒక శతకం, మరో అర్ధ శతకం కూడా ఉన్నాయి. భారత్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లి అదే సత్తాను అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌ల్లోనూ కనబరిచాడు. 558 పరుగులు చేసి విస్మయపరిచేలా 186 సగటును సాధించాడు. పరుగుల యంత్రం(రన్ మెషిన్) అయిన విరాట్ కోహ్లి మూడు శతకాలు, ఒక అర్ధ శతకాన్ని ఆరు మ్యాచ్‌ల సిరీస్‌లో సాధించాడు.

బుమ్రా, భువిలకు విశ్రాంతి

అన్ని ఫార్మాట్లలో బాగా రాణించిన భువనేశ్వర్, బుమ్రాలకు విశ్రాంతి లభించనున్నది. వారు సుదీర్ఘ కాలంపాటు ఆడినందున వారికి ఐపిఎల్‌కు ముందు విశ్రాంతి కూడా అవసరమే. అంతర్జాతీయ వన్డే సిరీస్, టెస్ట్ సహా అన్ని మ్యాచ్‌ల్లో భువనేశ్వర్ దాదాపు 100 ఓవర్లు బౌలింగ్ చేశాడు. ఒకవేళ అతడు ప్రస్తుతం అంతర్జాతీయ టి20లో తన పూర్తి కోటాను బౌలింగ్ చేస్తే 112 ఓవర్లు వేసినవాడవుతాడు. బుమ్రాకన్నా ఎక్కువ ఓవర్లు ఇంకెవరూ బౌలింగ్ చేయలేదు. దక్షిణాఫ్రికా పర్యటనలో అన్ని మ్యాచ్‌లు ఆడిన ముగ్గురు ఆటగాళ్లలో ఆయన ఒకడు. మిగతా ఇద్దరు కోహ్లి, హార్ధిక్ పాండ్య. ఒకవేళ బుమ్రా, భువనేశ్వర్‌లు విశ్రాంతి తీసుకుంటే కొత్త బంతితో శార్దుల్ ఠాకుర్, జయదేవ్ ఉనద్కర్ వారి బాధ్యతలు చేపట్టనున్నారని సమాచారం.



మిస్టర్ కూల్ గరం

- 'అటేం చూస్తున్నావ్.. ఇటు చూడు' అని గ్రౌండ్‌లో మనీశ్ పాండేపై మండిపడ్డ ధోని



సెంచూరియన్ : ఎంతో ప్రశాంతంగా కనిపించే మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనికి పట్టలేని కోపం వచ్చేసింది. ఆ కోపంలో ఆయన తన సహచర ఆటగాడు మనీశ్ పాండేను కడిగిపారేశాడు. వివరాల్లోకి వెళితే. సెంచూరియన్‌లోని సూపర్ స్పోర్ట్ పార్క్‌లో బుధవారం భారత్–దక్షిణాఫ్రికా మధ్య రెండో అంతర్జాతీయ టి20 జరిగింది. ఆట ఆరంభంలోనే కీలక వికెట్లు కోల్పోయిన భారత్ నిలదొక్కుకోడానికి జాగ్రత్తగా ఆడాల్సిన పరిస్థితి. ఆ సమయంలో సురేశ్ రైనా, మనీశ్ పాండే ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. కానీ తర్వాత రైనా ఔటయ్యాడు. అతడి స్థానంలో ధోని బ్యాటింగ్‌కు క్రీజులోకి వచ్చాడు. సఫారీలకు ఎలాంటి అవకాశం ఇచ్చినా గెలుపును చేజార్చుకునే పరిస్థితి. ధోని, మనీశ్ పాండే కలసి ఐదో వికెట్‌కు అజేయంగా 98 పరుగులు చేశారు. పాండే అజేయంగా 79 పరుగులు, ధోనీ 28 బంతుల్లో అజేయంగా 52 పరుగులు చేశారు. ఇన్నింగ్స్ చివరి ఓవర్లో ధోని స్ట్రైకింగ్‌తో ఇన్నింగ్స్‌ను ముగించొచ్చని అందరూ ఆశతో ఎదురుచూస్తున్న సమయమది. ఫైనల్ ఓవర్‌లో రెండో బాల్‌కు ముందు ధోని, మనీశ్ పాండే తీరుకు అప్‌సెట్ అయ్యాడు. భారత్ ఇన్నింగ్స్‌కు అది చివరి ఓవర్. మనీశ్ పాండే మిడ్ వికెట్ వైపుకు బంతిని కొట్టి సింగిల్ పరుగు తీశాడు. 19.1 ఓవర్‌లో పాండే ఈ సింగిల్ రన్ చేశాడు. అయితే రెండో రన్ తీస్తాడేమోనని ధోని ఎదురు చూస్తుండగా పాండే అలాంటిదేమి చేయకుండా పార్టనర్‌ను చూడ్డానికి బదులు బంతిని చూస్తున్న పాండేపై 'ఏయ్ అటేమి చూస్తున్నావ్ ఇటు చూడు...ఆటపై లగ్నం(కాన్‌సెంట్రేట్) చేయ్' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ప్రస్తుతం దీనికి సంబంధించిన విడియో సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది. ఇదిలా ఉండగా ఆ తర్వాత బంతిలో ధోని పాటర్సన్ బంతిని సిక్సర్‌గా కొట్టాడు. తర్వాత మరి రెండు బౌండరీ దంచేశాడు. కానీ భారత్ టి20 రెండో మ్యాచ్‌ను ఆరు వికెట్లతో కోల్పోయింది.

గోల్కొండ మాస్టర్స్ గోల్ఫ్ ఛాంపియన్‌షిఫ్ ప్రారంభం



హైదరాబాద్: ప్రతిష్టాత్మక గోల్కొండ మాస్టర్స్ గోల్ఫ్ ఛాంపియన్‌షిప్ బుధవారం ప్రారంభమైంది. ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (పిజిటిఐ), హైదరాబాద్ గోల్ఫ్ సంఘం (హెచ్‌జిఎ) సంయుక్తంగా నిర్వహిస్తోన్న ఈ టోర్నీ నాలుగు రోజుల పాటు జరుగనుంది. హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో హెచ్‌జిఎ అధ్యక్షులు జె. విక్రమ్ దేవ్ రావు, కెప్టెన్ సి. దయాకర్ రెడ్డి, కార్యదర్శి శ్రీకాంత్ రావు, పిజిటిఐ సిఇఒ ఉత్తమ్ సింగ్, భారత పర్యాటక మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఐఎఎస్ రశ్మీ వర్మతోపాటు 123 మంది గోల్ఫ్ క్రీడాకారులు పాల్గొన్నారు. టోర్నీ ప్రైజ్ మనీ రూ. 30 లక్షలు. ఈ సందర్భంగా హెచ్‌జిఎ అధ్యక్షుడు జె. విక్రమ్ దేవ్ రావు మాట్లాడుతూ ప్రతిష్టాత్మక పిజిటిఐ టోర్నమెంట్‌కు హైదరాబాద్ ఆతిథ్యమివ్వడం గర్వంగా ఉందన్నారు.

ఐస్ హాకీ విజేత అమెరికా మహిళా జట్టు

- పెనాల్టీ షూటౌట్‌లో కెనడా ఆధిపత్యానికి అమెరికా చెక్
- వింటర్ ఒలింపిక్స్ 2018

ప్యాంగ్‌చాంగ్: దక్షిణ కొరియాలో జరుగుతున్న శీతాకాల ఒలింపిక్స్ ఐస్ హాకీలో అమెరికా మహిళా జట్టు బుధవారం స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. దాదాపు 20 ఏళ్ల తర్వాత ఈ గెలుపును సాధించింది. ఐస్ హాకీలో అమెరికా మహిళా జట్టు తన ప్రత్యర్థి జట్టు కెనడాను 3–2తో పెనాల్టీలో ఓడించింది. దీనికి ముందు రెండు జట్లు 2–2 స్కోరుతో సమంగా ఉన్నాయి. కానీ గెలుపు గోల్‌ను జోసీల్నే లామ్రోక్స్–డేవిడ్సన్ చేసింది. కెనడాకు చెందిన మెఘాన్ అగోస్టా నిర్ణయాత్మక గోల్‌ను అమెరికా గోల్‌టెండర్ మాడీ రూనీ ఎదుర్కోడంతో అమెరికా జట్టుకు ఆనందానికి అవధులు లేకుండా పోయింది. నాలుగుసార్లు డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఉన్న కెనడాను 24వ ఒలింపిక్ పోటీలో అమెరికా గెలిచింది. కెనడా ఐదోసారి ఒలింపిక్ గోల్డ్ కోసం ప్రయత్నించింది కానీ విఫలమైంది. కెనడా ఇదివరలో 2002, 2010, 2014లో అమెరికాను ఓడించింది.



పిఎస్‌ఎల్ 2018 షురూ!

- ఈసారి సీజన్‌లో 5 కాదు.. 6 టీమ్‌లు

దుబాయ్: పాకిస్థాన్ సూపర్ లీగ్(పిఎస్‌ఎల్) మూడో సీజన్ గురువారం దుబాయ్‌లో ఆరంభమైంది. ఈ ఏడాది ఆరో టీమ్‌ను కూడా చేర్చారు. దీంతో మరింత మంది అంతర్జాతీయ ఆటగాళ్లకు అవకాశం లభించింది. 'ముల్తాన్ సుల్తాన్స్' అనేది కొత్తగా చేరిన టీమ్. ఈ సీజన్‌లో బ్రెండన్ మెక్కలమ్, షేన్ వాట్సన్ వంటి ప్రముఖ క్రికెటర్లు పాలుపంచుకుంటున్నారు. తదుపరి సీజన్ నుంచి ఈ టోర్నమెంట్‌ను పాకిస్థాన్‌లోనే నిర్వహించాలని నిర్వాహకులు భావిస్తున్నారు. ఈ ఏడాది లాహోర్, కరాచీల్లో మూడు తుది దశ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. ముల్తాన్ సుల్తాన్స్ టీమ్‌కు వసీమ్ అక్రం, సోయబ్ మలిక్ కోచింగ్ ఇచ్చారు. సుల్తాన్స్ జట్టు డిఫెండింగ్ జట్టు పెషావర్ జల్మీతో ఆరంభ మ్యాచ్‌లో తలపడనున్నది. ఈసారి పిఎస్‌ఎల్ లో పాల్గొంటున్న జట్లు: కరాచీ కింగ్స్, లాహోర్ కలందర్స్, ఇస్లామాబాద్ యునైటెడ్, క్వెట్టా గ్లాడియేటర్స్, ముల్తాన్ సుల్తాన్స్, పెషావర్ జల్మీ. పాకిస్థాన్ సూపర్ లీగ్ (పిఎస్‌ఎల్) మ్యాచ్‌లు ఫిబ్రవరి 22 నుంచి మార్చి 25 వరకు జరగనున్నాయి.



బరోడాపై సౌరాష్ట్ర విజయం

- విజయ్ హజారే టోర్నమెంట్

న్యూఢిల్లీ: సౌరాష్ట్ర జట్టు బరోడా జట్టును బుధవారం మూడు వికెట్ల తేడాతో ఓడించి విజయ్ హజారే టోర్నమెంట్ సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించింది. కాగా మహారాష్ట్ర జట్టు, కర్నాటక జట్టుతో తొలి సెమీఫైనల్స్ ఆడనున్నది. క్వార్టర్ ఫైనల్స్‌లో గెలిచిన సౌరాష్ట్ర సెమీఫైనల్లో ఆంధ్ర జట్టుతో తలపడనున్నది. బరోడా పెట్టిన 248 లక్ష్యాన్ని సౌరాష్ట్ర జట్టు 48.4 ఓవర్లలోనే అధిగమించేసింది. సౌరాష్ట్ర జట్టులో ఓపెనర్ అవి బరోట్, కెప్టెన్ ఛతేశ్వర్ పుజార, అర్పిత్ వసవడ విజయానికి ప్రధాన పాత్ర పోషించారు. బరోడా జట్టు 22.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 105 వద్ద క్లిష్ట పరిస్థితిలో ఉండగా ఆ జట్టులోని కృనాల్ పాండ్య(75 బంతుల్లో 61 పరుగులు), సోయబ్ తాయ్(91 బంతుల్లో 72 పరుగులు) చేశారు. ఈ ఇద్దరు దాదాపు 21 ఓవర్ల పాటు స్థిరంగా ఆడి ఎనిమిదవ వికెట్‌కు 97 పరుగులు జోడించారు. కృనాల్ పాండ్య ఔటయ్యాక తాయ్ మరి 45 పరుగులను లుక్మాన్ మెరివాల(9) కలసి జోడించాడు. 9వికెట్‌కు బరోడా జట్టు 250కు చేరింది. చిరాగ్ జానీ మీడియం పేస్‌తో 35 పరుగులకు 4 వికెట్లను తీయడం, ప్రేరక్ మన్‌కడ్ 29 పరుగులకు 2 వికెట్లు తీయడం చాలా ప్రభావం చూపించింది.



లక్ష్యఛేదనకు దిగిన సౌరాష్ట్ర ఓపెనర్ సమర్థ్ వ్యాస్, భారత జట్టు మాజీ ఆటగాడు రాబిన్ ఉతప్ప 45 పరుగులకే పెవిలిన్ చేరారు. కానీ బరోత్, పుజార మూడో వికెట్‌కు 102 పరుగులు జోడించారు. పుజార తన 66 పరుగుల స్కోరులో ఐదు ఫోర్లు బాదాడు. 105 పరుగులు చేసిన బరోత్ ఎనిమిది బౌండరీలు దంచేశాడు. అతీత్ సేథ్ బౌలింగ్‌లో పుజారను విష్ణు సోలంకి క్యాచౌట్ చేశాడు. 5 వికెట్ల నష్టానికి సౌరాష్ట్ర 181 పరుగులు చేసింది. పరిస్థితి గడ్డుగా ఉన్న సమయంలో వసవడ, జానీ(25) కలసి ఆరో వికెట్‌కు 40 పరుగులు జోడించారు. దాంతో బరోడా ఆశలు చిగురించాయి. తమ జట్టు లక్ష్య ఛేదన చేసిన తీరుకు తానెంతగానో సంతోషిస్తున్నానని సౌరాష్ట్ర కోచ్ శితాంశు కొటక్ విలేకరులతో అన్నారు. నొప్పి నుంచి రవీంద్ర జడేజా కోలుకుంటున్నాడని, ఆంధ్రతో ఆడే సెమీ ఫైనల్ మ్యాచ్‌లో ఆడతాడని కోచ్ తెలిపాడు.

క్లుప్తంగా స్కోర్లు:

బరోడా: 247/8 (కృనాల్ పాండ్యా 61/75, సోయబ్ తాయ్ 72/91 బంతులు, చిరాగ్ జానీ 4/25)

సౌరాష్ట్ర: 251/7(48.4 ఓవర్లు) (అవి బరోత్ 82/105, ఛెతేశ్వర్ పుజార 40/66, అర్పిత్ వతవడ 45/43 బంతులు)

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.